సామాజిక, రాజకీయ పక్షపత్రిక

25 జూన్ 2017
పేజీలు : 36
వెల : 10/-

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల




## భూఅవినీతిలో కూరుకుపోయిన TRS ప్రభుత్వం

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల

సామాజిక, రాజకీయ పక్షపత్రిక

సంపుటి:27 | సంచిక:15 | 25 జూన్ 2017


## ఈ సంచికలో...


- తెలంగాణ ప్రజలు ధర్మయుద్ధ సన్నద్ధులు కావాలి! ...03
- ఆదర్శ నేత శ్యామా ప్రసాద్ ముఖర్జీ ...04
- కోర్టు పరిధిలో హైకోర్టు విభజన ...05
- ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములుకు ఘన సన్మానం ...06
- భూఅవినీతిలో కూరుకుపోయిన టీఆర్ఎస్ ప్రభుత్వం...07
- భూములు ఎరగావేసి పార్టీ ఫిరాయింపులు ...11
- జూన్ 25 వరకు విస్తార్ యోజన ... 12
- గ్రామస్థాయికి బిజెపి సిద్ధాంతం: అమిత్ షా ...13
- కేరళ: హింసతో బిజెపిని ఆపలేరు ...15
- రైతుల దుస్థితికి కారణం కాంగ్రెస్ కాదా? ... 16
- పండగలా సబ్కాసాథ్ సబ్కా వికాస్ సమ్మేళనాలు ... 18
- ఏకాత్మ మానవ దర్శన అవసరం! ... 20
- జన సంఘ్ ఎందుకు? ...21
- నాలుగు దేశాల పర్యటనతో నాలుగువందల లాభాలు...23
- విశ్వవేదికపై భారత్‌కు జేజేలు ...24
- ప్రజాస్వామ్యానికి చీకటి రోజులు ఎమెర్జెన్సీ ...25
- నాణ్యమైన విద్యపై ఎన్‌డిఎ దృష్టి ...26
- వచ్చే ఎన్నికల్లోనూ బిజెపిదే విజయం ...27
- ధర్మరక్షకులకు శాపాలు వరాలవుతాయ్! ...28
- 813 కోట్ల పని దినాలు ...29
- కశ్మీర్ లోయలో వేర్పాటువాదంపై ఉక్కుపిడికిలి ...30
- ఆధిపత్య పోరులో కులభూషణ్ బలి ...31
- వ్యవసాయాభివృద్ధిపై స్పష్టత లోపించిన కేసీఆర్ ...32



మీ వార్తలు, సంబంధిత ఫోటోలు (ఫోటోలోని వారి పేర్లు, బాధ్యతలతో సహా) మెయిల్‌ద్వారా కూడా జనసందేశ్‌కు క్షణాల్లో పంపించవచ్చు. మీరు పంపవలసిన చిరునామా (ఈ-మెయిల్): janasandesh@yahoo.co.in

janasandeshmag@gmail.com

Phone No :040 24650866



Editor, Printer & Publisher : **MANTHRI SRINIVASULU**
on behalf of Bharateeya Janata Party and
Printed at Kala Jyothi Process Pvt. Ltd., RTC 'X' Roads, Hyderabad.
Published at: Dr.Shyam Prasad Mukharji Bhavan,
Opp: Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.


# సంపాదకీయం

## తెలంగాణ ప్రజలు ధర్మయుద్ధ సన్నద్ధులు కావాలి!

తెలంగాణలోని మియాపూర్, మేడ్చల్, శంషాబాద్, ఇబ్రహీంపట్నంలో వేల ఎకరాల భూమి కబ్జాకు గురైందని కథనాలు వస్తున్నాయి. తెరాసకు చెందిన ఇద్దరు రాజ్యసభ సభ్యుల బంధువుల పేరిట ప్రభుత్వ భూములు రిజిష్టరు అయినట్లు వార్తలు వచ్చాయి.

ఒక్క సెంటు ప్రభుత్వ భూమి కూడా కబ్జాకు గురికాలేదని సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆరోపణలకు గురైన తెరాస రాజ్యసభసభ్యుడు మాత్రం రిజిస్ట్రేషన్లు రద్దుచేయించుకొంటామని వెల్లడించారు. అంటే లావాదేవీల్లో అక్రమాలు జరిగింది నిజమనే కదా! తెలంగాణలో భూముల రిజిష్ట్రేషను అధికారుల, వారి బంధువుల ఇళ్లమీద దాడులు జరిపి అక్రమాలకు సంబంధించిన ఆధారాల సేకరణకు ప్రయత్నం జరుగుతున్నది కూడా అందుకే కదా!

'అంతా సక్రమమే' అని తెలంగాణ ముఖ్యమంత్రి ఈ విషయం మీద వివరణ ఇచ్చారంటే భారీ కుంభకోణమే జరిగి ఉంటుందని ప్రజలు నిర్ధారించుకుంటున్నారు. భూమి కుంభకోణాలకు సంబంధించిన ఆరోపణలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి నిజానిజాలను నిగ్గుతేల్చాలని, దోషులను దండించాలని, కబ్జాకోరుల బారి నుండి భూమిని రక్షించాలని కోరుతున్న తెలంగాణ ప్రజల సహేతుకమైన విన్నపాన్ని తెలంగాణ ప్రభుత్వం తోసిపుచ్చడం విస్మయం కలిగిస్తున్నది.

చట్టసభల్లోని సంఖ్యాబలాధిక్యత చూచుకుని సర్వోన్నతులమని విర్రవీగితే టిఆర్ఎస్ ప్రభుత్వంకు భంగపాటు తప్పదు. ఎన్నికల వాగ్దానాలను నమ్మి తామిచ్చిన మద్దతును, ఆపైన ప్రలోభపెట్టి, ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రత్యర్థి వర్గీయులను లోబరచు'కొన్న' బలగర్వంతో పాలకులు ధర్మాతిక్రమణకు పాల్పడితే ప్రజలు క్షమించరు. ఏ ఆదర్శసిద్ధికి, లక్ష్యాల ప్రాప్తికి ప్రజలు ఒక ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారో ఆ లక్ష్యాలు, ఆదర్శమే ప్రభుత్వం కన్నా అధిక ప్రాధాన్యత కలిగి ఉంటాయి. ప్రజల ముందుంచిన ఆశయ ఆదర్శాల సాకారానికి అనువైన పరిస్థితులను కల్పించి, నిర్వహిస్తూ ధర్మాన్ని సంరక్షించడమే అధికారపీఠాలను అధిరోహించిన పాలకుల కర్తవ్యం.

ప్రజాస్వామ్యంలో ప్రజల ఉమ్మడి సొత్తు అయిన ప్రభుత్వ భూములను, బడుగు బలహీన వర్గాలకు కేటాయించిన, ధార్మిక సంస్థలకు చెందిన భూములను సంరక్షించడం ప్రభుత్వ బాధ్యత. కంచే చేను మేసినట్లు పాలకులే ప్రత్యక్షంగా, పరోక్షంగా భూకబ్జాదారులకు అండనిలుస్తున్న వైఖరి క్షంతవ్యం కాదు.

ధర్మదూరుడైన వేన రాజును తొలగించి, రుషులు పృథును పట్టాభిషిక్తుణ్ణి చేసిన చరిత్ర మనది. ప్రజాస్వామిక వ్యవస్థలో కూడా ధర్మానుగుణంగా వ్యవహరించని పాలకులను తొలగించడం ప్రజల కర్తవ్యం అవుతుంది. ఈ విషయమై పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ అర్ధశతాబ్దికి పూర్వం తెలుగింటి రాజకీయ రాజధానిగా పేరొందిన విజయవాడ గడ్డపై నుండి భారతజాతికి వినిపించిన రాజనీతి సారాన్ని తెలంగాణ ప్రజలు మరలా గుర్తుచేసుకోవాలి. ధర్మాతిక్రమణకు బాధ్యులైన పాలకులను తొలగించే ధర్మయుద్ధానికి తెలుగు ప్రజలు సన్నద్ధులు కావాలి. బిజెపి శ్రేణులు ముందు నిలిచి ఈ ధర్మపరిరక్షణ కార్యాన్ని నడిపించాలి!

సంస్మరణ

# ఆదర్శ నేత శ్యామా ప్రసాద్ ముఖర్జీ



(జూన్ 23న డా॥ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్, జూలై 6న జయంతి సందర్భంగా వారిపై పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ రాసిన వ్యాసం జనసందేశ్ పాఠకుల కోసం)

డా॥ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బెంగాల్ వెలుపల ప్రసంగాలు చాలా వరకు హిందీలోనే ఉండేవి. ఆయన మొదటిసారి హిందూ మహాసభ సమావేశానికి హాజరైనప్పుడు హిందీలో మాట్లాడలేక పోయారు. కాని హిందీ నేర్చుకుంటానని వాగ్దానం చేసి మరుసటి సంవత్సరం హిందీలో ప్రసంగించారు. అయితే ఆయన వ్యాకరణరీత్యా స్వచ్ఛమైన హిందీ మాట్లాడగలరని ఆశించలేం. కాని తాను చెప్పదలచుకున్న విషయాన్ని సరిగ్గానే చెప్పేవారు. చాలా శక్తిమంతంగా మాట్లాడే వారు.

### హిందీపై మక్కువ

భారతీయ జనసంఘ్ ప్రారంభ సమావేశానికి ఆయన తన ప్రసంగ పాఠం ఇంగ్లీషులో రాశారు. కాని ప్రతినిధులకు ఆ ప్రసంగ పాఠాన్ని హిందీలో అందించాలనుకున్నారు. అది అక్టోబర్ 20వ తేదీ. ఆయన మరుసటి రోజు ఉదయం ప్రసంగించవలసి ఉంది. అదీ కాక చర్చనీయాంశాలు నిర్ణయించే కమిటీ సమావేశం కూడా 20వ తేదీనే ఉంది. ఆయన హిందీ ప్రసంగ పాఠం అందించాలన్న పట్టుదలతో ఉన్నారు. అందువల్ల అధ్యక్ష ప్రసంగ పాఠాన్నే కాక ప్రణాళికను కూడా హిందీలోకి అనువదించారు. అయితే డా॥ ముఖర్జీ తన ప్రసంగ పాఠాన్ని చదవలేదు. ఆయన ప్రసంగం అనువాదం కన్నా బాగా సాగింది.

### 'సర్వనాశ్' బదులు 'ఖతర్నాక్'

హిందీ ప్రసంగాలలో డా॥ ముఖర్జీ యథేచ్ఛగా సంస్కృత పదాలు వాడేవారు. సంస్కృతం వాడినందువల్ల ఆయన ప్రసంగం విలక్షణంగా ఉండేది. సర్వనాశ్ అన్న మాటకు బదులు ఆయన ఖతర్నాక్ అన్న మాటే వాడేవారు. తప్పుడు పదం వాడుతున్నారని ఆయనకు తెలుసు. పొరపాటు ఎత్తిచూపడానికి మేం సందేహించాం. ఒకరోజు యథాలాపంగా భాష మీద చర్చ జరిగింది. ఖతర్నాక్ సరైన పదం కాదని నేను ఆయనతో అన్నాను. సర్వనాశ్ లేదా సత్యనాశ్ అంటే బాగుంటుందని సూచించాను. కాని ఖతర్నాక్‌కు సర్వనాశ్‌కు మధ్య అర్థఛాయ ఉంది కదా అన్నారు. తేడా ఉన్న మాట నిజమే. ఇతర ప్రతిపక్ష నాయకులకు, డా॥ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి మధ్య ఉన్న తేడా ఇదే. డా॥ ముఖర్జీ ఎప్పటికీ జాగరూకంగా ఉండే వారు. ప్రభుత్వ విధానాల్లో తప్పులను ఆయన ఎప్పుడూ ఎత్తి చూపేవారు. అయితే ఆయన నిరాశావాది కాదు. తప్పులు వెతికే వారూ కాదు. అందుకే ఆయన ఖతర్నాక్ అన్న మాట కల్పించారు. పర్షియన్ భాషలోని ఖత్రా సంస్కృతంలోని నాశ్ అన్న మాటలను కలిపి ఆయన ఖతర్నాక్ అన్న మాట వాడారు. ముప్పును నివారించకపోతే కలిగే ప్రమాదాన్ని ఎత్తి చూపడానికి ఆయన ఈ మాట వాడేవారు. ఈ అంతరార్థాన్ని గ్రహించగలిగితే ప్రభుత్వాన్ని అర్థ రహితంగా విమర్శించడం ప్రతిపక్షం పని కాదని, నిర్మాణాత్మక విమర్శ ప్రతిపక్షం బాధ్యత అని అర్థం అవుతుంది. విధాన నిర్ణయాలలో నిర్మాణాత్మక విమర్శల అవసరం ఉన్నందువల్లే ప్రతిపక్షాల అవసరం ఉంటుంది. ప్రతిపక్షం పని తప్పుదారి పట్టించడం కాదు. మార్గం చూపించడం. ప్రతిపక్షం విధి ప్రతికూలంగా ఉండకూడదు. సానుకూలంగా ఉండాలి. ప్రభుత్వం నిర్లక్ష్యంగా, ఉదాసీనంగా ఉండకుండా చూడాలి. అయితే ప్రజలను బెదరగొట్టకూడదు, వారి స్థైర్యాన్ని దెబ్బ తీయకూడదు.

మొదటి సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. చాలా మంది ప్రతిపక్ష నాయకులు ఓడిపోయారు. మార్పు తీసుకొస్తామని వాగ్దానం చేసిన పార్టీలు తుడిచిపెట్టుకుపోయాయి. ఆ స్థితిలో ఒక వ్యక్తి డా॥ ముఖర్జీ దగ్గరకు వచ్చి దేశంలో ప్రజాస్వామ్యానికి అవకాశం తక్కువగా ఉంది అని అన్నారు. డా॥ ముఖర్జీ ఆయనను రెండు ప్రశ్నలు అడిగారు. 1. మీకు ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఉందా? 2. మీరు కృత నిశ్చయంతో రాజకీయాలలో పని చేయాలనుకుంటున్నారా? ఈ రెండు ప్రశ్నలకు ఆ వ్యక్తి అవును అని సమాధానం ఇచ్చారు. అలాంటప్పుడు ప్రజాస్వామ్యానికి అవకాశం తక్కువగా ఎలా ఉంటుంది అని ముఖర్జీ ప్రశ్నించారు. "మన పని చేయకపోతే, నమ్మకం లేకపోతేనే అంధకార బంధురంగా ఉంటుంది. విశ్వాసం ఉన్న చోట అంధకారం ఉండదు. అవకాశం దండిగా ఉంటుంది" అని ముఖర్జీ తెలియజేశారు. మనకు చాలాసార్లు "నాయకులు" తారస పడతారు. కాని వారిలో చాలా మంది ప్రజలలో నమ్మకం కలిగించలేరు. దీనికి బదులుగా యువకులకు ఉండే విశ్వాసంతో జనం దగ్గరకు వెళ్తే సంకోచంతో తిరిగి వస్తాం. శ్యామ ప్రసాద్ ఇలాంటి వారు కారు. మేం ఆయన దగ్గరకు వెళ్లినప్పుడు ఓటమి అంగీకరించి విచారంతో లేరు. విజయం సాధించాలంటే కష్టపడి పని చేయాలన్నారు. "ఎన్నికలలో జన సంఘ్ పరిస్థితి మెరుగ్గానే ఉంది. మిగతా పార్టీలకు పరువే పోయింది. కాని మీ పార్టీ అధ్యక్షుడు గెలిచారు" అన్నారు. నిరాశయమయ వాతావరణంలో అది వెలుగు రేఖే. దాని వల్ల భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందనే నమ్మకం మాకు కలిగింది.

### దారి దీపం

డా॥ ముఖర్జీ లాంటి వారు మన మధ్యన లేరు. ఎవరైనా మీతో భవిష్యత్తు అంధకార మయంగా ఉందని అంటే వారికి విశ్వాసం లేదని, ప్రయోజన రహితులని తోసిపుచ్చండి. భవిష్యత్తు నిర్మాతలం మనమే. దేశ చరిత్ర నిర్మాణంలో మనం కేవలం ప్రేక్షకులం కాదు. క్రియాశీల భాగస్వాములం. అధికారంలో ఉన్న వారు పొరపాట్లు చేస్తే వాటిని సరిదిద్దే బాధ్యత మనదే. వారి వైఫల్యాలను చూసి పైశాచిక ఆనందం అనుభవించకూడదు. తప్పులు చేశారని ఎత్తి చూపి కిమ్మనకుండా కూర్చోకూడదు. అప్పగించిన బాధ్యతను నెరవేర్చని ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలను సమీకరించవలసిన బాధ్యత కూడా మనదే. డా॥ ముఖర్జీ మనకు ఈ నిర్మాణాత్మక దృక్పథం అందించారు. ఆయన అధికారం సంపాదించాలన్న దృష్టితో ప్రతిపక్షంలో ఉన్నారు. ప్రతిపక్షం అంటే కేవలం అవరోధాలు కల్పించేది కాదు. దేశ పరిపాలనలో ఉత్ప్రేరకంగా పని చేయాల్సిన పక్షం. ఈ వైఖరి ఉంటేనే ప్రజాస్వామ్యం విజయవంతమై మన జాతీయ ప్రయోజనాలను పరిరక్షించు కోగలుగుతాం.■



మనం చేస్తున్నది పేదరికంపై పోరాటం. వారి లోపల దాగున్న ప్రతిభను జాగృతంచేసి విజయం సాధిద్దాం.

వర్తమానం

# కోర్టు పరిధిలో హైకోర్టు విభజన

హైకోర్టు విభజనకే కేంద్రం సిద్ధంగా ఉందని, అయితే ఈ అంశం న్యాయస్థానాల పరిధిలో ఉండడంతో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి పిపి చౌదరి స్పష్టం చేశారు. హైదరాబాద్ హైకోర్టుకు త్వరలో ఆరుగురు న్యాయ మూర్తులను నియమించనున్నట్టు చెప్పారు. తెలంగాణ బిజెపి న్యాయవాదుల విభాగం జూన్ 18న ఏర్పాటు చేసిన అడ్వకేట్ల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి పిపి చౌదరి హైకోర్టు విభజన అంశంపై కోర్టులో మూడు పిటిషన్లు దాఖలయ్యాయన్నారు. రెండు రాష్ట్రాల పిటీషన్‌లే కాకుండా మరో ప్రైవేటు పిటిషన్ కూడా దాఖలైందని చెప్పారు. తీర్పురాగానే అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కలిసి తమకు నివేదిక అందిస్తే అందుకు తగినవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలన్నింటినీ అమలు చేస్తున్నామన్నారు. ఈ చట్టం ప్రకారం పదేళ్ల రెండు రాష్ట్రాల హైకోర్టు హైదరాబాద్‌లో ఉండే వీలుందని తెలిపారు. అయితే ఏపీలో రాజ్‌భవన్, సచివాలయం, హైకోర్టు నిర్మాణానికి కేంద్రం ఇదివరకే రూ.500 కోట్ల కేటాయించిందని గుర్తు చేశారు. హైకోర్టు నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థలం సిద్ధం చేసినట్టు తమకు సమాచారం ఉందన్నారు. తెలుగు రాష్ట్రాలకు ఆరుగురు న్యాయమూర్తులను నియమించనున్నట్టు తెలిపారు. మిగతా నియామకాలకు సంబంధించిన అంశం కొలిజీయం పరిశీలనలో ఉందన్నారు. న్యాయమూర్తుల నియామకాల్లో మహిళలకు అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ ఉందన్న విషయాన్ని కొలీజియంకు తెలియజేశామని వివరించారు. ఓబిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా న్యాయవాదుల్లో అర్హులైన వారున్నారని ఆయన తెలిపారు.




### కాంగ్రెస్‌పై విమర్శలు

కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఏమీ చేయకపోయినా, ప్రచార ఆర్భాటం అధికంగా ఉండేదని పిపి చౌదరి విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మకమైన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజెపి అడ్వకేట్స్ విభాగాన్ని కోరారు. ప్రధాని మోదీ పాలనలో అవినీతి లేదని, ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఆయన తెలిపారు. 60 ఏళ్ళలో కాంగ్రెస్ చేయలేని పనులను మూడేళ్ళలో చేసి చూపిస్తున్నామని ఆయన తెలిపారు. పెద్ద నోట్ల రద్దుతో నల్లధనం బయటకు వచ్చిందని, అవినీతి తగ్గిందని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో గ్రామ పంచాయతీల్లో వైఫై సేవలందించనున్నట్లు తెలిపారు.

### న్యాయమూర్తులను నియమించాలి

బిజెపి న్యాయ వాదుల సమావేశంలో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి దత్తాత్రేయ మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టులో 61 మంది న్యాయమూర్తులు ఉండాలి, కానీ కేవలం 24 మంది మాత్రమే ఉన్నారని అన్నారు. 37 మంది న్యాయమూర్తుల స్థానాలు ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీకి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కేంద్ర మంత్రి పిపి చౌదరిని కోరారు. మహిళలను న్యాయమూర్తులుగా నియమించాలని ఆయన కోరారు. హైకోర్టును విభజించి ఏపీకి వేరు చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి కేంద్రాన్ని తప్పు పడుతున్నారని ఆయన చెప్పారు. ఇద్దరు సిఎంలూ చర్చించి కేంద్రం దృష్టికి తీసుకెళ్ళాలని సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ 1100 పనికిరాని చట్టాలకు చరమగీతం పాడారని తెలిపారు. కార్మికశాఖలో 44 చట్టాలను నాలుగుకు కుదించనున్నట్టు దత్తాత్రేయ వివరించారు.


### మండలాల్లో అడ్వకేట్స్ కమిటీలు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మన్ ప్రసంగిస్తూ రాష్ట్ర పార్టీకి అనుబంధంగా ఉన్న అడ్వకేట్స్ కమిటీని కింది స్థాయి వరకూ తీసుకెళ్లాలని సూచించారు. మండల, పోలింగ్ కేంద్రాల స్థాయిలోనూ అడ్వకేట్స్ కమిటీలను నియమించాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక హక్కులు కాలరాస్తున్నదని విమర్శించారు. హక్కుల కోసం మళ్ళీ ఉద్యమించాల్సి ఉందన్నారు. అవినీతి, అక్రమాలు, కుటుంబ పాలనను ఆయన తూర్పారపట్టారు. ప్రజా సమస్యలపై న్యాయవాదులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల భ్రమలు తొలిగిపోయాయని అన్నారు. కాంగ్రెస్‌కు ప్రజలు ఓట్లు వేయరని డాక్టర్ లక్ష్మన్ తెలిపారు. పార్టీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు మాట్లాడుతూ భూ కుంభకోణాలపై పార్టీ అడ్వకేట్స్ కమిటీ పోరాటం చేయాలని కోరారు.

**-జనసందేశ్ ప్రతినిధి**

వర్తమానం



# ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములుకు ఘన సన్మానం

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితుడైన రాములును బిజెపి తెలంగాణ ఘనంగా సన్మానించింది. ఎస్సీ కమిషన్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి జూన్ 4న హైదరాబాద్ వచ్చిన రాములుకు బిజెపి నేతలు, కార్యకర్తలు, దళిత సంఘాలు ఘనస్వాగతం పలికాయి. బిజెపి రాష్ట్ర కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు పాల్గొని రాములును అభినందనలతో ముంచెత్తారు.

ఈ సభలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥కె.లక్ష్మన్ మాట్లాడుతూ... సమ సమాజ స్థాపన కోసం డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ రిజర్వేషన్లను ప్రవేశపెడితే ఆ స్ఫూర్తికి విరుద్ధంగా టీఆర్ఎస్ ఎస్సీ రిజర్వేషన్లను నీరుగారుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియామకాలు, ప్రమోషన్లు చేపట్టక దళితులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. తెలంగాణలో బ్యాక్‌ల్యాగ్ పోస్టులను భర్తీ చేసి దళితులకు న్యాయమైన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. అంకితభావం, పట్టుదల, చిత్తశుద్ధి ఉన్న రాములుకు ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితులు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. బిజెపి దళితులకు పెద్దపీట వేస్తుందనడానికి రాములు నియామకం ఓ ఉదాహరణగా చెప్పారు. స్వయంగా పేదరికం అనుభవించిన నరేంద్రమోదీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. మూడేళ్లలో పేదలు, అట్టడుగు వర్గాలు, దళితుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు మోదీ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. గత ప్రభుత్వాలు దళితులను ఓటుబ్యాంకుగానే చూశాయి తప్పితే వారి సంక్షేమం కోసం కృషి చేయలేదని విమర్శించారు.

బిజెపిలో పనిచేసే కార్యకర్తలకే గుర్తింపు లభిస్తుందనడానికి రాములుకు ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితుడు కావడమే ఓ నిదర్శనమని అన్నారు. గత అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం కానీ.. ప్రస్తుత నరేంద్రమోదీ ప్రభుత్వం కానీ.. తెలంగాణ దళితులను సముచిత రీతిలో సత్కరించిందని తెలిపారు. వాజ్‌పేయి హయాంలో రాష్ట్రం నుంచి బంగారు లక్ష్మణ్, చింతా సాంబమూర్తి, దేవేందర్ వంటివారికి పదవులిస్తే మోదీ ప్రభుత్వం రాములును ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమించిందని తెలిపారు. రాములును సన్మానించడమంటే సామాన్య కార్యకర్తను సన్మానించినట్లేనని అభివర్ణించారు. సమాజం కోసం, దళిత సంఘాల కోసం, పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న రాములుకు వెన్నంటి నిలిచిన ఆయన సతీమణి లక్ష్మీభాయికీ ఈ ఖ్యాతి దక్కుతుందని తెలిపారు. పేద కుటుంబం నుంచి పైకి ఎదిగిన నేత రాములు ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితులు కావడం వల్ల పేదలకు దళితులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమితుడైన రాములకు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు అభినందనలు తెలిపారు. బిజెపి ఓ సామాన్య కార్యకర్తకు గుర్తింపు ఇస్తుందనడానికి రాములు నియామకం ఓ నిదర్శనం అన్నారు. రాములుకు దక్కిన ఈ పదవితో తెలంగాణలో దళిత నాయకులకు బలం పెరిగిందని అన్నారు. చురుకైన నాయకుడైన రాములు ఎస్సీ కమిషన్ సభ్యుడు కావడం పట్ల యావత్ తెలంగాణ దళిత సమాజం హర్షం వ్యక్తం చేస్తుందని బిజెపి శాసనసభాపక్షనేత జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆయన దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అంకితభావంతో పనిచేసి తన పదవికి న్యాయం చేస్తారని నమ్మకంగా చెప్పారు.

### ఎమ్మెల్యే అవుదామనుకున్నా మంత్రిని చేశారు

తాను ఎమ్మెల్యే కావాలనుకున్నానని కానీ పార్టీ తనను మంత్రిని చేసిందని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి కేంద్రమంత్రి దత్తాత్రేయ తర్వాత క్యాబినెట్ ర్యాంకు ఉన్న రెండవ వ్యక్తి కావడం సంతోషంగా ఉందన్నారు. వెంకయ్య నాయుడు చొరవతోనే తనకు ఈ పదవి లభించిందని, తనకు అన్నివేళల ప్రోత్సహించిన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఒక సామాన్య కార్యకర్త అయిన తనకు క్యాబినెట్ ర్యాంకు పదవి దక్కడం బిజెపిలోనే సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ లాంటి పార్టీల్లో కోట్లు వెదజల్లి పదవులు కొనుక్కుంటారని, కానీ బిజెపిలో మాత్రం పనిచేసే కార్యకర్తకే పదవులు వరిస్తాయని కుండబద్దలు కొట్టారు. తనకు ఎస్సీ కమిషన్ సభ్యత్వం పదవి కాదని సేవ చేయడానికి దక్కిన అవకాశంగా భావిస్తానని అన్నారు. దళిత సంఘాలతో కలిసి పనిచేసిన అనుభవంతో, దళితుల సమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు చేసిన వ్యక్తిగా వారి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని నివారించడంతో పాటు దళితుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తానని తెలిపారు. బిజెపితోనే దళితులకు మేలు కలుగుతుందని, కులం, మతం, వర్గం, వర్ణం లాంటి భేదాలు లేకుండా అందరి సంక్షేమం కోసం నరేంద్రమోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల చంద్రశేఖర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా సాంబమూర్తి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వేముల అశోక్ సహా బిజెపి నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

–జనసందేశ్ ప్రతినిధి



ప్రభుత్వం ఏ పార్టీదైనా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలి. – దీన్‌దయాళ్జీ




# భూఅవినీతిలో కూరుకుపోయిన TRS ప్రభుత్వం

ముఖచిత్ర కథనం

కృష్ణ సాగర్ రావు
బిజెపి తెలంగాణ అధికార ప్రతినిధి

నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు తెలంగాణ ఉద్యమానికి ప్రేరణనిచ్చిన మరో అంశం.. భూ ఆక్రమణలు..! ఆంధ్ర పాలకులు ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు తెలంగాణ భూములను యథేచ్ఛగా కబ్జా చేశారు. వైఎస్ హయాంలో అయితే కాదేదీ కబ్జాలకు అనర్హం అన్న చందంగా నాలాలు, చెరువులు, కుంటలు, పోరంబోకు భూములు, వక్ఫ్ స్థలాలు, అసైన్డ్, భూదాన్ భూములు వేటినీ వదిలిపెట్టకుండా గద్దల్లా తన్నుకుపోయి కోట్లకు పడగలెత్తారు. నేటి ప్రభుత్వ పెద్దలు  నాటి ఉద్యమకారులుగా భూఅక్రమార్కులపై ఒంటికాలి మీద లేచారు. కాలచక్రం గిర్రున తిరిగి నాటి ఉద్యమకారులు నేడు అధికారంలోకి వచ్చేసరికి ఆ భూఅక్రమార్కులే వీరికి ఆదర్శంగా మారారు. హైదరాబాద్, చుట్టుపక్కలున్న రంగారెడ్డి జిల్లా భూములను పప్పు బెల్లాల్లా ఆరంగించేస్తున్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ పెద్దలు, వారి సంబంధీకులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. తమకు కావాల్సిన వాళ్లను కావాల్సిన చోట నియమించుకొని పథకం ప్రకారం భూములను వివాదాస్పదం చేస్తున్నారు. వేల కోట్లు విలువ చేసే భూములను అవినీతి అధికారుల సహకారంతో కొల్లగొడుతున్నారు. ముఖ్యమంత్రి పేషీ నుంచే ఆదేశాలు అందుతుండడంతో అమ్యామ్యాలకు అలవాటు పడిన అధికారులు స్వామి కార్యం, స్వకార్యం నెరవేరుస్తున్నారు. సహకరించని వారిని, సమస్యలు సృష్టించేవారిని బదిలీలతో తప్పించి విలువైన స్థలాలను స్వాహా చేస్తున్న టీఆర్ఎస్ నేతాగణం వేల కోట్ల కుంభకోణాల్లో పీకల్లోతు కూరుకుపోయారు.



మొన్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ... నిన్న టీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ ఎంపీ కే.కేశవరావు.. తాజాగా డీ.శ్రీనివాస్.. తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న భూకుంభకోణాల్లో ముందుముందు ఇంకెవరి పేర్లు వస్తాయో తెలీదు. రావన్న గ్యారెంటీ లేదు. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు మియాపూర్ భూకుంభకోణం వెలుగు చూసిన తర్వాత టీఆర్ఎస్ నాయకుల బండారం ఒక్కొక్కటిగా బయట పడుతోంది. టీఆర్ఎస్ బడా నాయకుల నిర్వాకంతో దేశంలోనే అతిపెద్ద భూకుంభ కోణానికి తెలంగాణ కేరాఫ్‌గా మారింది. అదీ నేనే నెంబర్ వన్ అని చెప్పుకునే సీఎం కేసీఆర్ పాలనలో చోటు చేసుకోవడం మరీ విశేషం. ఆయన నెంబర్ వన్ సుపరిపాలన, పారదర్శకతలోనా... లేక బంధుప్రీతి, పక్షపాతంలోనా అనేది స్పష్టంగా అర్థం అవుతుంది.

ఎస్.ఎస్.ప్రసాద్ అలియాస్ గోల్డ్‌స్టోన్ ప్రసాద్ కంపెనీలకు భూబదిలీల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్టు జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్రమాల తేనెతుట్ట కదిపినట్టైంది. ఈ ఒక్క ఫిర్యాదుతో ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి పుట్ట బద్దలైంది. నేర చరిత్ర ఉన్న కబ్జాకోరులతో ప్రభుత్వ పెద్దలు ప్రత్యక్షంగానే సబంధాలు నెరిపినట్టు తెలుస్తుంది. ఈ కబ్జాకోరులకు అనుకూలంగా పనిచేసేలా రెవెన్యూ, భూ పరిపాలన శాఖల్లోని అన్ని స్థాయిల్లో అధికారులను నియమించి ప్రభుత్వమే పరోక్షంగా సహకరించింది. ఇంకేముంది ఆక్రమణల్లో ఆరితేరిన ఆ కబ్జాకోరులు తెలంగాణ భూములను ఆగం పట్టించారు.

జీహెచ్ఎమ్సీ పరిధిలో ఉన్న మియాపూర్‌లో గజం రూ.30వేలకు పైనే పలుకుతుంది. దీనిని బట్టి ఇక్కడ భూమి డిమాండ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంతటి విలువైన చోట మొత్తం 810 ఎకరాల ప్రభుత్వ భూమి చేతులు మారింది. ఈ లావాదేవీలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల మంత్రిత్వ శాఖను నిర్వర్తిస్తున్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ప్రమేయం ఉన్నట్టు స్పష్టంగా బయటపడింది. అంతేకాదు ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉన్న పెద్దలతో పాటు రెవెన్యూ శాఖలో వందల మంది అధికారులు గోల్డ్‌స్టోన్ ప్రసాద్ లాంటి కబ్జాకోరులతో అంటకాగిన విషయమూ వెలుగు చూసింది.




వేలాది ఎకరాలు చేతులు మారిన కుంభకోణంలో ఒక్క గోల్డ్‌స్టోన్ ప్రసాదే రూ.40వేల కోట్ల విలువైన భూములు సొంతం చేసుకున్నట్టు అర్థం అవుతుంది. తెలంగాణ వ్యాప్తంగా చోటు చేసుకున్న భూ కుంభకోణాల్లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమి విలువ ఎంత ఉంటుందో ఊహించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇప్పటి వరకు వెలుగులోకొచ్చిన భూకుంభకోణాల్లో చేతులు మారిన ప్రభుత్వ భూముల విలువ లక్ష కోట్ల రూపాలయకు పైనే ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ స్కాంలో ప్రభుత్వ భూముల బదలాయింపు, తక్కువ విలువ కట్టడం, స్టాంప్ డ్యూటీని ఎగ్గొట్టడం, బినామీల పేరు మీద భూములు రిజిస్ట్రేషన్ చేయడం, నకిలీ పత్రాలు సృష్టించి వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకొని బ్యాంకులను బురిడీ కొట్టించడం, వివాదాస్పద భూములను అక్రమంగా అమ్మడం, బక్క రైతులను బెదిరించి అగ్గువకో, సగ్గువకో భూములు సొంతం చేసుకోవడం.. ఇలా ఈ స్కాంలో అక్రమార్కుల లీలలు అన్నీఇన్నీ కావు.

### గోల్డ్‌స్టోన్ ప్రసాద్ ఎవరు?

గోల్డ్‌స్టోన్ ప్రసాద్ అగ్రరాజ్యం అమెరికానే బురిడీ కొట్టించిన ఘనుడు. ఆ దేశంలో ఈ మహాశయుడు పరారీలో ఉన్న నేరస్థుడు. మోసపూరితంగా అమెరికా బ్యాంకుల్లో వేల కోట్ల డాలర్ల రుణాలు తీసుకొని ఎగ్గొట్టిన కేసుల్లో

## ఆక్రమణలు నిరూపిస్తే కేసీఆర్ రాజీనామా చేస్తారా!

తెలంగాణలో భూ కుంభకోణాలను నిరూపిస్తే సీఎం పదవి నుంచి తప్పుకుంటారా అని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు నాగం జనార్ధన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. ఒక్క గజం స్థలం కూడా కబ్జా కాకుంటే అక్రమ రిజిస్ట్రేషన్లను ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయల భూకుంభకోణాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తే తమ కుటుంబ సభ్యుల, ఆత్మ భాగోతాలు బయట పడుతాయేమోనన్న భయంతోనే సీఎం కేసీఆర్ తనకు తానుగా ముందుగానే క్లీన్‌చిట్ ఇచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా నష్టం రాకుంటే మియాపూర్‌లో కానీ, దండుమైలారంలో కానీ కేకే కుటుంబ సభ్యులు చేసుకున్న రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని అధికారులు ఎందుకు నివేదిక ఇచ్చారని నిలదీశారు. మియాపూర్‌లోని సర్వే నెం. 20, 28, 100, 101లలో సుమారు 693 ఎకరాలను గోల్డ్‌స్టోన్ ప్రసాద్, ట్రినిటీ ఇన్‌ఫ్రా తదితర భూబకాసురులు అక్రమంగా చేసుకున్న జీపీఏలతో వివాదం చేయరని సీఎం తెలంగాణ ప్రజలకు హామీ ఇవ్వగలరా అని అన్నారు.



ట్రినిటీ ఇన్‌ఫ్రా కంపెనీ పేరుతో కొనుగోలు చేసిన బెంజ్ కారు ప్రగతి భవన్‌లో ఎందుకు చక్కర్లు కొడుతుందని ప్రశ్నించారు. ప్రగతి భవన్‌లో సీసీటీవీ ఫుటేజీలను బయట పెట్టే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా అని అడిగారు. హఫీజ్‌పూర్ సర్వే నెం.36లోని వివాదాస్పద భూములు న్యాయస్థాన పరిధిలో ఉండగానే ఎంపీ కే.కేశవరావు కుమార్తె గద్వాల విజయలక్ష్మీ ఎలా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇందుకు ప్రభుత్వ పెద్దల అండ లేదా అని నాగం ప్రశ్నించారు. సీఎం కేసీఆర్, కేకే కలిసి నడిపించిన డ్రామాగా అభివర్ణించారు. ఓ వైపు ఆక్రమణలు జరిగినట్టు స్పష్టంగా ఆధారాలు ఉంటే సీఎం కేసీఆర్ మాత్రం కబ్జా జరగలేదని చెప్పడం ప్రజలను వంచించడమే అన్నారు. రోజుకొక టీఆర్ఎస్ నాయకుడి పేరు బయటపడు తుందన్నారు.



నేను, నా దేశం – ఈ రెంటిలో నా దేశమే నాకు ముఖ్యమైనది. – డా॥ బి.ఆర్.అంబేద్కర్

ఈ గోల్డ్‌స్టోన్ ప్రసాద్ నిందితుడు. సౌతర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ న్యూయార్క్ కోర్టులో ఈయన మీద కేసు విచారణలో ఉంది. అయితే ఆయన అక్కడి నుంచి పారిపోయి ఇండియా వచ్చాడు. ఢిల్లీ, బెంగళూరు మధ్య తిరుగుతూ న్యాయ విచారణను తప్పించుకుంటున్నాడు. అంతేకాదు నాటి ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలతో దగ్గరి సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. భూఆక్రమణలకు పాల్పడుతూ తనకు అలవాటైన ఆర్థిక నేరాలనూ ఇక్కడా కొనసాగించాడు.

నేర చరిత్ర ఉన్న గోల్డ్‌స్టోన్ ప్రసాద్ వాస్తవానికి బయట ఉండాల్సిన వ్యక్తి కాదు. తను చేసిన నేరాలకు ఎప్పుడో జైలుకెళ్లి ఊచలు లెక్క పెట్టాల్సి ఉంది. కానీ అధికారంలో ఉన్న వాళ్లను మచ్చిక చేసుకుంటూ యథేచ్ఛగా తిరుగుతున్నాడు. ఇప్పుడు ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వంతోనూ సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్నాడు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఏర్పడిన తెలంగాణలోనూ వేల కోట్ల రూపాయల విలువైన భూకుంభకోణాలకు సూత్రధారిగా మారాడు.

### మౌనముద్రలో సీఎం కేసీఆర్

ఈ కుంభకోణాల్లో ఎంపీ కేశవరావు గోల్డ్‌స్టోన్ ప్రసాద్ నుంచి రూ. 250 కోట్ల విలువ చేసే 38 ఎకరాల ప్రభుత్వ భూమి నామమాత్రపు ధరకే సొంతం చేసుకున్నాడు. తన పరపతి అధికారాన్ని ఉపయోగించుకొని తన కుటుంబ సభ్యుల పేరు మీద దీనిని రిజిస్టర్ చేయించుకున్నాడు. ఇక ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ బినామీ పేరు మీద వేల కోట్ల రూపాయల విలువ చేసే భూబదిలీ బండారం బయటపడింది. ఇందులో మహమూద్ అలీ వ్యక్తిగత సిబ్బందే సాక్షి సంతకాలు పెట్టడం గమనార్హం. అటు మేడ్చల్‌లో 4 ఎకరాల అసైన్డ్ భూమిని అక్రమంగా సొంతం చేసుకున్న డీ. శ్రీనివాస్ విషయమూ వెలుగులోకి వచ్చింది. టీఆర్ఎస్ ప్రభుత్వంలో, పార్టీలో కీలక స్థానాల్లో



ఉన్న ఈ పెద్దమనుషులు ల్యాండ్ స్కాంలో మరకలు అంటించుకుని తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుంటూ సీఎం కేసీఆర్ మాత్రం మౌనవ్రతాన్ని వీడడం లేదు. టీఆర్ఎస్ అవినీతి, ప్రభుత్వ లాలూచీ ప్రతిరోజు పత్రికల్లో పతాక శీర్షికలై, మీడియాలో హోరెత్తుతుంటే కేసీఆర్‌కు మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదు.

సాధారణంగా కేసీఆర్‌ను ఒక్క మాటంటే పదిమాటలతో బదులిస్తాడు. కేసీఆర్ విమర్శలపై ఎలా స్పందిస్తాడనేది తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలతో పరిచయం ఉన్న ప్రతి వ్యక్తికీ తెలుసు. అలాంటి వ్యక్తి ల్యాండ్ స్కాం విషయంలో నోరు మూగబోయినట్టు నటించడం అందరినీ ఆశ్చర్య పరుస్తుంది. ఆశ్చర్యమే కాదు భూకుంభకోణాల్లో ప్రభుత్వ ప్రమేయం ఉందన్న నమ్మకాన్ని కలిగిస్తుంది. మౌనం అర్ధాంగీకారం అంటారు కానీ ఈ విషయంలో కేసీఆర్ మౌనం సంపూర్ణాంగీకారం అనుకోవాల్సి వస్తుంది. గతంలో ఆరోపణలు ఎదుర్కొన్న ఓ దళిత నేతను ఉపముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించిన కేసీఆర్ ఇంతవరకు మహమూద్ అలీ, కేశవరావు, డి. శ్రీనివాస్‌పై సస్పెన్షన్ కాదు కదా నామమాత్రపు చర్య కూడా తీసుకోలేదు. పైగా ఈ కుంభకోణాల్లో ఒక్క అంగుళం ప్రభుత్వ భూమి కానీ, ఒక్క రుపాయి ప్రభుత్వ సొమ్ము కానీ వృథా కాలేదని ప్రెస్‌నోట్

## సీఎంఓ ప్రమేయంతోనే భూదందాలు



తెలంగాణలో భూదందాలన్నీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు కార్యాలయం ప్రత్యక్ష ప్రమేయంతోనే జరుగుతున్నాయని బిజెపి సీనియర్ నాయకుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. భూఆక్రమణలతో ప్రభుత్వం ఒక్క గజం భూమి కోల్పోలేదని, ఒక్క రూపాయి నష్టపోలేదని సీఎం కేసీఆర్ పేర్కొనడం పచ్చి అబద్ధం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రా పాలకులు తెలంగాణ ప్రభుత్వ భూములను యథేచ్ఛగా అన్యాక్రాంతం చేశారని ఆరోపిస్తూ కేసీఆర్ గతంలో ఐఏఎస్ అధికారి ఎస్.కె. సిన్హా ఆధ్వర్యంలో రెవెన్యూ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారని, ఆయన 18 నివేదికలను ప్రభుత్వానికి సమర్పించారని తెలిపారు. ఈ నివేదికల్లో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి సంబంధించి పలు వివరాలు, అందుకు బాధ్యులైన కొందరి పేర్లు కూడా ఉన్నట్టు తెలుస్తుందన్నారు. కానీ ఈ కమిటీని అర్థంతరంగా ముగించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సిన్హా నివేదికలు ఇచ్చి సంవత్సరం దాటినా ఇంతవరకు వాటిని ఎందుకు బయటపెట్టలేదని, బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. కేసీఆర్‌కు ధైర్యం ఉంటే ఆ నివేదికలను బయటపెట్టి, వారిపై చర్య తీసుకోవాలని సవాల్ విసిరారు.

ప్రభుత్వ భూములను వెబ్‌సైట్‌లో పెట్టి బహిర్గతం చేయాలని రాష్ట్ర హైకోర్టు సంవత్సరం క్రితమే ఆదేశించినా ఇంతవరకు కదలిక లేదన్నారు. భూముల వివరాలను ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారని ప్రశ్నించారు. 1978లో జాగీర్దార్ భూములకు ప్రభుత్వం రూ. 2.58 లక్షలు చెల్లించి స్వాధీనం చేసుకోగా.. ఇప్పుడు అవే భూములకు కోట్లాది రూపాయలు ఎందుకు చెల్లిస్తున్నారని ప్రశ్నించారు.

ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే సౌలభ్యం ఒక జిల్లాలో అంతర్గతంగా మాత్రమే చెల్లుతుందని, కానీ హైదరాబాద్ జిల్లా బండ్లగూడ భూములను రంగారెడ్డి జిల్లా బండ్లగూడ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తే రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐజీకి రెవెన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శి లేఖ రాశారని గుర్తు చేశారు. అయితే లేఖ రాసిన ఆ రెవెన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శిని రాత్రికి రాత్రి బదిలీ చేయలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములపై శ్రద్ధ ఉంటే సీఎం కేసీఆర్ ఎందుకు ల్యాండ్ రెవెన్యూ కమిషనర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి పదవులను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు.

అత్మగౌరవాన్ని నష్టపరచుకొని జీవించే జీవితం మృత్యువు కంటే హీనమైనది. – భర్తృహరి

విడుదల చేసి వారిని వెనుకేసుకొచ్చారు. అయితే ఈ స్కాం వెలుగు చూసిన తర్వాత 75కు పైగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 142 దాడులు జరిగాయి. 45 మందికి పైగా సబ్ రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. 5 గురు సబ్ రిజిస్ట్రార్లు అరెస్టయ్యారు. 800 మంది రెవెన్యూ ఉద్యోగులపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. కేసీఆర్ చెబుతున్నట్టు ప్రభుత్వానికి నష్టం జరగలేదంటే రెవెన్యూ సిబ్బందిపై చర్యలెందుకు తీసుకున్నారు. అరెస్టులెందుకు జరిగాయి. జరుగుతున్న పరిణామాలు గమనిస్తే కేసీఆర్ మాటల్లో డొల్లతనం స్పష్టంగా బయటపడింది.

## ఎస్.కె.సిన్హా కమిటీ నివేదిక ఏమైంది?

"తెలంగాణలో అంగుళం ప్రభుత్వ భూమిని కూడా కబ్జా కానివ్వం," సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి అసెంబ్లీలో ప్రసంగిస్తూ చెప్పారు. మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.కె.సిన్హా నేతృత్వంలో రెవెన్యూ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఆ అధికారి భూముల లావాదేవీల్లో జరిగిన అవకతవకలు, అక్రమాలపై విచారించి ప్రభుత్వానికి 11 నివేదికలను సమర్పించారు. పెద్దమనుషుల్లా చలామణి అవుతున్న భూఅవినీతిపరుల పేర్లను బయటపెట్టి, అక్రమార్కులపై ప్రభుత్వ కొరడా ఝులిపిస్తుందని అంతా ఆశించారు. కానీ టీఆర్ఎస్ ఉదాసీన వైఖరితో ఆ ఆశలు నీరుగారిపోయాయి. ఎస్.కె.సిన్హా నివేదికను ప్రభుత్వం ఇంతవరకు బయటపెట్టనే లేదు. అంతేకాదు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాపై దుష్ప్రభావం చూపిన భారీ లావాదేవీలను విచారించేందుకు ఈ రెవెన్యూ టాస్క్‌ఫోర్స్‌ను కొనసాగించాల్సిందిగా ఎస్.కె.సిన్హా అభ్యర్థించారు. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం ఆయన అభ్యర్థనను పెడచెవిన పెట్టింది.




## కేసీఆర్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం



భూఆక్రమణల్లో ఒక్క అంగుళం ప్రభుత్వ భూమి కూడా పోలేదన్న సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని బిజెపి తెలంగాణ అధికార ప్రతినిధి రఘు నందన్ రావు మండిపడ్డారు. సుప్రీం కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఆక్రమణ భూముల్లో ఇప్పటికీ విల్లాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవస్థలను నాశనం చేస్తూ ప్రజలను, ప్రతిపక్షాలను తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు.

స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాతే ఒక పథకం ప్రకారం ప్రభుత్వ భూములను కొల్లగొట్టడం మొదలైందని వివరించారు. ఓ ప్రముఖ పత్రిక యాజమాన్యం తమ పత్రికలో వచ్చిన కథనాల ఆధారంగా ఆక్రమణలకు తెరతీశారని అన్నారు. ఇందుకోసం భూఆక్రమణల్లో ప్రధాన నిందితుడు గోల్డ్‌స్టోన్ ప్రసాద్ కుటుంబ సభ్యురాలికి సీఎంఓలో పోస్టింగ్ ఇప్పించారని తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల్లో చంద్రబాబు రెక్కలు తీస్తే రాజశేఖర రెడ్డి దర్వాజ తీశారని, సీఎం కేసీఆర్ అయితే గోడలు కూడా కూలగొట్టి యథేచ్ఛగా కొల్లగొడుతున్నారని నిప్పులు చెరిగారు. ప్రస్తుతం వెలుగులోకి వస్తోన్న భూకుంభకోణాల్లో స్వరాష్ట్రం ఏర్పడ్డాకే రిజిస్ట్రేషన్లు జరిగాయని స్పష్టం చేశారు. భూఆక్రమణల్లో ప్రభుత్వానికి సంబంధం లేకుంటే సీబీఐ విచారణ అంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.

కొన్ని సంస్థలు ఈ వివాదాస్పద భూములను తనఖా పెట్టి వేల కోట్ల రుణాలు తీసుకొని తర్వాత డిఫాల్టర్లుగా మారితే, ఆ భూములు కొన్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రిజర్వు బ్యాంకుకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. 8 రాష్ట్రాల పోలీసులు వెతుకుతున్నా గోల్డ్‌స్టోన్ ప్రసాద్ దొరకడం లేదంటే, గజ్వేల్ సమీపంలోనే ఉండొచ్చనే అనుమానాలు రఘునందన్ రావు వ్యక్తం చేశారు.

ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ రాష్ట్రంలో జరిగిన భూఅక్రమాల్లో ప్రభుత్వ అధికారులు, మాజీ మంత్రులు, వ్యాపార వాణిజ్యవేత్తలకు భాగస్వామ్యం ఉందని ఎస్.కె.సిన్హా స్పష్టంగా చెప్పారు. దీంతో ఆయనిచ్చిన నివేదికలో అక్రమార్కుల పేర్లు ఉన్నాయని అర్థం చేసుకోవచ్చు. అవినీతి ఎంత మాత్రం సహించేది లేదని చెప్పే కేసీఆర్‌కు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే ఎస్.కె.సిన్హా నివేదికను బయటపెట్టేవారు. అందులో ఉన్న అవినీతిపరులు, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకొని కబ్జాచెరలో ఉన్న ప్రభుత్వ భూములను విడిపించేవారు. కానీ అలాంటిదేమీ జరగకపోవడంతో ల్యాండ్ స్కాంలో ఆయన ప్రమేయంపై ఉన్న అనుమానాలకు బలం చేకూరుతోంది.

తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న భూకుంభకోణాల్లో టీఆర్ఎస్ పెద్దలకు మకిలీ అంటిన విషయం స్పష్టంగా తెలుస్తుంది. తనపై వస్తోన్న విమర్శల విషయంలో మౌనంగా ఉండడం.. ఎస్.కె.సిన్హా నివేదికను తొక్కిపెట్టడం.. గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌కు సీఎం కార్యాలయంతో సన్నిహిత సంబంధాలు ఉండడం.. ఏవిధంగా చూసినా ఈ ల్యాండ్ స్కాంలో సీఎం కేసీఆర్ ప్రమేయం ఉందనడానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయి. అధికార ముసుగులో తన తప్పును కప్పిపెట్టినా అది ఎంతోకాలం దాగుండదు. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్న సీఎం కేసీఆర్, టీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజు ఎంతో దూరం లేదు. ■



# భూములు ఎరగావేసి పార్టీ ఫిరాయింపులు

• ప్రవీణ్

మియాపూర్ భూదందా గత మూడేళ్ళ కె.చంద్రశేఖర రావు పాలనలో భారీ ఎత్తున జరుగుతున్న లక్షల కోట్ల రూపాయల విలువైన స్కాంలలో ఒక భాగం. రాష్ట్రంలో భూకుంభ కోణాలకు అడ్డూ అదుపూ లేకుండా కేసీఆర్ ప్రోత్సహిస్తున్నారని స్పష్టం అవుతున్నది. ఇతర పార్టీ ప్రజాప్రతినిధులను పార్టీ ఫిరాయించేటట్లు ప్రోత్సహించడంలో భూదందాలు ప్రధాన ఆకర్షణగా ఉంటున్నట్లు కనబడుతోంది.

తెలంగాణ ప్రభుత్వంలో ఒక్క గజం ప్రభుత్వ భూమిని కూడా కోల్పోలేదని, ఒక్క రూపాయి కూడా నష్టపోలేదన్న ముఖ్యమంత్రి ప్రకటన వాస్తవదూరం అని అర్థం అవుతుంది. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ టీఆర్ఎస్ సెక్రటరీ జనరల్, రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు కొనుగోలు చేసిన భూముల 'సేల్స్ డీడ్' రద్దు చేసుకొంటున్నట్లు ప్రకటించడమే. హాఫీజ్‌పూర్‌లో తాము కొనుగోలు చేసిన భూములు ప్రభుత్వానివి కావని, ఉన్నత అధికారులతో మాట్లాడి ఎటువంటి వివాదం లేదని తెలుసుకొన్నాకే చట్టబద్ధంగా కొనుగోలు చేశామని వాదిస్తూ వచ్చిన కేశవరావు ప్రజల ఆందోళనకు జడిసి అకస్మాత్తుగా మాట మార్చారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ నిర్ణయించడంతో న్యాయపోరాటం చేస్తానని ప్రకటించిన 24 గంటలలోపే సేల్‌డీడ్‌ను రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించడం గమనార్హం.

అంతకుముందు వారం రోజులకు పైగా చట్టబద్ధంగానే భూములు కొన్నానని, కోర్ట్ ఆదేశాల ప్రకారమే భూముల రిజిస్ట్రేషన్ చేసుకున్నామని వాదిస్తూ వచ్చిన కేశవరావు ఇప్పుడు ఇదో మురికి ఒప్పందమని, దానిలో కొనసాగలేమని, సొంత ప్రభుత్వం, తమ అధినేతతో ఘర్షణ వైఖరిని అవలంబించే ఉద్దేశం తమకు లేదని పేర్కొనడం ఆసక్తికరం. ముఖ్యమంత్రి కుమారుడు, కుమార్తె, మేనల్లుడు ద్వారా అధికార పార్టీలో చేరుతున్నవారిపై భూదందా ఆరోపణలు ఉండటం గమనార్హం. సర్పంచ్‌ల నుండి ఎమ్మెల్యేలు, ఎంపీల వరకు అక్రమ భూముల లావాదేవీల కోసమే, తమ ఆక్రమణలకు రక్షణ కోసమే టీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు భావించాల్సి వస్తున్నది. ఈ విషయమై ప్రతిపక్ష నాయకులు ఏ ఏ నాయకుడు ఎక్కడెక్కడ ఎంతెంత భూమిని ఆక్రమించు కొన్నారో, అక్రమంగా స్వాధీనం చేసుకున్నారో అంటూ వివరాలు ప్రకటిస్తూ వస్తున్నారు. అయితే ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన ఉండటం లేదు.

గతంలోని ఆంధ్రా పాలకులు తెలంగాణ భూములను యథేచ్ఛగా అన్యాక్రాంతం చేశారని ఆరోపించిన కేసీఆర్ అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములను కాపాడటం కోసం సీనియర్ ఐఏఎస్ అధికారి యస్.కె.సిన్హా ఆధ్వర్యంలో రెవెన్యూ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. సిన్హా ఈ సందర్భంగా 11 నివేదికలను ప్రభుత్వానికి సమర్పించారు. వాటిలో పెద్దఎత్తున

> **కేసీఆర్ అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములను కాపాడటం కోసం సీనియర్ ఐఏఎస్ అధికారి యస్.కె.సిన్హా ఆధ్వర్యంలో రెవెన్యూ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. సిన్హా ఈ సందర్భంగా 11 నివేదికలను ప్రభుత్వానికి సమర్పించారు. వాటిలో పెద్దఎత్తున జరుగుతున్న ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి సంబంధించి పలు వివరాలు కూడా ఇచ్చినట్లు సమాచారం. అయితే కేసీఆర్ అర్థాంతరంగా ఈ కమిటీని ముగించి వేశారు. సిన్హా నివేదికలను పక్కన పెట్టారు.**

జరుగుతున్న ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి సంబంధించి పలు వివరాలు కూడా ఇచ్చినట్లు సమాచారం. అయితే కేసీఆర్ అర్థాంతరంగా ఈ కమిటీని ముగించి వేశారు. సిన్హా నివేదికలను పక్కన పెట్టారు. సంవత్సరం క్రితమే ప్రభుత్వ భూముల వివరాలు అన్నింటిని వెబ్‌సైట్‌లో ఉంచి బహిర్గతం చేయమని హై కోర్ట్ ఆదేశించినా ఇంతవరకు ప్రభుత్వం ఆ దిశలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనిస్తే టీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూములను ఏ విధంగా స్వాహా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయో వెల్లడవుతుంది.

ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే సౌలభ్యం కల్పించడం అంటే ఒక జిల్లా పరిధిలో ఎక్కడైనా చేసుకోవచ్చని అర్థం. కానీ ఇష్టారాజ్యంగా ఇతర జిల్లాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగినట్లు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నది. హైదరాబాద్ జిల్లాలోని బండ్లగూడకు చెందిన భూములను రంగారెడ్డి జిల్లాల్లోని బండ్లగూడ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తే, దానిపై తగు చర్య తీసుకోవాలని సూచిస్తూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐజికి నాటి రెవెన్యూ ప్రిన్సిపాల్ కార్యదర్శి లేఖ రాశారు. ఆ సబ్ రిజిస్ట్రార్‌పై చర్య తీసుకోవడానికి బదులు లేఖ రాసిన అధికారిని రాత్రికి రాత్రి బదిలీ చేశారు. అంటే ముఖ్యమంత్రి కార్యాలయం స్థాయి అండదండలు లేకుండా భారీ భూదందాలు జరగడం లేదని స్పష్టం అవుతున్నది. అందుకే ఈ కుంభకోణాలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. అయితే టీఆర్ఎస్ ప్రభుత్వం వినిపించుకోవడం లేదు.

మియాపూర్ భూదందాలో కీలక సూత్రధారి అయిన వ్యక్తి అమెరికాలో ఆర్థిక నేరాలకు పాల్పడిన కేసులో అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం అవుతున్నట్లు సమాచారం వస్తోంది. ఈ సమయంలో సదరు వ్యక్తి హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడి ప్రభుత్వం అండతో భూదందాలకు పాల్పడుతున్నట్లు కనబడుతోంది. అదేవిధంగా ముఖ్యమంత్రికి 'ఆత్మ'గా భావిస్తున్న మరో ప్రముఖుడు సైతం ఈ భూదందాలలో కీలక సూత్రధారిగా పత్రికలలో కథనాలు వచ్చాయి. ఇదంతా చూస్తుంటే దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్న చందంగా కేశవరావు ఒకవైపు, డి.శ్రీనివాస్ మరొకవైపు అవినీతి ఆదాయంతో ప్రభుత్వ భూములను అతితక్కువ ధరకు దక్కించుకొని, అది మా కష్టార్జితం అని చెప్పుకోవడం వారి రాజకీయ దివాళాకోరు తనానికి నిదర్శనం. మియాపూర్ భూకుంభ కోణంలో కీలక నిందితుడు గోల్డ్‌స్టోన్ ప్రసాద్ ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడన్న సంగతి తెలిసినదే. ఇంకా పలువురు ప్రభుత్వ అధికారులు ఈ స్కాంలో ఇరుక్కోవడం చూస్తే టీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్‌ను మించి అవినీతిలో కూరుకుపోయిందని అర్థం అవుతుంది. సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి ముఖ్యంగా ఫిరాయింపుదారులకు ఈ భూములలో వాటా ఎంతో తేలాల్సిన అవసరం ఉంది. ■

నాయకుడివి కావాలని తహతహలాడకు, సేవకుడివయ్యేందుకు తపించు. - స్వామి వివేకానంద

# జూన్ 25 వరకు విస్తార్ యోజన

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కార్యవిస్తార్ యోజన ఉత్సాహంగా సాగుతోంది. ఈ యోజనలో భాగంగా గ్రామగ్రామాన పర్యటిస్తున్న బిజెపి నాయకులకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. దీంతో జూన్ 12తో ముగియాల్సిన ఈ కార్యక్రమాన్ని జూన్ 25 వరకు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇంటింటికీ వెళ్లి మూడేళ్ల మోదీ ప్రభుత్వ విజయాలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను, టీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి వారిని జాగృతం చేస్తున్నారు.



మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి నియోజకవర్గంలో దత్తాత్రేయ ఇంటింటి ప్రచారం




హైదరాబాద్ సనత్‌నగర్‌లో మురళీధర్ రావు ఇంటింటి ప్రచారం



నల్గొండలో కిషన్ రెడ్డి సహపంక్తి భోజనం




నిర్మల్ జిల్లా మధోల్‌లో పేరాల శేఖర్ రావు ఇంటింటి ప్రచారం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్ముగూడెంలో గోలి మధుసూదన్ రెడ్డి బిజెపి నేతల ఇంటింటి ప్రచారం



కోస్గిలో బంటు రమేష్ ఇంటింటి ప్రచారం



షాద్‌నగర్‌లో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఇంటింటి ప్రచారం



హైదరాబాద్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ప్రేమేందర్ రెడ్డి ఇంటింటి ప్రచారం



భూ ప్రపంచం మన మాతృభూమి – సమస్త మానవాళీ మన జాతి. – శ్రీ వీర సావర్కార్

వర్తమానం




# గ్రామస్థాయికి బిజెపి సిద్ధాంతం: అమిత్ షా

ప్రజలతో నేరుగా సంబంధం పెట్టుకోవడానికి చేపట్టిన విస్తారక్ యోజనలో భాగంగా బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా మే 31న గుజరాత్‌లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మే 28 నుంచి జూన్ 5 వరకు 48,000 మంది బిజెపి విస్తారకులు 48,000 పోలింగ్ కేంద్రాల పరిధిలో పర్యటించి మూడేళ్ల మోదీ పాలన విజయాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం ప్రారంభించిన పథకాలను విస్తారకులు ప్రజలకు వివరించారు. బిజెపి అధ్యక్షుడు అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపాని, ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్, బిజెపి రాష్ట్ర ఇంచార్జ్ భూపేంద్ర యాదవ్, ఇతర రాష్ట్ర నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా విస్తారకులతో కలిసి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అమిత్ షా, విజయ్ రూపాని, నితిన్ పటేల్ మే 31వ తేదీన ఒక్క రోజు పాటు దేవలియా గ్రామంలో విస్తారకులుగా పనిచేశారు. ఛోటా ఉదేపూర్ జిల్లాలోని దేవలియా గ్రామంలో అమిత్ షా ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. విల్లంబులు బహూకరించి గ్రామవాసులు అమిత్ షాకు స్వాగతం చెప్పారు. అమిత్ షా గిరిజనుడైన బిజెపి కార్యకర్త పోపట్ రత్వా ఇంట్లో మధ్యాహ్నం భోజనం చేశారు. "నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మనం 127 స్థానాలు సంపాదించాం. ఇప్పుడు ఆయన ప్రధానమంత్రిగా ఉన్నారు కనక గుజరాత్ శాసనసభలో 150 కన్నా ఎక్కువ స్థానాలు సంపాదించాలి, గుజరాత్‌లోని గిరిజన నియోజకవర్గాలన్నింటినీ గెలుచుకోవాలి" అని అమిత్ షా అన్నారు. ప్రజల కోసం మోదీ ప్రభుత్వం 106 కన్నా ఎక్కువ పథకాలను ప్రవేశపెట్టిందని, ఈ పథకాల గురించి కుల, మత, వర్గ భేదాలతో నిమిత్తం లేకుండా ప్రజలందరికీ వివరించవలసిన బాధ్యత కార్యకర్తలదేనని అమిత్ షా అన్నారు.

అమిత్ షా ఆ గ్రామంలో పర్యటించిన సందర్భంగా గ్రామ సర్పంచ్ సోనియాబాయి రత్వా బిజెపిలో చేరారు. ఆమె 30 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీతో ఉన్నారు. "నా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం కోసం నేను బిజెపిలో చేరాను. శాసనసభ ఎన్నికలలోగా గుజరాత్‌లోని తూర్పు గిరిజన ప్రాంతంలో కాంగ్రెస్‌కు స్థానం లేకుండా చేయాలని అమిత్ షా అన్నారు. గిరిజనులకు కాంగ్రెస్ కేవలం కలలు మాత్రమే చూపిస్తుందని షా అన్నారు.

బోదెలీ గ్రామంలో స్వామీ నారాయణ్ దేవస్థానంలో గిరిజన నాయకులతో మాట్లాడిన అమిత్ షా 22 ఏళ్ల కాలంలో బిజెపి గుజరాత్‌లో అభివృద్ధి సాధించిందని చెప్పారు. "కాంగ్రెస్ మీకు కలలను మాత్రమే చూపించింది. వాస్తవ రూపంలోకి రాని కలలు పగటి కలలుగానే మిగిలిపోతాయి" అని అమిత్ షా అన్నారు. గత మూడేళ్ల కాలంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పేదల అభ్యున్నతి కోసం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ సిద్ధాంతానికి అనుగుణంగా 106 కార్యక్రమాలను ప్రారంభించిందని ఆయన చెప్పారు. గత 22 ఏళ్ల కాలంలో గుజరాత్‌లో బిజెపి గిరిజనుల సంక్షేమం చేసిన కృషి కాంగ్రెస్ ఎన్నడూ చేయలేదని షా అన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికలలో బిజెపి ఘన విజయం సాధించడానికి తోడ్పడాలని ఆయన గిరిజనులకు విజ్ఞప్తి చేశారు. 1995 నుంచి ప్రజలు గుజరాత్‌లో బిజెపిని ఓడించలేదని అందుకే మళ్లీ ఘన విజయం సాధించడానికి తోడ్పడాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ గిరిజనుల, దళితుల విషయంలో కేవలం మాటలు మాత్రమే చెప్తుందని షా చెప్పారు. "కాంగ్రెస్ ఎప్పుడూ దళితుల, గిరిజనుల సంక్షేమం కోసం మాట్లాడుతుంది. కాని జరిగిందేమిటో మీరు చూస్తూనే ఉన్నారు. విద్యుత్తు లేదు, మంచి నీళ్లు లేవు, రోడ్లు లేవు, ఆరోగ్య కేంద్రాలు లేవు. నెలల తరబడి కర్ఫ్యూ కొనసాగేది. నిరుద్యోగం తార స్థాయిలో ఉండేది" అని అమిత్ షా దుయ్యబట్టారు.

"మోదీ ప్రభుత్వం గుజరాత్‌లో 2001లో మారుమూల గ్రామాలకు సైతం విద్యుత్ సరఫరా అందించింది. గ్రామీణ ప్రాంతాలలో పాఠశాల భవనాలు నిర్మించింది. ఉపాధ్యాయులను నియమించింది," అని అమిత్ షా తెలియజేశారు.

గిరిజన సంస్కృతిని పరిరక్షించడానికి బిజెపి నిబద్ధమై ఉందని, ఈ దిశగా గిరిజన మ్యూజియం ఏర్పాటు చేసిందని షా గుర్తు చేశారు. "మోదీ ప్రభుత్వం చేపట్టిన పథకాలన్నింటినీ ఏకరువు పెడుతూపోతే అలసట వస్తుందని ఆయన అన్నారు. ఈ పథకాల వల్ల గిరిజనులకు మేలు కలుగుతుందని చెప్పారు. విస్తారక్ యోజన ద్వారా బిజెపి సిద్ధాంతాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఒక్క గుజరాత్‌లోనే పార్టీ కార్యక్రమాలను ప్రజలకు వివరించడానికి 48,000 మంది కార్యకర్తలు ఇంటింటికీ వెళ్తారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల ప్రభుత్వాలు పేదల అభ్యున్నతి కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తామనీ ఏ రాజకీయ పార్టీ కూడా ఇంతవరకు ఇంత భారీ కార్యక్రమం చేపట్టలేదని ఆయన వివరించారు. పోలింగ్ కేంద్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఈ కార్యక్రమం సాగుతుందని ఆయన చెప్పారు. నరేంద్ర మోదీ నాయకత్వం బిజెపికి గర్వకారణం అని షా కొనియాడారు.

### సబర్మతిలో కార్యకర్తలతో సంభాషణ

అహ్మదాబాద్‌లో సబర్మతి ఒడ్డున అమిత్ షా బిజెపి కార్యకర్తలతో సమావేశమయ్యారు. "ఉత్తర ప్రదేశ్‌లో 325 సీట్లు సంపాదించాం. గుజరాత్‌లో 150 స్థానాల కన్నా ఎక్కువ సంపాదించగలమన్న విశ్వాసంతో ముందుకు వెళ్లాలి" అని కార్యకర్తలకు ఉద్బోధించారు. "విజయపథంలో సాగుతున్న నరేంద్ర మోదీ రథం గుజరాత్ కూడా చేరుకుంటుంది" అని షా చెప్పారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ప్రస్తుతం ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మోదీ అమలు చేసిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. "1995లో గుజరాత్‌లో బిజెపి విజయం సాధించక ముందు అహ్మదాబాద్‌లో ఏడాదిలో 200 రోజులు కర్ఫ్యూ ఉండేది.



అహ్మదాబాద్‌లో బేగం బాద్షా పరిపాలన కొనసాగేది. కాని కత్తిపోట్లకు పాల్పడే వారిని బిజెపి తరిమేసింది," అని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పాలనలో మతతత్వ, కులతత్వ, ఓటు బ్యాంకు రాజకీయాలకు బీజం వేశారని అమిత్ షా అన్నారు. అహ్మదాబాద్ సభలో దాదాపు గంట సేపు ప్రసంగించిన షా ఈ సారి బ్రహ్మాండమైన విజయానికి కృషి చేయాలని కోరారు. గుజరాత్ శాసనసభకు పోటీ చేస్తామని ప్రకటించిన ఆమ్ ఆద్మీ పార్టీ మీద కూడా షా విమర్శలు గుప్పించారు. "మీకు ఆమ్ ఆద్మీ పార్టీ అంటే తెలుసా? ఎన్నికలు జరిగిన చోటల్లా ఆ పార్టీ ప్రత్యక్షం అవుతూ ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మాయం అవుతుంది" అని షా ఎద్దేవా చేశారు. అమిత్ షాకు స్వాగతం చెప్పడానికి అహ్మదాబాద్ నగరాన్ని బిజెపి కాషాయ జెండాలతో నింపేసింది. ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో ఘన విజయం సాధించిన తర్వాత అమిత్ షా మొట్టమొదటిసారి తన సొంత రాష్ట్రం అయిన గుజరాత్‌లో రెండు రోజులు పర్యటించారు. విమానాశ్రయంలో ఆయనను ఘనంగా సన్మానించారు.

**-జనసందేశ్ ప్రతినిధి**



మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలు పద్మజా రెడ్డి సమక్షంలో 100 మంది యువకులు జూన్ 18న బిజెపిలో చేరారు. మోదీ ప్రభుత్వ పథకాలు నచ్చి బిజెపిలో చేరినట్టు ఆ యువకులు చెప్పారు.



సాధారణంగా విజ్ఞులు వింటారు, మేధావులు మాట్లాడుతారు, మూర్ఖులు వాదిస్తారు.

వర్తమానం

# కేరళ: హింసతో బిజెపిని ఆపలేరు

కేరళలో మూడు రోజుల పర్యటన కోసం అమిత్ షా జూన్ 2న కోచి చేరుకున్నారు. ఆయనకు నెడుబసెర్రీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బిజెపి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు ఆయనకు స్వాగతం చెప్పడం కోసం మోటార్ సైకిల్ ర్యాలీ ఏర్పాటు చేశారు. దళిత నాయకుడు అయ్యంకలి విగ్రహానికి పూల మాల వేసి అమిత్ షా తన కేరళ ప్రవాస్ ప్రారంభించారు. అదే రోజు కేరళలో క్రైస్తవ బిషప్పులను కలుసుకున్నారు. క్రైస్తవుల సమస్యలను తెలుసుకోవడం కోసం వారితో సమావేశ మయ్యారు. బిజెపి సంస్థాగత అంశాలను, భవిష్యత్ కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలతో చర్చించారు. అమిత్ షా బిజెపి మిత్రపక్షాలతో మాట్లాడారు. వివిధ మతాల నాయకులను కూడా కలుసుకున్నారు. మూడు రోజుల పర్యటన సందర్భంగా అమిత్ షా కోచిలో చర్చి నాయకులతో చర్చించారు. సైరో మలబార్ కాథలిక్ చర్చి కార్డినల్ మార్ జార్జ్ అలెంచెర్రీని, లాటిన్ కాథలిక్ చర్చి ఆర్క్ బిషప్ జోసెఫ్ కలతిపరంబిల్‌ను, ముగ్గురు కాథలికేతర చర్చి నాయకులను కలుసుకున్నారు. అమిత్ షాతో సమావేశం అయినప్పుడు రాజకీయ అంశాలేవీ చర్చించలేదని ఆ తర్వాత క్రైస్తవ నాయకుల ప్రతినిధులు పత్రికల వారితో మాట్లాడుతూ చెప్పారు. కేవలం మర్యాద పూర్వకంగానే తాము అమిత్ షాతో సమావేశం అయ్యామని వారు తెలియజేశారు. గత ఏడాది యెమెన్‌లో అపహరణకు గురైన ఫాదర్ టాం ఉఝున్నలిల్ ను విడుదల చేయించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించాలని అమిత్ షాను కోరినట్టు క్రైస్తవ ప్రతినిధులు తెలియజేశారు. రబ్బరు తోటల కార్మికుల సమస్యలను కూడా షాతో చర్చించారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించడానికి మత్స్యకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కూడా వీరు కోరారు. ఎన్‌డిఏ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని అమిత్ షా తెలియజేశారని క్రైస్తవ ప్రతినుధులు చెప్పారు.



### బిజెపి పదాధికారులతో చర్చలు

ఆ తర్వాత బిజెపి పదాధికారుల సమావేశంలో ప్రసంగించిన అమిత్ షా “నేను మూడు రోజుల విస్తృత ప్రవాస్ కోసం కోచి వచ్చాను. శంకారచార్య జన్మించిన కేరళ వాసులకు అభినందనలు తెలియజేస్తున్నాను. కేరళ ప్రజలు బిజెపి పట్ల అమితాదరణ చూపుతున్నారని ఇది ఎల్.డి.ఎఫ్., యు.డి.ఎఫ్. నుంచి జనం విముక్తి కోరుతున్నారనడానికి సంకేతం అని అమిత్ షా అన్నారు. కేరళలో అట్టడుగు స్థాయి నుంచి బిజెపిని పటిష్టం చేయడం మీద దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. హిందూ యువ నాయకుడు వెల్లపల్లి నటేశన్, గిరిజన నాయకుడు సి.కె.జాను తమ సమస్యలను షాకు వివరించారు. ఈ సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని అమిత్ షా హామీ ఇచ్చారు.

జూన్ 3న అమిత్ షా పార్టీ పదాధికారులతో అనేక సమావేశాలు నిర్వహించారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు బిజెపి కార్యకర్తలను సిద్ధం చేయడానికి అమిత్ షా ప్రయత్నిస్తున్నారు. అమిత్ షా కార్యకర్తలతో మాట్లాడినప్పుడు కేరళలో సీపీఎం కార్యకర్తలు బిజెపి కార్యకర్తల మీద కొనసాగిస్తున్న దాడులను ప్రస్తావించారు. హింసాత్మక విధానాల ద్వారా బిజెపి ఎదుగుదలను అడ్డుకోలేరని షా చెప్పారు. 2019 ఎన్నికల దృష్ట్యా దక్షిణాది రాష్ట్రమైన కేరళ బిజెపికి అత్యంత ప్రధానమైనదని ఆయన అన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల తర్వాత బిజెపి ఏడు రాష్ట్రాలలో విజయం సాధించిందని, కాని కేరళలో గెలిచే దాకా సంతృప్తి ఉండదని తెలియజేశారు. మూడు రోజుల పర్యటన సందర్భంగా అమిత్ షా వామపక్ష ఫ్రంట్ మీద తీవ్ర విమర్శలు చేశారు. వచ్చే ఎన్నికల నాటికి బిజెపి విజయం సాధించడం కోసం అట్టడుగు స్థాయి నుంచి బిజెపిని సంఘటితం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. తిరువనంతపురంలో బిజెపి ప్రధాన కార్యాలయానికి అమిత్ షా శంకుస్థాపన చేశారు. ఇది కేరళలో బిజెపి అధికారం సంపాదించడానికి పునాదిరాయి లాంటిదని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బిజెపి లాంటి పార్టీలు పని చేయడం కష్టంగా ఉందని అభిప్రాయపడ్డారు. వామపక్ష ఫ్రంట్ అధికారంలోకి వచ్చినప్పుడల్లా బిజెపి, సంఘ్ పరివార్ వారిపై దాడులు పెచ్చరిల్లుతాయని ఆయన చెప్పారు. వామపక్ష ఫ్రంట్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేరళలో 13 మంది బిజెపి, ఆరెస్సెస్ కార్యకర్తలు హత్యకు గురయ్యారన్నారు. ఈ హత్యల్లో ఎక్కువ భాగం ముఖ్యమంత్రి విజయన్ నియోజకవర్గంలోనే జరిగాయని అమిత్ షా చెప్పారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితులలో బిజెపి మరింత బలపడుతుందని తెలియజేశారు. నాలుగేళ్ల తర్వాత బిజెపి కేరళలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి బిజెపి ప్రజాప్రతినిధులు నిర్విరామంగా కృషి చేయాలని కోరారు. కేరళలో బిజెపి ఎదుగుతున్న తీరు చూస్తే వచ్చే ఎన్నికలలో అధికారం సంపాదిస్తుందన్న నమ్మకం కలుగుతోందని అన్నారు. అమిత్ షా పర్యటన ఆఖరి రోజున పోలింగ్ కేంద్ర స్థాయి కార్యకర్త ఇంట్లో అమిత్ షా భోజనం చేశారు. పార్టీ సంస్థాగత సమస్యలను చర్చించి కేరళ అభివృద్ధి కోసం మోదీ ఎలా చేయూత అందిస్తున్నారో చెప్పారు.

**–జనసందేశం ప్రతినిధి**




# రైతుల దుస్థితికి కారణం కాంగ్రెస్ కాదా?

**ఎం.వెంకయ్య నాయుడు**
కేంద్ర పట్టణాభివృద్ధి,
సమాచార ప్రసార శాఖ మంత్రి



కల్లోల జలాల్లో చేపలు పట్టే తన అలవాటును కాంగ్రెస్ మానుకోలేదు. మధ్యప్రదేశ్‌లోని మందసార్‌లో జరిగిన దురదృష్టకర పరిణామాల నుంచి రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. అక్కడ జరిగిన హింసాత్మక ఆందోళనలో ఐదుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఆందోళనలో ప్రాణనష్టం జరగడం అత్యంత బాధాకరమైన విషయం. మరోపక్క కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, బిజెపి ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండగా మరోపక్క ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ ఈ విచారకర పరిణామాల నుంచి రాజకీయ ప్రయోజనం పొందే పనిలో తీరిక లేకుండా ఉంది. దాదాపు యాభై ఏళ్ల పాటు దేశాన్ని పరిపాలించి ఇన్నేళ్ళూ రైతులను నిర్లక్ష్యం చేసి వారిని ఈ స్థితికి తీసుకు వచ్చిన కాంగ్రెస్‌కు వారి దుస్థితి గురించి మాట్లాడే నైతిక అర్హత ఉందా?

నిజానికి పదేళ్ళ యుపీఎ పాలనలో రైతుల పరిస్థితి మరింత దిగజారింది. ఆత్మహత్యలు గణనీయంగా పెరిగాయి. వ్యవసాయ రంగ వృద్ధి రేటు 2 శాతం కంటే దిగువకు చేరుకుంది. అన్ని పార్టీలు సంకుచిత దృక్పథాన్ని వీడి ఆందోళనతో అట్టుడుకుతున్న ప్రాంతంలో శాంతి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సహకరించవలసిన సమయం ఇది. దురదృష్టవశాత్తూ మంటలను చల్లార్చాల్సింది పోయి, కొన్ని రాజకీయ పార్టీలు సరిగ్గా దానికి వ్యతిరేకంగా, అగ్గికి మరింత ఆజ్యం పోస్తున్నాయి.

పంటరుణాలు మాఫీ చేయాలని దేశవ్యాప్తంగా చాలాకాలంగా డిమాండు వినిపిస్తున్నా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు అది దీర్ఘకాలిక పరిష్కారం కాదన్నది వాస్తవం. దానివల్ల రైతులకు తాత్కాలిక ఉపశమనం మాత్రమే లభిస్తుంది. సాగు ఖర్చులను తగ్గించి రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ఈ సమస్యకు సరైన పరిష్కారం. రైతు రుణాల మాఫీల వల్ల ద్రవ్య వ్యవస్థ అతలాకుతలమయ్యే ప్రమాదం ఉందని రిజర్వు బ్యాంకు గవర్నర్ హెచ్చరిక ఈ సందర్భంగా గమనార్హం.

రైతులను, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన యుపీఎ విధానానికి భిన్నంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గ్రామం, పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత తమ ప్రభుత్వ ప్రాధాన్యాలని అధికారంలోకి వచ్చిన మొదటిరోజునే ప్రకటించారు. దీనికి అనుగుణంగానే రైతుల ఆదాయాలను 2022 నాటికి రెట్టింపు చేయడమే లక్ష్యంగా ఎన్‌డిఎ ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలను ప్రకటించింది.

రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అత్యంత కీలకమైన పంటల బీమా పథకం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అన్ని సీజన్లలో అన్ని పంటలకు బీమా రక్షణ కల్పిస్తుంది. కేంద్రం ప్రకటించిన మరో భారీ పథకం కృషి సించాయి యోజన. దీనికింద రూ.50 వేల కోట్లతో దేశంలో ప్రతి పొలానికి నీరు అందించేందుకు కృషి జరుగుతోంది. 14 కోట్ల భూసార కార్డుల పంపిణీ లక్ష్యంగా పెట్టుకోగా ఇందులో 7.1 కోట్ల కార్డుల పంపిణీ ఇప్పటికే పూర్తయింది. ఈ-నామ్ (ఈ జాతీయ వ్యవసాయ మార్కెట్) ద్వారా దేశంలోని వ్యవసాయ మార్కెట్లు అన్నిటినీ అనుసంధానించి రైతులు ఎక్కడ గిట్టుబాటు ధర లభిస్తుందో తెలుసుకుని అక్కడ తమ పంటను అమ్ముకునే సదుపాయాన్ని కేంద్రం కల్పించింది. 36.43 లక్షల మంది రైతులు, 84,631 మంది వర్తకులు, 42,109 కమిషన్లు ఈ-నామ్‌ను ఉపయోగించుకుంటున్నారు.

**రైతుల ఆదాయాలను 2022 నాటికి రెట్టింపు చేయడమే లక్ష్యంగా ఎన్‌డిఎ ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలను ప్రకటించింది. పంటల బీమా పథకం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అన్ని సీజన్లలో అన్ని పంటలకు బీమా రక్షణ కల్పిస్తుంది. కృషి సించాయి యోజన. కింద రూ.50 వేల కోట్లతో దేశంలో ప్రతి పొలానికి నీరు అందించేందుకు కృషి జరుగుతోంది. 14 కోట్ల భూసార కార్డుల పంపిణీ లక్ష్యంగా పెట్టుకోగా ఇందులో 7.1 కోట్ల కార్డుల పంపిణీ ఇప్పటికే పూర్తయింది.**

వివిధ పంటలకు కనీస మద్దతు ధరను ఎన్‌డిఎ ప్రభుత్వం గణనీయంగా పెంచింది. ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాల ఫలితంగా పప్పు ధాన్యాల దిగుబడి పెరిగింది. 2016-17 ఖరీఫ్‌కు పప్పుధాన్యాల కనీస మద్దతు ధరను ప్రభుత్వం పెంచింది.

మరిన్ని గోదాముల నిర్మాణం, శీతల నిల్వకేంద్రాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం, శీతలీకరణ వ్యానులను కొనుగోలు చేయడం, ఆహార ఉత్పత్తుల పరిశ్రమల ద్వారా వ్యవసాయానికి అదనపు విలువ చేర్చడం, సార్వత్రిక పంట బీమా, నిరంతర విద్యుత్ సరఫరా, సకాలంలో భరించదగ్గ రేట్లకు రుణాలు మంజూరు చేయడం, మార్కెట్ సమాచారానికి వేగవంతమైన అందుబాటును కల్పించడం మొదలైన అనేక చర్యలు ప్రభుత్వం తీసుకుంది. కనీసమద్దతు ధరలను పెద్ద ఎత్తున పెంచింది. రైతులకు రుణాలను అందించేందుకు గతంలో ఎన్నడూ లేనంత మొత్తంలో ఎన్డీఏ ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.10 లక్షల కోట్లను ప్రకటించింది. రైతుల కోసం దూరదర్శన్ ప్రత్యేకంగా కిసాన్ ఛానెల్‌ను ప్రారంభించింది. రైతులకు తగినంత యూరియా లభ్యమయ్యేందుకు వేపపూతతో కూడిన యూరియాను ప్రారంభించింది. నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల భారతదేశంలో వ్యవసాయం రికార్డు స్థాయిలో ఉత్పత్తులను సాధించింది.

రైతుల సమస్యలను పరిష్కరించడంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వ చిత్తశుద్ధిని ఎవరూ శంకించనవసరం లేదు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యవసాయంపై పూర్తి దృష్టి సారించినందువల్లే ఆ రాష్ట్రంలో గత కొద్ది సంవత్సరాలుగా అసాధారణమైన రీతిలో 20 శాతం కంటే ఎక్కువ అభివృద్ధి రేటు మనకు కనపడుతుంది.

మధ్యప్రదేశ్‌లో నీటిపారుదల సామర్థ్యం బృహత్తరంగా పెరగడం వల్లనే వ్యవసాయం 7.5 లక్షల హెక్టార్ల నుంచి 40 లక్షల హెక్టార్ల వరకు విస్తరించేందుకు అవకాశాలు పెరిగాయి. నర్మదా నీరును మాల్వా నదీ పరివాహక ప్రాంతాలకు తరలించేందుకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను చేపట్టింది. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు పట్టే సమయం మధ్యప్రదేశ్‌లో చాలా తక్కువ. వారు గతంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నిటినీ పూర్తి చేయడమే కాక 8 నుంచి 36 నెలల్లో కొత్త ప్రాజెక్టులను పూర్తిచేస్తున్నారు. రైతులు తీసుకునే రుణాలకు వడ్డీపై పూర్తి సబ్సిడీ కల్పించడం, పదిగంటల పాటు వ్యవసాయానికి విద్యుత్ అందించడం, విద్యుత్ బకాయిలు మాఫీ చేయడం, ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడడం, అత్యధిక మొత్తంలో బీమా క్లెయిమ్‌లను చెల్లించడం మొదలైన అనేక రైతు అనుకూల చర్యల్ని మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంది.

మధ్యప్రదేశ్‌లో రైతులు సమస్య ఎదుర్కొంటున్నది వ్యవసాయ ఉత్పత్తులు లేకపోవడం వల్ల కాదు.. సమృద్ధిగా పంటలు పండడం వల్లనే అన్న విషయం గ్రహించాలి. వాటికి గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ప్రభుత్వం ఈ విషయంలో సాధ్యమైనన్ని చర్యలు తీసుకుంటోంది. రైతాంగ సంఘాలు పెట్టిన 13 డిమాండ్లలో 11 డిమాండ్లకు ముఖ్యమంత్రి అంగీకరించారు. వ్యవసాయ ఉత్పత్తుల వ్యయం, మార్కెటింగ్ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. రుణాల తిరిగి చెల్లింపులో విఫలమైన రైతులకు తిరిగి రుణాలు కల్పించేందుకు కొత్త పథకాన్ని ప్రారంభిస్తు న్నారు. అన్ని పంటలకూ గిట్టుబాటు ధరలు లభించేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని కూడా మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పరిస్థితుల్లో అయిదుగురు రైతులు మరణించినందుకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేయడం ఆ పార్టీ రాజకీయ దివాలాతనాన్ని సూచిస్తుంది. 1998లో కాంగ్రెస్ హయాంలో దిగ్విజయ్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలోని ముల్తాయిలో పోలీసు కాల్పుల్లో 24 మంది రైతులు మరణించిన విషయాన్ని ఆ పార్టీ మరిచిపోయిందా? అప్పుడు దిగ్విజయ్ సింగ్ తన పదవి నుంచి ఎందుకు వైదొలగలేదు? ఆనాడు కాంగ్రెస్ ఆయన రాజీనామాను డిమాండ్ చేసిందా? సోనియా గాంధీ ఆ ప్రదేశాన్ని సందర్శించారా? దురదృష్టవశాత్తు ప్రతిపక్ష పార్టీలు రైతులను, కొందరు సంఘ వ్యతిరేక శక్తులను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించు కోవాలని ప్రయత్నిస్తున్నాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు సహాయపడే బదులు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇది పూర్తిగా వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. స్వార్థ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తే వారు గ్రహించే సమయం ఆసన్నమైంది. ఇన్నాళ్లకు రైతాంగ సమస్యలకు పూర్తిగా ఒక సమగ్ర దృక్పథంతో పరిష్కార చర్యలు తీసుకునే ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. రైతుల పరిస్థితిని మెరుగుపరిచేందుకు, రానున్న రోజుల్లో వారి ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతాంగానికి బంగారు భవిష్యత్ కల్పించేందుకు ప్రధానమంత్రి కృతనిశ్చయులై ఉన్నారు. అందుకే రైతు సమస్యను రాజకీయం చేయవద్దని నా విన్నపం. ■

**1998లో కాంగ్రెస్ హయాంలో దిగ్విజయ్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలోని ముల్తాయిలో పోలీసు కాల్పుల్లో 24 మంది రైతులు మరణించిన విషయాన్ని ఆ పార్టీ మరిచిపోయిందా? అప్పుడు దిగ్విజయ్ సింగ్ తన పదవి నుంచి ఎందుకు వైదొలగలేదు? ఆనాడు కాంగ్రెస్ ఆయన రాజీనామాను డిమాండ్ చేసిందా? సోనియాగాంధీ ఆ ప్రదేశాన్ని సందర్శించారా? దురదృష్టవశాత్తు ప్రతిపక్ష పార్టీలు రైతులను, కొందరు సంఘ వ్యతిరేక శక్తులను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి.**

## రైతులకు సకాలంలో రుణాలు అందించాలి

తెలంగాణలో ఖరీఫ్‌లో నిర్ణయించిన లక్ష్యం మేరకు రూ.23,000 కోట్ల పంట రుణాలను సకాలంలో రైతులకు అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్టేట్ లెవల్ బ్యాంకర్ కమిటీని బిజెపి ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. బిజెపి శాసనసభ పక్షనేత జి.కిషన్ రెడ్డి నేతృత్వంలోని ఎమ్మెల్యేల బృందం జూన్ 17న స్టేట్ లెవల్ బ్యాంకింగ్ కమిటిని కలిసి రైతులకు సకాలంలో పంట రుణాలు, నగదు అందించడం విషయంపై బ్యాంకులలో తలెత్తుతున్న సమస్యలపై చర్చించింది. బిజెపి ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్.వి.యస్.యస్. ప్రభాకర్ ఈ బృందంలో ఉన్నారు.

రైతులకు రుణమాఫీ పథకం కింద టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన 4వ విడత బడ్జెట్ అన్ని బ్యాంకుల నుండి రైతు ఖాతాలకు జమ చేసే అంశంపై కూడా బిజెపి ఎమ్మెల్యేలు చర్చించారు. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ పద్దు కింద రూ.3,999 కోట్లు విడుదల చేసినట్లుగా తెలిపారు. అయితే రాష్ట్ర స్థాయి క్రెడిట్ ప్లాన్‌ను ప్రారంభించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయడం కారణంగా రైతులకు పంట రుణాల విడుదల ఆలస్యం అవుతున్నదని అన్నారు. తొలకరి వర్షాలు కురిసి రైతులు విత్తనాలు వేస్తున్న నేపథ్యంలో రైతులకు వెంటనే పంటరుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రైతులు అమ్ముకున్న ఉత్పత్తులకు లభించే సొమ్ము నగదు రూపంలో అందించాలని కోరారు. దానికనుగుణంగా స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రైతుల పంట రుణాలను 7 శాతం వడ్డీకే ఇవ్వాలని సకాలంలో చెల్లించిన రైతులకు 4 శాతం వడ్డీకే రుణాలు అందించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రతి ఎకరాకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పెంచాలని కోరారు. దాని కనుగుణంగా స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ అన్ని బ్యాంకులకు తగు మార్గదర్శకాలు విడుదల చేయాలని బిజెపి ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు.

–జనసందేశ్ ప్రతినిధి

సిద్ధాంతాల పట్ల నమ్మకం ఎంత అవసరమో, వాటిని ఆచరణలో పెట్టడంలో క్రమశిక్షణ అంతే అవసరం. – దీన్‌దయాళ్జీ

# పండగలా సబ్కా సాథ్ సబ్కా వికాస్ సమ్మేళనాలు

కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అవినీతిరహిత, సమర్థ పాలన అందిస్తూ విజయవంతంగా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక పట్టణాల్లో మోదీ ఫెస్ట్, సబ్కా సాథ్ సబ్కా వికాస్ సమ్మేళనాలు ఉత్సాహం సాగాయి. ఇందులో భాగంగా తెలంగాణలోనూ 6 మోదీ ఫెస్ట్‌లు, 20 సబ్కా సాథ్ సబ్కా వికాస్ సమ్మేళనాలు నిర్వహించారు. 'ఏక్ భారత్ – శ్రేష్ట భారత్' లక్ష్య సాధన దిశగా 'సబ్కా సాథ్ సబ్కా వికాస్' నినాదంతో వందకు పైగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్న విషయాన్ని, పథకాల వివరాలను దేశప్రజలకు తెలియజేయడమే ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశం.

అభివృద్ధి, సంక్షేమం రెండు లక్ష్యాలను సమాంతరంగా, సమర్థవంతంగా నిర్వహిస్తూ మోదీ ప్రభుత్వం దేశప్రజలకు మునుపెన్నడూ లేనివిధంగా పాలన అందించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు జన్‌ధన్ యోజన, ఉజ్జ్వల, ఫసల్ బీమా యోజన , ముద్రా యోజన లాంటి ఎన్నెన్నో వినూత్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంకా విస్తృతంగా అమలు చేయడానికి ఈ ఉత్సవాలు దోహద పడుతాయి.

ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్రమంత్రివర్యులు బండారు దత్తాత్రేయ, హన్స్‌రాజ్ ఆహిర్, పురుషోత్తం రూపాలా, అర్జున్ రాం మేఘ్వాల్, పిపి చౌదరి, ఎంపీలు ప్రతాప్ సింహా, కిరీట్ సోమయ్య, భగవంత్ ఖూబాతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్, జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీదర్ రావు, శాసనసభాపక్ష నాయకుడు జి.కిషన్ రెడ్డి, శాసనమండలి పక్షనాయకుడు ఎన్.రాంచందర్ రావు, ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్, రాజాసింగ్, జాతీయ కార్యవర్గ సభ్యులు పేరాల శేఖర్ రావు, నాగం జనార్ధన్ రెడ్డి, ఉత్సవాల పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ చింతా సాంబమూర్తితో పార్టీ శ్రేణులు పెత్త ఎత్తున్న పాల్గొన్నాయి. ఓ వైపు కార్యవిస్తార్ యోజన జరుగుతున్నప్పటికీ ఈ కార్యక్రమాల్లోనూ పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాం అవినీతిమయం



కాంగ్రెస్ హయాంలో అవినీతి విచ్చలవిడిగా వ్యాపించిందని హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతల అవినీతి దాహం కారణంగా నష్టపోయిన దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ గాడిన పెడుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి, కరీంనగర్‌లో జూన్ 9న నిర్వహించిన మోదీ ఫెస్ట్‌లో ప్రసంగిస్తూ కాంగ్రెస్ హయాంలో గాలి, నీరు, ఆకాశం, చివరికి భూగర్భంలో కూడా కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. అధికారం అంటే పెత్తనం కాదు.. సేవ అని ప్రధాని ఆచరణలో చూపారని ఖట్టర్ కొనియాడారు. మూడేండ్ల కింద అసంతృప్తిగా ఉన్న యువతకు ఉపాధి మార్గం చూపుతున్నామన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 106 సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని వివరించారు. కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ కేంద్రం చేస్తున్న సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వివరించాలని కోరారు. అదే రీతిలో బిజెపి శ్రేణులు ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.

రాజకీయ నేతలు అవినీతికి దూరంగా ఉండాలని ఖట్టర్ పిలుపునిచ్చారు. నేతలు అవినీతికి పాల్పడితే అధికారులూ అదే బాటలో నడిచే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనలో దేశానికి అవినీతి కేన్సర్ పట్టుకుందని ఆరోపించారు. అందుకు హర్యానా రాష్ట్రమే ఉదాహరణ అని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లు సందర్శించారు. సూరజ్‌కుండ్‌మేళాలలో తెలంగాణనే మా పార్ట్‌నర్ స్టేట్ అని చెప్పారు. దేశ ఐక్యత కోసం ఒక రాష్ట్ర ఇంకో రాష్ట్రంతో సంబంధాలు పెంచుకోవాలన్న ప్రధాని మోదీ సూచన మేరకు హర్యానా రాబోయే రోజుల్లో తెలంగాణతో సత్సంబంధాలు ఏర్పర్చుకుంటుందని ఖట్టర్ ప్రకటించారు. హర్యానాలోని తెలుగు కార్మికుల పిల్లల కోసం తెలుగు పాఠశాల నెలకొల్పుతామన్నారు.

## తెలంగాణలోనూ బిజెపి ప్రభుత్వం ఖాయం





ప్రధాని మోదీ ప్రజా సంక్షేమానికి, అన్ని ప్రాంతాల అభివృద్ధికి చేపడుతున్న పనులకు మంచి స్పందన లభిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారం తెలిపారు. జూన్ 6న కరీంనగర్, హైదరాబాద్ ఆనంద్‌బాగ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మోదీ ఫెస్ట్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆహిర్ మోదీ అధికారం చేపట్టిన అనంతరం చేసిన పనులు, తీసుకువచ్చిన మార్పులను వివరించారు. తమ ప్రభుత్వం నీతివంతమైన పాలన సాగిస్తోందని, వచ్చే యాభైఏళ్ల పాటు అధికారంలో ఉంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. మోదీ పనితీరుకు మెచ్చి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల ప్రజలు బిజెపికి పట్టం కట్టి ఆశీర్వదించారన్నారు. మోదీ సుపరిపాలనతో తెలంగాణలోనూ రానున్న రోజుల్లో బిజెపి అధికారం చేపట్టడం ఖాయమన్నారు.

## పేదల సంక్షేమానికి కృషి

భారత ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలో పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అర్జున్‌రాం మెఘ్వాల్ అన్నారు. జూన్ 15న సిద్ధిపేటలో జరిగిన సబ్కా సాథ్ సబ్కా వికాస్ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేఘ్వాల్ కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల పాలనలో మచ్చలేని పాలన అందిస్తూ ప్రధాని మోదీ పేద ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. పేదల సంక్షేమానికి మూడు సంవత్సరాల్లో 106 పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు.

బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించిన ఘనత బిజెపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇండ్లు లేని వారికి ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ఇందులో భాగంగా సిద్ధిపేటకు 1,200 ఇండ్ల కేంద్ర పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు మంజూరు చేశారని గుర్తుచేశారు. దేశంలో 2 కోట్ల మందికి ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, మనోహరాబాద్ – సిద్ధిపేట – కొత్తపల్లి రైల్వేలైన్




కోసం కేంద్ర ప్రభుత్వం రూ.320 కోట్లు మంజూరు చేసిందని , తెలంగాణ అభివృద్ధి కోసం హార్టికల్చర్ యూనివర్సిటీ ఇచ్చామని, అమృత్ పథకం కింద సిద్ధిపేటకు రూ.120 కోట్లు మంజూరు చేశామని కేంద్ర మంత్రి వివరించారు.

అభివృద్ధిలో మోదీ ప్రభుత్వం సౌత్, నార్త్, ఈస్ట్, వేస్ట్ అనే తేడాలు చూపడంలేదన్నారు. దేశ సంస్కరణల యుగంలో జీఎస్టీ అతిపెద్ద సంస్కరణగా అర్జున్‌రాం మెఘ్వాల్ అభివర్ణించా రు. 7.24 కోట్ల మందికి రూ.3.84 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేశామని, 18 వేల మంది విదేశాలలో చిక్కుకుపోతే వారందరినీ క్షేమంగా తిరిగి రప్పించిన ఘనత బిజెపికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మన్ పాల్గొన్నారు.

## ఒక్క అవినీతి ఆరోపణ లేదు



మూడేళ్ల మోదీ పాలనలో నయాపైసా అవినీతి ఆరోపణలు ఎదుర్కోలేదని కేంద్ర వ్యవసాయ సహాయ మంత్రి పరుషోత్తం రూపాల అన్నారు. జూన్ 10న భువనగిరి, జూన్ 11న పెద్దపల్లిలో జరిగిన సబ్కా సాథ్ సబ్కా వికాస్ సమ్మేళనంలో మాట్లాడుతూ మూడేళ్లలో కేంద్రం నుంచి లక్ష కోట్లు తెలంగాణ ప్రభుత్వానికి అందజేశామన్నారు. గత ప్రభుత్వాలు నింగి నుంచి నేలదాకా కుంభకోణాలకు పాల్పడ్డాయని విమర్శించారు. ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు తక్కువ ప్రీమియంతో ఎక్కువ పరిహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. 14వ ఆర్థిక సంఘం నిధులు గ్రామాలకు కేంద్ర ప్రభుత్వమే అందిస్తోందని, సంబంధిత నిధులను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో అందజేయకపోతే పన్నుల రూపంలో జరిమానాతో పాటు గ్రామాలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఔషధ కంపెనీలపై నియంత్రణ పెట్టడంతో పాటు ప్రజలకు చౌకగా మందులు అందించేందుకు జనరిక్ మందులను అందుబాటులోకి తెచ్చామన్నారు.

## దేశ ప్రయోజనాలే బిజెపికి ముఖ్యం

దేశంలో పార్టీలు సొంత లబ్ధి, తమ ఎదుగుదలకు ప్రధాన్యమిస్తున్నాయని, బిజెపికి మాత్రం దేశ ప్రయోజనాలే ముఖ్యమని, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని ముందు కెళ్తున్నారని కేంద్ర ఐటీ, న్యాయశాఖ సహాయ మంత్రి పిపి చౌదరి స్పష్టం చేశారు. జూన్ 17న మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన 'సబ్కా సాథ్ సబ్కా వికాస్ సమ్మేళనం'లో పాల్గొని ప్రసంగించిన పిపి చౌదరి పేదలు, రైతులు, అణగారిన వర్గాలు, మహిళలు ఇలా అన్ని వర్గాల సర్వతోముఖాభివృద్ధికి మోదీ ప్రభుత్వం పాటుపడుతోందని అన్నారు. మోదీ బాటలో కేంద్రమంత్రులు, ఎంపీలు సుపరిపాలనకు కృషి చేస్తున్నారని తెలిపారు. అవినీతి, ఉగ్రవాదంపై పోరాటంలో మోదీ అద్భుతమైన, చారిత్రాత్మక నిర్ణయాలను తీసుకుంటుందన్నారు. గతంలో బీమా పథకాలు అంటే కేవలం ఉద్యోగులకు మాత్రమే



అందేవని, ఈ మూడేళ్లలో పేదలకు బీమా పథకాలతో పాటు 28 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు, 7.5 కోట్ల మందికి ముద్రా రుణాలు అందించామన్నారు. 15వేల గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో స్నేహభావాన్ని కొనసాగిస్తున్న భారత్‌ను పక్కనున్న పాకిస్థాన్ మాటిమాటికి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న పాకిస్థాన్‌ను ప్రపంచంలో ఏకాకి చేసిన ఘనత ప్రధానిదేనని చెప్పారు.



ప్రతి హిందువూ హిందూ దేశ చరిత్ర చదివి తీరాలి. – మహాత్మాగాంధీ

భావ పరివర్తన చాలదు, హృదయ పరివర్తన కావాలి. – శ్రీ దత్తోపంత్ ఠెంగ్డే

ఏకాత్మత

# ఏకాత్మ మానవ దర్శన అవసరం!

● శివరాం

బిజెపి తన మౌలిక సిద్ధాంతంగా స్వీకరించిన ఏకాత్మమానవ దర్శనం గురించిన పేరులోనే చాలా కాలం సందిగ్ధత కొనసాగింది. దీనదయాళ్జీ దాన్ని ఒక ప్రసంగ రూపంలో వెల్లడించినప్పుడు ఆంగ్లంలో Integral Humanisum అన్నారు. సాధారణ అను వాదకులు దాన్ని సమగ్ర మానవ వాదం అని పేర్కొన్నారు. అదొక సిద్ధాంతము అని అర్థమైన తరువాత దాన్ని ఏకాత్మతా మానవతా వాదం అని కొంత కాలం అన్నారు. ఆ తరువాత ఏకాత్మతలో ఒకసారి, మానవతలో మరోసారి రెండుసార్లు 'తా' ఎందుకని ఏకాత్మ మానవతా వాదము అని కొన్నాళ్ళు అన్నారు. ఆ తరువాత వాదం అంటే వివాదం కూడా ఉన్నట్లు ఒప్పుకోవాలి కదా అసలు ఇది వాదమా సిద్ధాంతమా అనే చర్చ కొనసాగింది. భారతీయ చింతనలో సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వ, ఉత్తర మీమాంస (వేదాంత) అని ఆరు మౌలిక సిద్ధాంతాలు ఉన్నవి. వాటిని షడ్దర్శనాలు అంటారు. ప్రకృతి, పురుషుడు, లేదా దేహము, ఆత్మల గురించి చర్చ జరిపి అవగాహన కలిగించే విజ్ఞానము సాంఖ్యము. సాంఖ్యులు వివరించిన భౌతిక వివిధతను, 25 మూల వస్తువులను ఆమోదిస్తూనే అన్నింటికీ మూలమైన దివ్యచైతన్యాన్ని ప్రతిపాదిస్తుంది యోగ. ఆస్తికుల కైవల్యము, మోక్షము, నాస్తికుల బ్రహ్మానందము, బౌద్ధుల నిర్యాణము అని చెప్పబడే స్థితిని చేరుకోడానికి అష్టాంగ యోగమనే అనుస్థానాన్ని మార్గంగా నిర్దేశిస్తుంది యోగ. పతంజలి యోగ సూత్రాలు, బౌద్ధుల అష్టాంగ యోగములది ఇంచుమించు ఒకే తీరు.మన చుట్టూ ఉన్న ప్రపంచము, ప్రకృతి పట్ల సరైన అవగాహన కోసం పరిశీలన, పరిశోధనలతో కూడిన తార్కిక మార్గాన్ని చూపుతుంది న్యాయ దర్శనం. విశాల విశ్వం లోని వివిధ వస్తుజాలము అణు నిర్మితమనీ, వస్తువులను పరిమిత అణువులకు కుదించగలమన్న కణాదుని సిద్ధాంతాన్ని స్వీకరించి, ఆ అణువుల చైతన్యానికి మూలశక్తి బ్రహ్మము (సర్వవ్యాపిత చైతన్యము) అని వివరిస్తుంది వైశేషికం. వేదాలను నిర్ద్వంద్వంగా బలపరుస్తూ, వేద, ఉపనిషత్తుల బోధను ఆమోదిస్తూనే, ముక్తి సాధనలో క్రతువుల పట్ల కన్నా వైయక్తిక క్రమశిక్షణ, ధ్యానం పట్ల మొగ్గ చూపుతుంది మీమాంస, వేదాంతం. ఈ ఆరు దర్శనాలతో పోల్చి చూస్తే సమస్త జీవులకు సంపూర్ణ కళ్యాణం సమకూర్చగల మార్గంగా దీనదయాళ్జీ ప్రవచించినది కూడా దర్శనమే అని తేల్చిన తరువాత దీన్ని ఏకాత్మ మానవ దర్శనము అని నిర్ధారించారు.



**పార్టీ సిద్ధాంతాలను కార్యకర్తలు సమగ్రంగా అర్థం చేసుకునేందుకు దీన్‌దయాళ్‌జీ ప్రవచించిన ఏకాత్మ మానవ దర్శనం విశిష్టత, విశేషాలను వివరిస్తూ, విశ్లేషణతో కూడిన వ్యాసాలను ధారావాహికగా జనసందేశ్ పాఠకులకు అందించనున్నాం.**

### ఏకాత్మ మానవవాదం పూర్వరంగం

ఆంగ్ల పాలన నుండి భారత దేశం విముక్తమై, ఒక రాజ్యాంగాన్ని ఏర్పరచుకుని, స్వతంత్ర పాలన ఆరంభించే నాటికి ప్రపంచంలో వ్యక్తివాదం, సమాజవాదం, సామ్యవాదం, తదితర వాదాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. మనకు భారతీయుల కు మనదైన ఆలోచన, విధానం ఏదీ లేదా? అనే అన్వేషణలో వెలుగు చూసిన మన భారతీయ తాత్త్వికతను సమగ్ర మానవ దర్శనం పేరిట దీనదయాళ్జీ వెల్లడించారు.

1965, ఏప్రిల్లో ముంబాయిలో జరిగిన నాటి భారతీయ జనసంఘ్ (బిజెపి పూర్వరూపం) సమావేశాల్లో 22,23,24, 25 తేదీల్లో వరుసగా చేసిన ప్రసంగాల్లో దీనదయాళ్జీ ఈ సిద్ధాంతాన్ని తొలుత వెల్లడించారు. అప్పటికి వ్యక్తి వాదము, సమాజ వాదము, సామ్యవాదము అని ప్రాచుర్యంలో ఉన్నవి అన్నీ వాదాలే కనుక అందరికీ సులువుగా అర్థం కావడం కోసం దీన్ని కూడా Integral Humanisum అని పేర్కొని, ఏకాత్మతా మానవతా వాదము అని చెప్పారు.

అప్పటికి ప్రపంచం అంతటా ప్రాచుర్యంలో ఉన్న వాదాలలోని మంచి చెడులను క్షుణ్ణంగా పరిశీలించి, సోదాహరణంగా వివరించి, విఫల మార్గాలను పట్టుకుని వేలాడే బదులు సమగ్రము, సార్వజనికము అయిన భారతీయ మార్గాన్ని ఎంచుకోవడం మేలు అంటూ దీనదయాళ్జీ ఈ వాదాన్ని దేశం ముందుంచారు. దీన్ని భారత్ ఆచరించి, ప్రపంచానికి అందించాలని ఆయన అభిలషించారు. ఇది కేవలం భారతీయులకు పరిమితమైనది కాదు. విశ్వమానవాళికి, చరాచర జగత్తు సంక్షేమానికి,లోక కళ్యాణానికి ఉద్దేశించిన సిద్ధాంతం.

### ఇతర వాదాలకన్నా ఇది శ్రేష్ఠమైనది

ఇతర వాదాలు మానవ అభ్యుదయం వరకు మాత్రమే పరిమితం కాగా ఇది మావుని సమగ్ర జీవనానికి, దానికి ఆధారభూతమైన ప్రకృతిని పరిగణనలోకి తీసుకుని, వ్యష్టి నుండి మొదలై, కుటుంబము, గ్రామము, జాతి, దేశము, ప్రకృతి మొదలైన వ్యవస్థలను, దాటి పరమేష్ఠి వరకు ఆలోచన చేసింది.■



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. – స్వామి వివేకానంద

స్ఫూర్తి


# జన సంఘ్ ఎందుకు?

**డా॥ శ్యామాప్రసాద్ ముఖర్జీ 1951 అక్టోబర్ 21న ఢిల్లీలో జరిగిన అఖిల భారతీయ జనసంఘ్ సదస్సు అధ్యక్షోపన్యాసంలో భారతీయ జనసంఘ్ ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణాలను వివరించారు. ఆయన ఉపన్యాసం ఆఖరి భాగాన్ని పాఠకుల సౌలభ్యం కోసం ప్రచురిస్తున్నాం.**

(గత సంచికలో ప్రచురితమైన వ్యాసానికి కొనసాగింపు)

కశ్మీర్‌కు సంబంధించి ఐక్యరాజ్యసమితిలో మనం దాఖలు చేసిన కేసును ఉపసంహరించాలని ఇక ముందు ప్లెబిసైట్ (ప్రజాభిప్రాయసేకరణ) ప్రస్తావనే ఉండకూడదన్నది మన పార్టీ వైఖరి. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం. ఆ ప్రాంతాన్ని ఇతర రాష్ట్రాలను చూసినట్టుగానే చూడాలి. కశ్మీర్‌లో మూడో వంతు శత్రువు చేతిలో ఉండడం, భవిష్యత్తులో ఏ ఆక్రమణ జరిగినా తిప్పికొడతామని మధ్యమధ్యలో ప్రకటించినా మన ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని విదేశీ ఆక్రమణ నుంచి విడిపించలేకపోవడం విషాదం. నేను పైన చెప్పిన అంశాలను బట్టి జాతీయ అంతర్జాతీయ సమస్యలను వాస్తవ పరిస్థితుల స్ఫూర్తితో చూడాలని అది దేశ గౌరవానికి లోబడి ఉండాలనేది మన పార్టీ వైఖరి.

ఇతర పార్టీల అధికార ప్రతినిధులు, ముఖ్యంగా కాంగ్రెస్ అధ్యక్షుడు నెహ్రూ మన మీద విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయన ప్రధానమంత్రి కనక ఆయన వ్యాఖ్యలకు విలువ ఉంటుంది. ఆయన పదే పదే మన మీద దాడి చేయడం వల్ల మనం బలం పుంజుకుంటాం. మనం దూషణలకు, బెదిరింపులకు లొంగం. అయితే వీటివల్ల మనకు విస్తృతమైన ప్రచారం వచ్చింది. అందుకని విమర్శించే వారికి కృతజ్ఞతలు తెలియజేయాలి. మరో పార్టీ విధానాలను విమర్శించే హక్కు ఎవరికైనా ఉంటుంది కాని ఆ విమర్శలు వాస్తవానికి దూరంగా ఉండకూడదు. మనది మతతత్వ పార్టీ అనీ, మనవి తిరోగమన భావాలన్న విమర్శ ఎక్కువగా ఉంది. మన కార్యక్రమాలను నిశితంగా పరిశీలించే వారికి ఎవరికైనా ఇది వాస్తవం కాదని అర్థం అవుతుంది. నిజానికి మతతత్వాన్ని ప్రోత్సహిస్తున్నది కాంగ్రెసే. ముఖ్యంగా ఈ పని చేస్తున్నది నెహ్రూనే. గత 30 ఏళ్ల నుంచి ఆయన ఏం చేశారో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవడం మంచిది.



**కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం. ఆ ప్రాంతాన్ని ఇతర రాష్ట్రాలను చూసినట్టుగానే చూడాలి. కశ్మీర్‌లో మూడో వంతు శత్రువు చేతిలో ఉండడం, భవిష్యత్తులో ఏ ఆక్రమణ జరిగినా తిప్పికొడతామని మధ్యమధ్యలో ప్రకటించినా మన ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని విదేశీ ఆక్రమణ నుంచి విడిపించలేకపోవడం విషాదం. జాతీయ అంతర్జాతీయ సమస్యలను వాస్తవ పరిస్థితుల స్ఫూర్తితో చూడాలని అది దేశ గౌరవానికి లోబడి ఉండాలనేది మన పార్టీ వైఖరి.**

ముస్లిం లీగ్ మంకుతనాన్ని ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు ఆయన, ఆయన అనుచరులు వెనక్కుతగ్గి చివరకు మన దేశాన్ని విభజించారు. కశ్మీర్‌ను హిందూ-ముస్లిం ప్రాంతాలుగా విడగొట్టాలని డా॥ అంబేద్కర్ ఇటీవల చేసిన ప్రతిపాదన అనేక మందికి దిగ్భ్రాంతి కలిగించింది. మనమూ దీన్ని అంగీకరించం. ఇలాంటి వాటి వల్ల సమస్య పరిష్కారం కాకపోవడమే కాక కొత్త కోరికలు ముందుకు తేవడానికి పాకిస్థాన్‌కు అవకాశం వస్తుంది. ఇది ముస్లిం లీగ్ అనుసరించిన పద్ధతి. భారత్ విషయంలో నెహ్రూ, ఆయన మిత్రులు చేసింది సరిగ్గా ఇదే. మనలో కొందరు కూడా బెంగాల్, పంజాబ్ విభజనకు అంగీకరించిన మాట వాస్తవమే కాని భారత్ విభజన తప్పదన్న సందర్భంలోనే మనం ఆ పని చేశాం. ఈ ప్రాంతాలను సమైక్య భారత్‌లో భాగంగా ఉంచాలనే మనం ఎప్పుడూ కోరుతున్నాం. కాని కాంగ్రెస్ ద్రోహం వల్ల ఇది సాధ్యం కాదని అనుకున్నప్పుడు, కాంగ్రెస్‌కు, ముస్లిం లీగ్‌కు బ్రిటిష్‌వారి అండతో ఒప్పందం కుదిరినప్పుడు ఈ ప్రాంతాలలో వీలైనంత ప్రాంతాన్ని భారత్‌లో ఉంచడానికి మనం ప్రయత్నించాం. లేకపోతే ఆ ప్రాంతాలను సంపూర్ణంగా కోల్పోయేవాళ్లం. భారత్‌ను విభజించకుండా ఉంటే ఈ ప్రాంతాలను విభజించవలసిన అవసరం గాని, భారత్ విమోచన కోసం అనేక బాధలు అనుభవించిన వారు కష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చి ఉండేదే కాదు.

ముస్లిం మతతత్వానికి లొంగిపోయి భారతీయ జాతీయవాదాన్ని వదిలేసిన తర్వాత, పాకిస్థాన్ బెదిరింపులకు లొంగిపోయిన తర్వాత నెహ్రూ ఇతరులను మతతత్వవాదులని నిందించడం భావ్యం కాదు. భారత్‌లో ఇప్పుడు మతతత్వవాదం ఏమీ లేదు. ఉన్నదల్లా నెహ్రూ ప్రారంభించిన ముస్లింలను సంతుష్టీకరణ మాత్రమే. వచ్చే ఎన్నికలలో ముస్లింల ఓట్లు సంపాదించడం కోసం నెహ్రూ, ఆయన మిత్రులు ఈ పని చేశారు. నేడు మన దేశంలో ప్రాంతీయ, వర్గ, కుల విభేదాలున్నాయి. వీటిని నిర్మూలించడానికి మనం కలిసికట్టుగా కృషి చేయాలి. నిజమైన ప్రజాస్వామ్య భారత్‌కు పునాది వేయాలి.

దేశం ముందున్న అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే నెహ్రూ మతతత్వ వాదనలను లేవదీస్తున్నారు. ఇవాళ దేశం ముందు ఆకలి, పేదరికం, దోపిడీ, దుష్పరిపాలన, అవినీతి, పాకిస్థాన్‌కు మోకరిల్లడం వంటి సమస్యలున్నాయి. ఈ రుగ్మతలన్నింటికీ బాధ్యత కాంగ్రెస్, నెహ్రూ

నాయకత్వంలోని ప్రభుత్వానిదే.

### ఆశల కొత్త శకం

మన పార్టీ ఏర్పాటుతో కొత్త ఆశల, శాంతి, పటిష్టత శకం మొదలవుతుందన్నదని మన గట్టి విశ్వాసం. మన లక్ష్యాలు పటిష్టంగా ఉన్నాయి. వీటిని సాధించడం మన పార్టీని ఎంత గట్టి పునాదిపై నిర్మిస్తామన్న దాని మీదే ఆధారపడి ఉంటుంది. ప్రజల మనసుల్లో ఈ భావాలు పాదుకొనేలా చేయడం మీదే ఉంటుంది. దీనికి సమయం, కష్టపడి పని చేయడం అవసరం. ఇది వచ్చే ఎన్నికల కారణంగా మసక బారకూడదు. దీనిని మనం ధైర్యంగా ఎదుర్కుంటాం. ప్రజలకు మన వైఖరి వివరిస్తాం. ప్రతిపక్షంలో ఉన్న పార్టీల మధ్య ఎన్నికల అవగాహన కుదిరితే వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్‌ను ఓడించే అవకాశం ఉంటుంది. దీనికి పలుకుబడి, ఓట్ల మద్దతు కావాలి. కాంగ్రెస్ అపారంగా డబ్బు సమకూర్చుకుంది. మద్దతు సమకూర్చుకోవడం కోసం అనేక వర్గాల మీద విపరీతమైన ఒత్తిడి చేస్తోంది. అధికారంలో ఉండడం వల్ల కాంగ్రెస్‌కు శక్తి ఉంటుంది. ఎన్నికలలో విజయం సాధించడం కోసం కాంగ్రెస్ అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడానికి కూడా వెనుకాడదు. ఇటీవల ఢిల్లీ ఎన్నికలలో మన అనుభవాన్ని బట్టి చూస్తే ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరిగే అవకాశం లేదు. ఢిల్లీలో కాంగ్రెస్ మహాసభ కోసం అధికార యంత్రాంగాన్ని విపరీతంగా దుర్వినియోగం చేశారు. ఇలాంటి అధికార దుర్వినియోగం తప్పుడు సంప్రదాయాలను నెలకొల్పుతుంది.

స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరగాలని గట్టిగా కోరడానికి ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలి. కాంగ్రెస్ విజయం సాధించిన ఢిల్లీ ఎన్నికలలో కూడా ఆసక్తికరమైన అంశాలున్నాయి. మొత్తం ఓటర్లలో కేవలం 30 శాతం మంది మాత్రమే కాంగ్రెస్‌కు ఓటు వేశారు. అంటే అత్యధిక సంఖ్యాక ఓటర్లు కాంగ్రెస్ వ్యతిరేకులే. కాంగ్రెస్ ఘన విజయం సాధించడానికి ప్రధాన మంత్రి ఇతరులు తీవ్రంగా ప్రయత్నించారు. రంగంలో అనేక మంది అభ్యర్థులు ఉండకుండా ఉంటే, కాంగ్రెస్ కాని స్వతంత్రులకు కాంగ్రెస్ టికెట్లు ఇవ్వకుండా ఉంటే కాంగ్రెస్ ఓడిపోయేదే. మన పార్టీ ఏర్పడి కేవలం రెండు నెలలే అయినప్పటికీ 24 శాతం ఓట్లు సాధించాం. చాలా చోట్ల విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థులు సాధించిన ఓట్లకు మన పార్టీ అభ్యర్థులు సాధించిన ఓట్లకు తేడా చాలా స్వల్పంగానే ఉంది. ఇది చిన్న విజయం ఏమీ కాదు. మన లక్ష్య సాధనలో విజయం సాధిస్తామన్న విశ్వాసంతో మన కార్యకర్తలు ముందుకు సాగాలి. అనేక ప్రాంతాలలో ఇప్పటికే మనం గణనీయమైన మద్దతు సాధించగలిగాం.

### సేవ, త్యాగం

సంపూర్ణమైన విశ్వాసం, ఆశ, ధైర్యంతో మనం ముందుకు సాగుదాం. సేవ, త్యాగం వల్లే ప్రజల మద్దతు సంపాదించగలమని మన కార్యకర్తలు గ్రహించాలి. భారత్‌ను బలోపేతం చేసి, పునర్నిర్మించవలసిన లక్ష్యం మన ముందుంది. వర్గ, కుల, మత విబేధాలు లేకుండా సేవ చేయాలని మాతృదేశం పిలుస్తోంది. ప్రస్తుతం కారు మేఘాలు కమ్ముకుని ఉన్నా మనం సాధించవలసింది సాధించడానికి అపారమైన అవకాశం ఉంది. మన ఎన్నికల గుర్తు దీపం. ఈ దీపం ద్వారా దేశాన్ని ఆవరించిన చీకటిని పారదోలడానికి వెలుగులు విరజిమ్ముదాం. మన ప్రస్థానం ఇప్పుడే మొదలైంది. విధి మనకు ఎల్లప్పుడూ సరైన మార్గంలో ప్రయాణించే శక్తి అనుగ్రహించుగాక. ఆధ్యాత్మికంగానూ, పాదార్థికంగానూ భారత్‌ను గొప్ప దేశంగా తయారు చేద్దాం. ప్రపంచ శాంతిని కాపాడే దేశంగా, అభివృద్ధి సాధించే దేశంగా భారత్‌ను తీర్చిదిద్దుదాం. జై భారత్!■

సంపూర్ణమైన విశ్వాసం, ఆశ, ధైర్యంతో మనం ముందుకు సాగుదాం. సేవ, త్యాగం వల్లే ప్రజల మద్దతు సంపాదించగలమని మన కార్యకర్తలు గ్రహించాలి. భారత్‌ను బలోపేతం చేసి, పునర్నిర్మించవలసిన లక్ష్యం మన ముందుంది. వర్గ, కుల, మత విబేధాలు లేకుండా సేవ చేయాలని మాతృదేశం పిలుస్తోంది.

## విద్యాలయాల్లో ర్యాగింగ్‌ను సహించేది లేదు





విద్యాలయాలకు మచ్చ తీసుకొస్తున్న ర్యాగింగ్ భూతాన్ని సమూలంగా నిర్మూలించాలని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ పిలుపునిచ్చారు. యూ జీసీ రూపొందించిన ర్యాగింగ్ నిరోధక మొబైల్ యాప్‌ను మే 29న ఢిల్లీలో విడుదల చేసిన జవదేకర్ ర్యాగింగ్ సమస్యను తుదముట్టించేందుకు ఈ యాప్ ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ర్యాగింగ్ నిరోధక వైబ్‌సైట్ ద్వారానే చాలావరకు సమస్య తగ్గిపోయినట్టు రికార్డులు చూపిస్తున్నాయన్నారు. తక్షణ చర్యలు తీసుకునే ఈ యాప్‌తో విద్యార్థులకు మరింత భరోసా కలుగుతుందని అన్నారు.

సాధారణంగా సీనియర్ విద్యార్థులు జూనియర్లకు మార్గదర్శకులుగా ఉండి సహాయ సహకారాలు అందిస్తారని అన్నారు. అయితే కొందరు మాత్రం ర్యాగింగ్ పేరుతో జూనియర్లను ఏడిపిస్తారని చెప్పారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టే ర్యాగింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని తేల్చిచెప్పారు. ర్యాగింగ్‌కు పాల్పడేవారు చదువు కొనసాగించకుండా వేటు వేస్తామని, కఠిన శిక్షలు విధిస్తామని హెచ్చరించారు. ఈ యాప్ జూనియర్లకు విశేషంగా ఉపకరిస్తుందని చెప్పారు. ర్యాగింగ్ బాధితులు ఈ యాప్ ద్వారా తక్షణమే ఫిర్యాదు చేయవచ్చని, చర్యలు కూడా తక్షణమే తీసుకుంటామని తెలిపారు. ఈ యాప్ ఆండ్రాయిడ్ సిస్టమ్‌లో పనిచేస్తుంది. ఎవరైనా ఈ యాప్‌లో లాగిన్ అయి ఫిర్యాదు నమోదు చేయవచ్చు. ఆ ఫిర్యాదు సంబంధిత అధికారులకు చేరుతుంది. తక్షణమే చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది.

**-జనసందేశ్ ప్రతినిధి**


పరోపకారమే పుణ్యం, పర పీడనమే పాపం. - శ్రీ విద్యా ప్రకాశనందగిరి స్వామి

విశ్లేషణ



# నాలుగు దేశాల పర్యటనతో నాలుగువందల లాభాలు

● కర్రావు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే జర్మనీ, స్పెయిన్, రష్యా, ఫ్రాన్స్ దేశాలలో విజయవంతంగా పర్యటించారు. తన సఫల దౌత్య విధాన కిరీటంలో ఈ పర్యటన కలికితురాయి. ఈ నాలుగూ యూరోపియన్ దేశాలే. బ్రెగ్జిట్, మధ్య ఆసియా నుంచి వలసలు, ఫ్రాన్స్‌లో ఇటీవలే ఎన్నికలు, పారిస్ వాతావరణ మార్పుల నియంత్రణ సదస్సు నుంచి అమెరికా వైదొలగడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ పర్యటన అత్యంత కీలకం.

ప్రపంచ నాయకత్వం దిశగా భారత్‌ను నడిపించడం, పర్యావరణ పరిరక్షణ, మారుతున్న ప్రపంచంలో యూరప్ రాజకీయాల్లో వస్తున్న కొత్త మార్పుల నేపథ్యంలో భారత్ దృక్పథం వంటి అంశాల్లో మోదీ తనదైన ముద్రతో భారత్‌ను ముందుకు తీసుకువెళ్తున్నారు. ఆ దిశగా ఈ నాలుగు దేశాల యాత్ర ఉపయోగపడింది. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి ఆశావహ పథకాలకు కూడా ఈ పర్యటన ఊపునిచ్చి, ఉత్పాదనను, వాణిజ్యాన్ని పెంచుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం మూడేళ్లే అయింది. మూడేళ్లలో భారీ మార్పులు అంతర్జాతీయ వ్యవహారాల్లో వస్తాయనుకోవడం పొరబాటు. కానీ గత మూడేళ్లలో దేశ ప్రయోజనాలే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం గణనీయమైన చర్యలు చేపట్టింది. అమెరికాతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే, ప్రపం దేశాలన్నిటిలోనూ భారత్ పట్ల సదభిప్రాయాన్ని సృష్టించడంలో మోదీ ప్రభుత్వం గణనీయంగా విజయం సాధించింది. ఇన్నేళ్లుగా నెహ్రూ విధానం ప్రభావంలో మనం పట్టించుకోని ఇజ్రాయిల్‌కు రాష్ట్రపతి ప్రణబ్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌లు వెళ్లారు. ఇజ్రాయిల్ అధ్యక్షులు రూవెన్ రివ్లిన్, రక్షణ మంత్రి మోషె యాలోన్‌లు భారత్‌లో పర్యటించారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా విదేశాంగ విధానాన్ని కొత్తగా మలచుకునే ప్రయత్నంలో ఇదొక కీలక ఘట్టం.

## నాలుగు దేశాల పర్యటనలో కీలకాంశాలు

- పారిస్ ఒప్పందం నుంచి అమెరికా బయటకు వచ్చింది. ఈ నేపథ్యంలో భారత్ ఈ ఒప్పందానికి నాయకత్వం వహిస్తోంది. పారిస్ ఒప్పందాన్ని ప్రపంచ ఉమ్మడి వారసత్వ సంపదగా ఆయన అభివర్ణించారు.
- కుదంకుళం న్యూక్లియర్ ప్లాంట్ విషయంలో భారత రష్యాలు రెండు కీలక ఒప్పందాలపై సంతకం చేశాయి.
- భారత రష్యాలు ఇంధన వంతెన నిర్మాణానికి సన్నద్ధమయ్యాయి.
- న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్‌లో భారత్ చేరికను నాలుగు దేశాలూ సమర్థించాయి.
- రష్యాతో సంబంధాలను మెరుగుపరిచే దిశగా చర్యలు.
- బలీయమైన యూరోపియన్ యూనియన్ ను మోదీ సమర్థించారు.

ఇటీవలి నాలుగుదేశాల పర్యటనలో ఆయన జర్మన్ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్, స్పెయిన్ అధ్యక్షుడు మారియానో రాజోయ్, రష్యన్ అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్, ఫ్రాన్స్ కొత్త అధ్యక్షుడు ఇమాన్యువెల్ మాక్రన్‌లతో ఆయన అత్యంత ప్రాధాన్యతాంశాలపై చర్చలు జరిపారు. గత ముప్పై సంవత్సరాల్లో భారత ప్రధాని స్పెయిన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. 1988లో రాజీవ్ గాంధీ పర్యటన తరువాత మరే ప్రధానీ ఆ దేశానికి వెళ్లలేదు. స్పెయిన్ యూరోపియన్ యూనియన్‌లో ఏడవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి, సైబర్ సెక్యురిటీ, పౌరవిమానయానం వంటి రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. మోదీ ఈ దేశంతో పలు ఒప్పందాలు చేసుకున్నారు.

జర్మనీ చాన్స్‌లర్ మెర్కెల్ సెప్టెంబర్‌లో ఎన్నికలకు వెళ్తున్నారు ఈ సమయంలో భారత్‌తో ద్వైవార్షిక చర్చలు (ఇంటర్ గవర్నమెంటల్ కన్సల్టేషన్స్) నిర్వహించడం ఆమెకు చాలా ఉపయోగం. ఈ అవకాశాన్ని మోదీ చక్కగా ఉపయోగించుకుని భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇరు దేశాలకు లాభం ఉంటుందన్న విషయాన్ని నొక్కి చెప్పగలిగారు. మెర్కెల్ ఉగ్రవాద నియంత్రణ విషయంలో భారత్ వాదనను గట్టిగా సమర్థించారు. భారత్‌కు ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం విషయంలో కూడా జర్మనీ భారత్‌కు మద్దతు పలికింది.

రష్యాతో ప్రస్తుతం మన సంబంధాల్లో కొత్త ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రష్యా, చైనా, పాకిస్థాన్‌ల వైపు మొగ్గు చూపుతోంది. కానీ మోదీ పాత సంబంధాలకు కొత్త ఊపిరి ఊదేందుకు ఆయన ప్రయత్నించారు. పుతిన్‌తో కలిసి ఆయన రెండో ప్రపంచ యుద్ధంలో అమరులైన సైనికుల సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఆ మరణించిన వారిలో పుతిన్ సోదరుడు, ఇతర కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. రష్యాతో నమ్మకం, స్నేహం, ఆత్మీయతల ఆధారంగా సంబంధాలను పెంపొందించే దిశగా ఆయన ప్రయత్నించారు.

చివరగా ఆయన ఫ్రాన్స్‌కి చేరుకున్నారు. ఫ్రాన్స్‌లో ఇటీవలే కొత్త ప్రభుత్వం వచ్చింది. కొత్త అధ్యక్షుడు మాక్రన్‌తో సత్సంబంధాలను నెలకొల్పే దిశగా, విశ్వాసాన్ని చూరగొనే దిశగా ఆయన ప్రయత్నించారు. మాక్రన్ మోదీ వెంట తొలి ప్రపంచ యుద్ధంలో అమరులైన భారత జవాన్లకు శ్రద్ధాంజలి అర్పించేందుకు వచ్చారు. యూరోప్ రాజకీయాల్లో భారతీయుల పాత్రను మాక్రన్ గుర్తించారు. రానున్న రోజుల్లో ఉగ్రవాద వ్యతిరేక పోరులో కలిసి పోరాడేందుకు ఫ్రాన్స్, భారత్ కలిసి ముందుకు నడిచేందుకు సమాయత్తమౌతుంది. ■



# ఎస్‌సిఓలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం




**కామర్సు బాలసుబ్రహ్మణ్యం**
బిజెపి పార్లమెంటరీ కార్యాలయ కార్యదర్శి


'షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్'లో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించారు. 1996లో 'ఎస్‌సిఓ'ను కజగిస్తాన్, క్రిజిగిస్తాన్, రష్యా, చైనా, తజకిస్తాన్ దేశాలు కలిపి ఏర్పాటు చేసుకున్నాయి. వివిధ అంతర్జాతీయ విషయాల్లో భారత్‌కు అడుగడుగునా అడ్డం పడుతున్న చైనా కూడా 'షాంఘై కోఆపరేషన్ ఆర్గనేజేషన్'లో భారత్ ఉండాలని పట్టుబట్టడం గొప్ప పరిణామం. ఎస్.సి.ఓలో భారత్ చేరిక వల్ల ఈ ప్రాంతపు ఆర్థికాభివృద్ధి, రవాణా సహా ఇతర మౌలిక సౌకర్యాల ఏర్పాటు, తీవ్రవాద వ్యతిరేక పోరాటంతో పాటు ఇతర అంశాలలో వేగవంతమైన అభివృద్ధి జరుగుతుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు.

ప్రపంచంలోని 40 శాతం జనాభాకు, ప్రపంచ జిడిపిలో 20 శాతానికి ఎస్.సి.ఓ. ప్రాతినిధ్యం వహిస్తోంది. కజగిస్తాన్‌లోని ఆస్తానాలో జరిగిన ఈ సదస్సుకు మరొక ప్రాముఖ్యత ఉన్నది. భారత్-పాకిస్తాన్‌లో సంయుక్త సైనిక పాటవాన్ని ప్రదర్శిస్తారు. రీజనల్ యాంటీ-టెర్రరిజం స్ట్రక్చర్ (ఆర్ఎటిఎస్) ఆధారంగా ఈ సైనిక విన్యాసం కొనసాగుతుంది. 2005 సంవత్సరం నుంచి షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్‌లో పరిశీలక హోదాలో భారత్ కొనసాగుతూ వస్తున్నది. దిగువ స్థాయి సమావేశాలలో పాల్గొంటూ, రక్షణ ఆర్థిక అంశాలలో చర్చలు జరుపుతూ వస్తున్నది. ఇప్పుడు పూర్తిస్థాయి సభ్యత్వం రావడం వల్ల ఈ ప్రాంతపు సమగ్ర అభివృద్ధిలో భారత్ పాత్ర కీలకమవుతుంది. మొదట్లో 5-6 దేశాల సరిహద్దుల వెంట శాంతిభద్రతలు కాపాడుకునే లక్ష్యంతో ఏర్పడిన ఎస్.సి.ఓ. తదనంతర కాలంలో తన పరిధిని విస్తృత పరుచుకుంటూ వచ్చింది. ఇప్పుడు భారత్ చేరికతో ఈ సంస్థ ప్రాముఖ్యత మరింతగా పెరిగింది. ఈ సంస్థలో భారత్ చేరిక వల్ల మధ్య ఆసియా క్షేత్రంలో అభివృద్ధితో పాటు సరిహద్దుల వెంట రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి.

అయిదు దేశాల సరిహద్దుల వెంబడి బలమైన సైనిక విశ్వాసం ఒప్పందంపై షాంఘైలో సంతకాలు చేయడంతో 26 ఏప్రిల్ 1996లో ఎస్.సి.ఓ. ప్రాణం పోసుకుంది. ఆ తరువాత మాస్కోలో జరిగిన మరొక సదస్సులో ఈ సరిహద్దుల వెంట సైనిక పటాలాన్ని తగ్గించుకోవాలని మరొక ఒప్పందం చేసుకున్నారు. 'మానవత్వం', 'మానవ హక్కుల పరిరక్షణ' తదితర అంశాలను సాకుగా చూపిస్తూ ఒక దేశం మరొక దేశపు అంతర్గత విషయాలలో తలదూర్చకూడదని నిర్ణయించుకున్నారు. 2001లో ఉజ్బెకిస్తాన్ కూడా ఇందులో చేరడంతో ఆరు దేశాలు అయ్యాయి. ఇప్పుడు భారత్, పాకిస్థాన్‌లు చేరడంతో 8 సభ్య దేశాలు అయ్యాయి.

> 'షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్'లో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించారు. వివిధ అంతర్జాతీయ విషయాల్లో భారత్‌కు అడుగడుగునా అడ్డం పడుతున్న చైనా కూడా 'షాంఘై కోఆపరేషన్ ఆర్గనేజేషన్'లో భారత్ ఉండాలని పట్టుబట్టడం గొప్ప పరిణామం. ఎస్.సి.ఓలో భారత్ చేరిక వల్ల ఈ ప్రాంతపు ఆర్థికాభివృద్ధి, రవాణా సహా ఇతర మౌలిక సౌకర్యాల ఏర్పాటు, తీవ్రవాద వ్యతిరేక పోరాటంతో పాటు ఇతర అంశాలలో వేగవంతమైన అభివృద్ధి జరుగుతుంది.

మధ్య ఆసియా క్షేత్రంలో తీవ్రవాదం, వేర్పాటువాదం, సాయుధ పోరాటాలకు వ్యతిరేకంగా పనిచేయాలన్నది ఎస్.సి.ఓ. ప్రథమ లక్ష్యం. 2006లో జరిగిన సదస్సు ఈ దిశలో కీలకపాత్ర పోషిస్తుంది. అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు సభ్య దేశాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నాయి. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఆగని పక్షంలో అంతర్జాతీయ తీవ్రవాదాన్ని అడ్డుకోవడం కష్టమని ఈ సదస్సు అభిప్రాయపడింది. 'అంతర్జాల యుద్ధం' కు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కూడా ఎస్.సి.ఓ నిర్ణయించుకున్నది. అంతర్జాల యుద్ధం కారణంగా ఆయా దేశాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక, నైతిక విలువలు దెబ్బతింటున్నాయని దీన్ని కూడా ఒక ప్రమాదంగానే భావించాలని ఈ దేశాలు అభిప్రాయపడ్డాయి. ఎస్.సి.ఓ. ఏర్పడిన తరువాత మధ్య ఆసియా ప్రాంతంలో తీవ్రవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం బలపడింది. దేశాల మధ్య నిఘా విభాగపు సమాచారం ఇచ్చిపుచ్చుకునే వ్యవస్థ బలపడింది. తీవ్రవాదంపై ఉమ్మడి దాడులు ప్రారంభమయ్యాయి. ఎస్.సి.ఓ. ఏర్పడిన తరువాత ఉమ్మడి విద్యుత్ ఉత్పాదక కేంద్రాల ఏర్పాటు కూడా ఊపందుకుంది. గ్యాస్, చమురు క్షేత్రాల అభివృద్ధికి సంబంధించి ఒప్పందాలు జరిగాయి. దేశాల మధ్య జల వినియోగంలో అవగాహన పెరిగింది. 'ఎనర్జీ క్లబ్'లు ఏర్పాటయ్యాయి. ఆహార భద్రతపై చర్చలు విస్తృతంగా జరిగాయి. అంతర్జాతీయంగా ఇప్పుడున్న బ్యాంకింగ్ వ్యవస్థలకు భిన్నంగా సభ్య దేశాలు ఒక బ్యాంకును ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఆర్థికంగా కుదేలవుతున్న దేశాలను రక్షించుకోడానికి ఇటువంటి బ్యాంకింగ్ వ్యవస్థ అవసరం అని గుర్తించాయి. ఇప్పుడున్న ప్రపంచ బ్యాంక్, ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) సంస్థలు కొన్ని దేశాలకు వత్తాసు పలుకుతూ, వారి ప్రయోజనాలు మాత్రమే కాపాడుతూ పెత్తందారీతనాన్ని చెలాయిస్తున్నాయి. కాబట్టి సొంతంగా బ్యాంకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించాయి. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం, పెంచుకోవడం, పొరుగుదేశాలతో పంచుకోవడం కోసం వీలైనన్ని ఎక్కువ చర్చలు చేపట్టాలని ఎస్.సి.ఓ. నిర్ణయించింది. మధ్య ఆసియా క్షేత్రంలో కీలకమైన ఎస్.సి.ఓలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించింది. భారత్ ప్రవేశంతో ఈ క్షేత్రం విస్తృతంగా అభివృద్ధి చెందుతున్నదన్న విశ్వాసం ప్రస్ఫుటమవుతున్నది.■



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. - స్వామి వివేకానంద


విశ్లేషణ

# ప్రజాస్వామ్యానికి చీకటి రోజులు ఎమెర్జెన్సీ

**(1975లో ఇందిరా గాంధీ దేశంలో ఎమెర్జెన్సీ విధించి జూన్ 26 నాటికి 42 సంవత్సరాలు పూర్తవుతుంది. జూన్ 26న ఎమర్జెన్సీ వ్యతిరేక దినం జరుపుకొంటున్న సందర్భంగా జనసందేశ్ పాఠకుల కోసం ప్రత్యేక వ్యాసం)**

ఎమెర్జెన్సీ రోజులు (1975-77) భారతీయుల ఆలోచనా ధోరణులను సమూలంగా మార్చేశాయి. ఇప్పటి తరం ఎమర్జెన్సీ గురించి వినడమే తప్ప ఆ పీడకలను ప్రత్యక్షంగా అనుభవించలేదు. వారి ద ృష్టిలో ఎమర్జెన్సీ అంటే స్వాతంత్ర్యంలాగ ఒక పదం మాత్రమే. కానీ ఈ రెండు పదాలూ మన దేశాన్ని నిర్మించాయి, పునర్నిర్మించాయి. వేలాదిమంది బలిదానాల వల్లనే ఇవాళ మనం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆస్వాదిస్తున్నాం. ఎమర్జెన్సీని ఎదిరించినందుకు వేలమంది చిత్రహింసలకు గురైనా, చివరకు వారు దాన్ని ఓడించారు. ముందు తరాల బాధలు, త్యాగాల నుంచి మనం లబ్ధి పొందామన్నది చారిత్రక నిజం.

ఆధునిక భారత చరిత్రను స్వాతంత్ర్యానికి ముందు, తరవాత అని విభజించడం సహేతుకమే. స్వాతంత్ర్యానికి ముందు మనల్ని శ్వేతజాతి సామ్రాజ్యవాద, వలసవాదులు పాలిస్తే, స్వాతంత్ర్య అనంతరం సొంత నాయకులే పరిపాలించారు. అదే రెండు కాలాలకూ మధ్యనున్న మౌలిక తేడా. అలాగే భారతదేశ చరిత్రను ఎమర్జెన్సీకి ముందూ తరవాత అని కూడా విభజించవచ్చు. అయితే రెండు కాలాల్లో ఒకే వర్గం భారత్‌ను పాలించడంతో ఈ రెండింటి మధ్య తేడాను స్పష్టంగా గమనించలేకపోతున్నాం. నిజం చెప్పాలంటే ఎమర్జెన్సీకి ముందూ తరవాత కూడా జవహర్‌లాల్ నెహ్రూ ప్రభ కొనసాగింది. దానితో స్వాతంత్ర్యం అనంతరం మనం ఏర్పరచుకున్న ఆదర్శాలే ఎమర్జెన్సీ తరవాత కూడా కొనసాగుతున్నాయని భావించాం. కానీ అది ఒట్టి భ్రమ. ఎమర్జెన్సీ తరవాత మన విలువల వ్యవస్థ పూర్తిగా మారిపోయింది. గట్టిగా ఖండించవలసినవే శిరోధార్యంగా మారాయి. అంతా ఏకవ్యక్తి ప్రదర్శనలా మారిపోయింది. బలమైన నాయకులు తెరమరుగైపోయి ఇందిరాగాంధీ ఆదేశాలకు డూడూబసవన్నల్లా తలూపేవాళ్లు ముఖ్య మంత్రులయ్యారు. ఇందిరను కేంద్రంలో 'ఒకే ఒక్క మగాడు'గా పరిగణించసాగారు. ఎమర్జెన్సీకి ముందు అవినీతిని అందరూ




ఏవగించుకునేవారు. తమ శాఖలపై ఏదైనా అవినీతి ఆరోపణ వస్తే నైతిక బాధ్యత వహించి మంత్రులు రాజీనామా చేసేవారు. కానీ, ఎమర్జెన్సీ తరవాత అవినీతిపై సిగ్గుతో తలదించుకునేవాళ్లు కనబడకుండా పోయారు. కాంగ్రెస్ నాయకులూ, ప్రభుత్వ సభ్యులూ అవినీతికి పాల్పడటం తమ జన్మహక్కు అన్నట్లుగా ప్రవర్తించసాగారు. అవినీతి మకిలి న్యాయవ్యవస్థకూ, సమాచార సాధనాలకూ అంటుకుంది. దీనివల్ల అవినీతిపై పోరాడటానికి ప్రజలకు దారులు మూసుకుపోసాగాయి. అంతటా నిర్లిప్తత, అవకాశవాదం రాజ్యమేలాయి.

ప్రజాస్వామ్యానికి పూర్తి విరుద్ధమైన అనువంశిక పాలనకు ఎమర్జెన్సీ పట్టం కట్టింది. ఇది నెహ్రూ కుటుంబానికి మాత్రమే పరిమితం కాలేదు. సంపన్నుల, రాజకీయ కుటుంబాల సంతానం అధికారం తమ గుత్తసొత్తు అన్నట్లు ప్రవర్తించసాగారు. ఇందిరాగాంధీ హత్యను పురస్కరించుకుని ఢిల్లీలో సిక్కులపై కాంగ్రెస్ గూండాల హత్యాచారాలను రాజీవ్ గాంధీ వెనకేసుకొచ్చారు. రాజకీయాల్లో శక్తిమంతమైన కుటుంబాల పెత్తనం అప్రతిహతంగా సాగడం మూలానే కాంగ్రెస్ క్షీణదశలోకి జారిపోయింది. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష అంటూ నెహ్రూ కుటుంబం చూపిన బాటలో ఇతర రాజకీయ కుటుంబాలూ నడవడం యావత్ భారతదేశ రాజకీయాలను దిగజార్చింది. క్రమంగా ఈ జాడ్యం ఇతర పార్టీలకూ అంటుకుంది. అనువంశిక పాలనకు మోకరిల్లే మనస్తత్వం ఇప్పటికీ మనల్ని వదలలేదు. పలువురు ముఖ్యమంత్రులు, మంత్రుల కుమారులు, కుమార్తెలు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఆస్తులు పోగేసుకోవడం చూస్తే ఈ దేశాన్ని తమ కుటుంబ ఆస్తిగా పరిగణించే తరం పుట్టుకొచ్చిందని అర్థమవుతుంది. వీరి దారికి అడ్డువచ్చే ప్రజా వేగులు హతమైపోతున్నారు.

ఎమర్జెన్సీ తీసుకొచ్చిన ఈ అవాంఛనీయ మార్పులన్నింటికీ మూలకారకుడు సంజయ్ గాంధీయేననడంలో సందేహం లేదు. ఆ రోజుల్లో సంజయ్ ఆగడాలకు అంతే లేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఆయన వల్ల కలిగిన నష్టం అంతాఇంతా కాదు. సంజయ్ పుణ్యమా అని భజనపరుల గుంపు పార్లమెంటుకు ఎన్నికైంది. ఇందిరను కానీ, కాంగ్రెస్‌ను కానీ విమర్శించినవాళ్లపై నోరువేసుకుపడటమే ఈ భజనపరుల పని. ఇక అప్పటి నుంచి పార్లమెంటరీ కార్యకలాపాలను స్తంభింపజేసే సంప్రదాయం మొదలైంది. ఇతర పార్టీలకూ ఇది ఆనవాయితీ అయిపోయింది. ఎమర్జెన్సీ కాలంలో చొరబడిన మనస్తత్వాలు, పెడధోరణులు ఇప్పటికీ మనల్ని వీడిపోలేదు. ఎమర్జెన్సీ కాలంలో రైళ్లు సమయానికి వచ్చేవని సమర్థించేవాళ్లు ఇప్పటికీ కనిపిస్తారు. పోలీసు రాజ్యం ఉంటే కానీ పనిచేయని పనికిమాలిన వాళ్లమా? మనది బాధ్యత తెలియని అస్తవ్యస్త జాతి అని ఒప్పుకొందామా? ఎమర్జెన్సీ కాలంలో ఢిల్లీలో పోలీసులు థర్డ్ డిగ్రీ పద్ధతులకు పాల్పడిన ఘటనలు జరిగినా, కేరళలో అవి హద్దులు దాటిపోయాయి. అక్కడ అమాయకులను కూడా వేధించారు. రక్తం చిందించకుండా చిత్రహింసలు పెట్టే కొత్త పద్ధతులను కనిపెట్టారు. ఎమెర్జెన్సీలో చోటుచేసుకున్న ఘోర మానవ హక్కుల ఉల్లంఘనపై విచారణకు ఇంతవరకు కమిషన్ వేయడం కానీ, ఇతర చర్యలు తీసుకోవడం కానీ జరగలేదు. మున్ముందు ఎమర్జెన్సీ అకృత్యాల వంటివి పునరావృతం కాకుండా మనం జాగ్రత్త వహించాలి.■




# నాణ్యమైన విద్యపై ఎన్‌డిఎ దృష్టి



డా॥ అమిత్ మాలవీయ
బిజెపి ఐటి విభాగం జాతీయ కన్వీనర్

మొదట విద్య రాజ్యాంగంలో రాష్ట్ర జాబితాలో ఉండేది. 1976లో స్వరణ్ సింగ్ కమిటీ రాజ్యాంగ అంశాలను చర్చించినప్పుడు "దేశం ఆశించిన సామాజిక, ఆర్థిక మార్పులను వేగంగా సాధించడంలో వ్యవసాయం, విద్య కీలకపాత్ర వహిస్తాయి. ఈ రెండు అంశాలకు సంబంధించి జాతీయ స్థాయి విధానాల రూపకల్పన చాలా ముఖ్యం," అని ప్రకటించింది. దీని ఆధారంగా 1972లో 42 వ రాజ్యంగ సవరణ ద్వారా 'విద్య'ను కేంద్రం-రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి విద్యకు సంబంధించి చట్టాలను చేసి వాటిని అమలు చేసే అధికారం కేంద్రానికి, రాష్ట్రాలకు రెండిటికి లభించింది.

ఎన్‌డిఎ ప్రభుత్వం గత మూడేళ్లకాలంలో దేశవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో విద్య నాణ్యతను పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఇందులో భాగంగా అటు ఉపాధ్యాయులు, కోర్సులు, విద్యాబోధనకు అవసరమైన సామగ్రి, ఇతర సదుపాయాలతో పాటు ఇటు పిల్లల గ్రాహ్యత, సమర్థత స్థాయిలు, మదింపు విధానాలు మొదలైన ఫలితాలపై కూడా దృష్టి కేంద్రీకరించింది. ఉదాహరణకు, బోధనా విధానాల నాణ్యతను పెంచేందుకు సర్వీసుకు ముందు, సర్వీసులోను ఇచ్చే శిక్షణను మరింత బలోపేతం చేస్తున్నారు. అలాగే టీచర్ల నియామకానికి ఉమ్మడి మదింపు పరీక్షలను ప్రవేశపెట్టే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. విద్య ఫలితాల వైపు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర సంబంధిత వర్గాలు దృష్టి కేంద్రీకరించేందుకు ప్రతి తరగతిలోను విద్యార్థి సాధించవలసిన కనీస ప్రమాణాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్దేశించింది.

విద్యాసంస్థల జాతీయ ర్యాంకింగ్, ఇండియా ర్యాంకింగ్స్ వంటి కార్యక్రమాలు పాఠశాలలు, ఉన్నత విద్యాసంస్థల పనితీరు, సమర్థతలను నిరంతరం మదింపు చేయడానికి తోడ్పడతాయి. కేంద్ర ప్రభుత్వం పరిశీలనలో ఉన్న మరో ప్రధాన సంస్కరణ జనగణన ఆధారంగా జాతీయ సాధన సర్వే (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)ల నిర్వహణ. ఏటా నిర్వహించే ఈ సర్వే ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థుల పనితీరును, పురోగతిని ఒకటో తరగతి నుంచి 8 తరగతి వరకు గమనిస్తుంది. విద్యార్థుల పురోగతిలో ఎటువంటి సమస్యలైనా కనిపిస్తే సకాలంలో చర్యలు తీసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

అన్నిస్థాయిల్లో విద్యనూ ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం నవకల్పనలకు ప్రాధాన్యమిస్తోంది. అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం అధునాతన సమాచార, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించు కుంటోంది. ఈ-పాఠశాల, జాతీయ డిజిటల్ లైబ్రరి, 'స్వయం' (స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ యాస్పైరింగ్ మైండ్స్), నిరంతరం అందుబాటులో ఉండే ఆన్‌లైన్ కోర్సులు ఇందుకు కొన్ని ఉదాహరణలు. అటల్ నవకల్పన కార్యక్రమం (అటల్ ఇన్నోవేషన్ మిషన్)లో భాగంగా దేశవ్యాప్తంగా 500 బడులలో అటల్ ప్రయోగశాలలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రయోగ శాలల్లో ఉత్సాహవంతులైన విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను ఆచరణలో పెడుతూ ప్రయోగాలు చేయవచ్చు.

ఇక ఉన్నత విద్యకు వస్తే, అవసరమైన రంగాల్లో పరిశోధన, నవకల్పనలను ప్రోత్సహించే లక్ష్యంతో ఎన్‌డిఎ ప్రభుత్వం 'ఇంప్రింట్' (పరిశోధన, నవకల్పన, టెక్నాలజీపై ప్రభావం), యుఎవై (ఉచ్చతర్ ఆవిష్కార్ యోజన) వంటి నిర్దిష్టమైన పథకాలను అమలు చేస్తోంది. 20 ప్రపంచ స్థాయి పరిశోధనా సంస్థలను (పది ప్రభుత్వ రంగంలో మరో పది ప్రైవేటు రంగంలో ) ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నవలకల్పనలను, ఔత్సాహిక పారిశ్రామికులను ప్రోత్సహించేందుకు ఐఐటిలు, ఐఐఎంలలో పరిశోధనా పార్కులు, ఇంక్యుబేటర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు.

విద్యారంగాన్ని సంస్కరించాలంటే రాష్ట్రాలకు కూడా అందుకు అవసరమైన చొరవ, సంకల్పం ఉండాలి. కేంద్ర మానవ వనరుల శాఖ, నీతి ఆయోగ్‌లు ఇటీవల పాఠశాల విద్య నాణ్యతా సూచిని ప్రారంభించాయి. వివిధ రాష్ట్రాల్లో పాఠశాల విద్య నాణ్యత, ప్రమాణాల మెరుగుదలను ఇది అంచనా వేసి పనితీరు ఆధారంగా వాటికి ర్యాంకులు ఇస్తుంది. రాష్ట్రాలు విద్యపై ఎంతో ఖర్చుపెడుతున్నాయి. సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాయి. అయితే సౌకర్యాల కల్పనపై చూపిస్తున్న శ్రద్ధ వాటివల్ల ఒనగూడుతున్న ఫలితాలపై ఉండటం లేదు. వాటి దృష్టిని ఫలితాలపైకి మరల్చడమే ఈ ప్రమాణాల మదింపు, ర్యాంకింగ్‌ల ఉద్దేశం. రాష్ట్రాలు ఫలితాలను పరిశీలించి అవసరమైన దిద్దుబాటు చర్యలు, సంస్కరణలు ప్రవేశపెట్టేటట్టు ప్రోత్సహించడానికి కేంద్రం ప్రయత్నిస్తోంది.

కేంద్రం 14వ ఆర్థిక సంఘం సిఫార్సులను ఆమోదించడం వల్ల రాష్ట్రాలు విద్య, ఇతర రంగాలపై మరిన్ని నిధులు వెచ్చించడానికి ఆస్కారం ఏర్పడింది. 2012-13 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2016-17లో రాష్ట్రాలు, కేంద్రం విద్యపై పెట్టే ఖర్చు గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల ఆమోదం తరువాత 2014-15తో పోలిస్తే 2016-17లో విద్యపై రాష్ట్రాల ఆర్థిక వ్యయం 30 శాతానికి పెరిగింది.

స్వచ్ఛ భారత్ కార్యక్రమంతో పాటు 2014లో స్వచ్ఛ విద్యాలయ అనే ఉప కార్యక్రమాన్ని కూడా కేంద్రం ప్రారంభించింది. అన్ని బడులలో 100 శాతం పనిచేసే మరుగుదొడ్లు పిల్లలకు అందుబాటులో ఉండేటట్టు చూడాలనేది దీని లక్ష్యం. పెద్ద నోట్ల రద్దు తరువాత విద్యార్థులు స్వచ్ఛందంగా తమ తల్లిదండ్రులకు, బంధువులకు, సామాన్య ప్రజలకు నగదురహిత డిజిటల్ లావాదేవీలు ఎలా జరపాలో నేర్పించే బృహత్తర కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం నిర్వహించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన 'హ్యాకతాన్' సదస్సులో ఇంజనీరింగ్ విద్యార్థులు 30 ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన దాదాపు 600 సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు చూపారు.

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మూడేళ్ళు పూర్తి చేసుకున్న ఈ సందర్భంలో 'పడేగా ఇండియా, బడేగా ఇండియా' (చదువుతో ఉన్నత శిఖరాలను అందుకుంటున్న భారత్) లక్ష్యం దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను, అనుసరించిన విధానాలను గుర్తు చేసుకోవడం అవసరం. ■



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. - గాంధీ




# వచ్చే ఎన్నికల్లోనూ బిజెపిదే విజయం

• వీరేంద్ర కపూర్


మూడేళ్ల పాలన దిగ్విజయంగా పూర్తి చేసుకుని మోదీ ప్రభుత్వం ఉత్సాహంగా ముందుకు వెళ్తోంది. సార్వత్రిక ఎన్నికలకు మరో రెండేళ్లకు మించి సమయం లేదు. ఎన్నికల్లో ఏ పార్టీ పరిస్థితి ఎలా ఉండబోతోందని కచ్చితంగా చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణాన్ని బట్టి మోదీ సారథ్యంలోని ఎన్డీఏ మరో మారు అధికారం చేజిక్కించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పవచ్చు. అయితే, ఈ రెండేళ్లలో ఎన్నో పరిణామాలు చోటుచేసు కోవచ్చు. పార్టీల స్థితిగతులు ఒక్కపెట్టున మారనూవచ్చు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం తలెత్తిన రైతుల ఆందోళనలు ఏ రూపం సంతరించుకుంటాయి, కశ్మీర్ సంక్షోభం ఎలాంటి మలుపు తిరగనుంది వంటి అంశాలు సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు తీర్పును ప్రభావం చేస్తాయనడంలో సందేహం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎన్నికలకు సర్వసన్నద్ధంగా ఉన్న పార్టీ ఏదయ్యా అంటే బిజెపి అని ఠక్కున చెప్పవచ్చు!

దేశంలోని మూలమూలకూ పార్టీని విస్తరించడమే లక్ష్యంగా బిజెపి అధ్యక్షుడు అమిత్ షా ఏకోన్ముఖంగా ముందుకు కదులుతున్నారు. 2019 ఎన్నికల సమరాంగణంలో పార్టీ విజయం కోసం ఆయన వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. పార్టీ అధికారంలో లేని రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటిస్తూ కార్యకర్తల్లో స్ఫూర్తి నింపుతున్నారాయన. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీ కార్యకర్తల ఇళ్లకే నేరుగా వెళ్ళి మంతనాలు జరుపుతున్నారు. వారి ఇళ్లలోనే అందరితో కలిసి కూర్చుని భోజనం చేస్తున్నారు. ఎన్నికల్లో తలెత్తే సవాళ్లను ఎలా ఎదుర్కొవాలో పార్టీ శ్రేణులకు వివరిస్తున్నారు. దేశంలో పార్టీ ప్రాబల్యం తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టి పనిచేస్తున్నారాయన. ఈ మూడేళ్లలో ప్రభుత్వ పనితీరు బాగుంది. ప్రజల్లో ప్రధాని మోదీ పట్ల అభిమానమూ పుష్కలం. అయినప్పటికీ యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వంటి ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో పార్టీ మునుపటి మ్యాజిక్‌ను పునరావృతం చేయడం అంత సులభం కాదన్న విషయం అమిత్ షాకు బాగా తెలుసు. గుజరాత్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో పార్టీ కిందటిసారి మొత్తం సీట్లను కైవసం చేసుకుంది. ఆయా రాష్ట్రాల్లో ఈసారి అదే స్థాయి ఘనవిజయం పునరావృతం అవుతుందని నిర్దిష్టంగా చెప్పలేని పరిస్థితి ఉంది. యూపీ వంటిచోట్ల మునుపటితో పోలిస్తే స్వల్ప సంఖ్యలో సీట్లు తగ్గే అవకాశం కొట్టి పారేయలేనిది.

ఇప్పటికే పటిష్టంగా ఉన్నచోట్ల ఉదాసీనతకు ఏ రకంగానూ తావు ఇవ్వకుండానే దేశంలోని దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల్లో అస్తిత్వాన్ని బలంగా చాటుకోవాలని బిజెపి యత్నిస్తోంది. ఒడిశా, పశ్చిమ్ బంగ, తమిళనాడు, కేరళ, తెలంగాణల్లో విజయావకాశాలు సృష్టించుకునేందుకు ఆ పార్టీ చురుగ్గా పావులు కదుపుతోంది. ఇవన్నీ

> **దేశంలోని మూలమూలకూ పార్టీని విస్తరించడమే లక్ష్యంగా బిజెపి అధ్యక్షుడు అమిత్ షా ఏకోన్ముఖంగా ముందుకు కదులుతున్నారు. 2019 ఎన్నికల సమరాంగణంలో పార్టీ విజయం కోసం ఆయన వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. పార్టీ అధికారంలో లేని రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటిస్తూ కార్యకర్తల్లో స్ఫూర్తి నింపుతున్నారాయన. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీ కార్యకర్తల ఇళ్లకే నేరుగా వెళ్ళి మంతనాలు జరుపుతున్నారు. వారి ఇళ్లలోనే అందరితో కలిసి కూర్చుని భోజనం చేస్తున్నారు.**

ప్రాంతీయ పార్టీల సారథ్యంలో ఉన్న రాష్ట్రాలు. ఈ ప్రాంతాల్లో తొలుత కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించి ఆ స్థానంలో ప్రత్యామ్నాయ రాజకీయ పక్షంగా ఎదగాలన్నది బిజెపి ఎత్తుగడ. పశ్చిమ్ బంగలో మమత ప్రభుత్వానికి, ఒడిశాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వానికి ప్రధాన పోటీదారుగా ఆవిర్భవించడం బిజెపి పెద్ద కష్టమైన పనేమీ కాకపోవచ్చు. ఒడిశాలో ఈసారి బిజెపి అవకాశాలు గణనీయంగా మెరుగు పడ్డాయి. ఈ రాష్ట్రంలో 2019లో జరిగే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మునుపటికన్నా బ్రహ్మాండమైన ఫలితాలు బిజెపికి దఖలుపడే అవకాశాలు కొట్టిపారేయలేనివి. ఒడిశాలోని మొత్తం 21 ఎంపీ సీట్లకుగాను గతంలో ఒక స్థానాన్ని మాత్రమే ఆ పార్టీ గెలుచుకుంది. అయితే అక్కడ ప్రజాక్షేత్రంలో 20శాతం ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరచింది. ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దాదాపు తుడిచిపెట్టి ఒడిశాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వానికి బిజెపి కీలక పోటీదారుగా ఎదిగింది. ఒడిశాలో ప్రభుత్వ వ్యతిరేకత అంతకంతకూ పెరుగుతుండటం, అధికార పార్టీలోని పెద్ద తలకాయలకు అవినీతి ఆరోపణలు చుట్టుకోవడం వంటివి బిజెపి అవకాశాలను మరింత మెరుగుపరచేవే! ఇక తమిళనాడులో జయలలిత మరణంతో రాజకీయాలు సంక్లిష్టంగా మారాయి. ఏఐఏడీఎంకే ఓటు బ్యాంకుకు భారీగా కోతపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ ఓట్లను ఎవరు చేజిక్కించుకుంటారన్నది ప్రశ్న. ఒకవేళ తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ రంగప్రవేశం చేస్తే ఈ ఓట్లన్నీ ఆయనవైపు మళ్లవచ్చు. అయితే ఆయన ఎటువైపు వెళ్తారన్నది ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్న. ఏది ఏమైనా డీఎంకే, ఏఐఏడీఎంకేలలో ఏదో ఒక పార్టీ వచ్చే ఎన్నికల్లో బిజెపితో జట్టు కట్టడం మాత్రం ఖాయం! పశ్చిమ్ బంగలోనూ తృణమూల్ కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయంగా బిజెపి ఎదుగుతోంది. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్–కమ్యూనిస్టుల మధ్య కుదిరిన పొత్తు అంతర్గత వైరుధ్యాలతో పెళుసుబారుతోంది. కేంద్రంలో మోదీ నాయకత్వంపై పోరాటానికి కమ్యూనిస్టులు, కాంగ్రెస్, మమతాబెనర్జీ ఒకేతాటిపైకి రావడంతో.. పశ్చిమ్ బంగలో బిజెపి పని బాగా సులువైంది. 2014నాటి ఎన్నికల్లో మొత్తం 42 ఎంపీ స్థానాలకుగాను బిజెపి ఇక్కడ కేవలం రెండు సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఈ సంఖ్య ఈసారి కచ్చితంగా పెరుగుతుందని మాత్రం చెప్పవచ్చు. మరోవంక దేశ ఈశాన్య ప్రాంతంలో పార్టీ బలోపేతానికి అమిత్ షా ఎడతెరిపి లేకుండా కృషి చేస్తున్నారు. ఈశాన్యంలోనూ బిజెపి గట్టి పోటీదారుగా ఆవిర్భవించి చెప్పుకోదగినన్ని ఎంపీ సీట్లు చేజిక్కించుకోవచ్చు! పేదలు, బడుగు వర్గాల సంక్షేమానికి కట్టుబాటు చాటుతూ అవినీతి రహిత పాలనను అందిస్తున్న ప్రధాని మోదీకి ప్రస్తుతానికి దేశంలో మరో ప్రత్యామ్నాయమే కనిపించడం లేదు! ■




# ధర్మరక్షకులకు శాపాలు వరాలవుతాయ్!

• రాంప్రసాద్

మోదీ ప్రభుత్వం ఏ పని తలపెట్టినా ఏదో విధంగా ప్రజల్లో దుష్ప్రచారం చేయాలనుకునే కొన్ని దుష్టశక్తుల, వ్యక్తుల విఫలయత్నాలను గత మూడేళ్ళుగా దేశ ప్రజలు గమనిస్తున్నారు. మోదీ వ్యతిరేక కోతులకు దొరికిన తాజా కొబ్బరి కాయ జంతు హింసా నిరోధక సవరణ చట్టం. ఈ సారి మోదీ వ్యతిరేక శక్తులు తమ క్రీడలో కోర్టులను కూడా పావుల్ని చేయాలని చూడ్డంతో కథ అడ్డం తిరగడమే కాక, మేధావులని, పేరుపడిన కొందరు వకీళ్ళ, పత్రికా రచయితల, రాజకీయ నాయకుల డొల్లతనం బట్టబయలవుతోంది.

కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఈ నియమాల రాజ్యాంగ బద్ధతను ధ్రువీకరిస్తూ, కేరళ హైకోర్టు 31 మే 2017న చేసిన వ్యాఖ్యలు మోదీ వ్యతిరేకులైన మెదళ్ళు కుళ్ళిన, వయస్సు మళ్ళిన దుర్వాఖ్యాతలకు చెంపపెట్టు. "ఈ నియమాలు గొడ్డు మాంసాన్ని నిషేధించలేదని, యదార్థంగా ఈ నియమాలను పూర్తిగా చదవకుండానే ప్రజలు స్పందిస్తున్నట్లుంది." అని చెబుతూ, దీనిపై వచ్చిన అభ్యర్థనను కేరళ హైకోర్టు రద్దు చేసింది.

"జంతుహింసా నిరోధక చట్టానికి సవరణ పేరుతో సమాజ విభజన ప్రయత్నం జరుగుతోందన్న దుర్వ్యాఖ్య జోడించి, చైతన్య భారతం తక్షణం మేల్కొనాలి" అంటాడు తెలుగు నాట వివిధ పత్రికలకు సంపాదక బాధ్యతలు నిర్వహించి పత్రికా రచయితగా కొనసాగుతున్న ఓ వయస్సు మళ్ళిన పెద్దమనిషి. ఈ నోటిఫికేషన్ ఫెడరల్ వ్యవస్థని దెబ్బ తీస్తుంది కనుక దీన్ని మేం అమలు చేయమని ఒక ముఖ్యమంత్రి అన్నారు. ఇంకో ముఖ్యమంత్రి అయితే తామే మిగిలిన ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ నోటిఫికేషన్ని వ్యతిరేకిస్తాం అన్నారు. మరో ముఖ్యమంత్రి ఇది కేంద్ర నోటిఫికేషన్, దీన్ని అమలు చేయకండి అని మాంస వ్యాపారులకు పత్రికా ముఖంగా పిలుపునిచ్చారు. అవు, దూడను ఎన్నికల గుర్తుగా వాడుకున్న పార్టీ కార్యకర్తలు బీఫ్ ఫెస్టివల్ పెట్టి ఒక దూడనే క్రూరంగా, అన్యాయంగా, చట్ట విరుద్ధంగా చంపి బహిరంగ విందు చేసుకున్నారు.

మోదీ వ్యతిరేకులంతా చేసే కాకిగోలలో



ప్రస్తావించే గొడ్డుమాంసం నిషేధం కాని, పశువధ నిషేధం గాని కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్లో లేనే లేవు. కేవలం జంతు క్రూరత్వాన్ని, అక్రమ రవాణాను నివారించడమే లక్ష్యంగా ఈ నోటిఫికేషన్ జారీ చేశారు. దీన్ని కొన్ని వర్గాల ఆహార అలవాట్ల మీద దండయాత్రగా పాఠకులను నమ్మించడానికి ఈ కుహనా మేధావులు చేసిన ప్రయత్నంలో పదో వంతు ఈ జంతు క్రూరత్వ చరిత్ర, దాని నివారణకోసం జరిగిన ప్రయత్నాల గురించి తెలుసుకోవాలని ప్రయత్నించినట్లు లేదు.

నేపాలి హిందువులు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి గథిమా పండుగ జరుపుతారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పండుగ ఆచారాలలో భాగంగా లక్షలాది పశువులను బలి ఇస్తారు. 2014లో జరిగిన పండుగలో దాదాపు 2.5 లక్షల పశువులను బలి ఇచ్చారని అంచనా. వీటిల్లో సుమారు 80 శాతం భారతదేశం నుంచి అక్రమ రవాణా అయ్యాయని, అక్రమ ధనం భారతదేశంలోకి వస్తోందని తెలుస్తోంది. ఇలా జరుగుతున్న పశువుల అక్రమ రవాణాను నిరోధించమని కోరుతూ గౌరి మలేఖ అనే జంతు సంక్షేమ కార్యకర్త సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసారు. 881/2014 నంబరుతో 2014లో దాఖలైన ఈ వ్యాజ్యంపై విచారణ 2014, అక్టోబర్14న మొదలైంది. హోం మంత్రిత్వశాఖకు చెందిన పార్లమెంటరీ కమిటీ 203 సంఖ్య గల నివేదికలో పశువుల అక్రమ రవాణా గురించి చర్చించింది. మాజీ హోం, ఆర్థికశాఖ మంత్రి చిదంబరం ఈ కమిటీ చైర్మన్. నివేదికలో పేర్కొన్న గణాంకాల ప్రకారం ప్రతి ఏటా లక్షలాది పశువులను సరిహద్దు భద్రతా దళం స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపింది.

కమిటీ నివేదిక పేరా 2.6.9 లో ఈ విధంగా సిఫారసు చేసింది. 'అన్ని రాష్ట్రాల నుండి పశ్చిమ బెంగాల్, అస్సాం వైపు పశువుల సామూహిక గమనం జరుగుతున్నదని కమిటీ అంగీకరిస్తోంది. సరిహద్దు రాష్ట్రాల వైపుగా జరుగుతున్న పశువుల గమనాన్ని ఆపడంలో వివిధ రాష్ట్రాల పోలీసు దళాలు విఫలమయ్యాయని, పశువుల కదలికలను అడ్డుకోవడంలోను లేదా ఆపడంలోను పశ్చిమ బెంగాల్ పోలీసులు విఫలమయ్యారని, కమిటీ భావిస్తోంది. లోతుగా పాతుకుపోయిన దుష్ట సంబంధాలే ఈ సమస్య విస్తరించడానికి కారణమని, దీనిని పూర్తిగా నివారించేందుకు ప్రభుత్వం ఈ మూలాలపై దెబ్బతీయాలని కమిటీ భావిస్తోంది'. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిషా, త్రిపుర, రాష్ట్ర ప్రభుత్వాలను కక్షిదారులుగా చేర్చింది.

ఈ వ్యాజ్యంపై విచారణ 14 సార్లు జరిగింది. 2016 జూన్ 12న గౌరవ సుప్రీంకోర్టు తుది ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వుల ప్రకారం జంతువుల పట్ల క్రూరత్వ నివారణ చట్టం కింద నిబంధనలను మూడు నెలలలోపు ప్రకటించాలని భారత ప్రభుత్వ పర్యావరణం, అడవుల మంత్రిత్వశాఖను కోరింది. తదనుగుణంగా 16 జనవరి 2017న పర్యావరణం, అడవుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నిబంధనలను విడుదల చేసి ప్రజల నుండి అభ్యంతరాలను, సలహాలను ఆహ్వానించింది. ఈనోటిఫికేషన్ ముసాయిదా రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా పంపారు. ఆ



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. - గాంధీ

వర్తమానం

# 813 కోట్ల పని దినాలు

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి సడక్ యోజన వంటి కార్యక్రమాల వల్ల గత మూడేళ్ల కాలంలో దేశంలో 813 కోట్ల పని దినాలు కల్పించగలిగామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలియజేశారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను నరేంద్ర సింగ్ తోమర్ విలేకరుల సమావేశంలో వివరించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 636.78 కోట్ల పని దినాలు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 78 కోట్ల పని దినాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 99 కోట్ల పని దినాలు కల్పించినట్టు ఆయన చెప్పారు. దీనికి తోడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన కింద 86,120 మందికి 2014-15లో శిక్షణ ఇప్పించామని తోమర్ చెప్పారు. వీరిలో 54, 196 మందికి ఉద్యోగాలు వచ్చాయి. శిక్షణ ఇప్పించిన తర్వాత 2015-16లో 1,35,000 మందికి ఉపాధి లభించింది. 2016-17లో 84,900 మందికి ఉపాధి లభించింది. ప్రస్తుత సంవత్సరంలో గ్రామీణాభివ ృద్ధి శాఖ అయిదు లక్షల మందికి శిక్షణ ఇప్పిస్తుందని దీనిలో 70 శాతం మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ 2016-17లో నాలుగు లక్షల మందికి శిక్షణ ఇప్పించింది.

2016-17లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1.23 కోట్ల మేర ఆస్తులు ఏర్పాటు చేశారు. 96 శాతం ఎలక్ట్రానిక్ పద్ధతిలో డబ్బు చెల్లించినట్టు తోమర్ తెలియజేశారు. 8.73 కోట్ల శ్రామికులు ఆధార్‌తో అనుసంధానం అయ్యారు. వీరిలో వారి సమ్మతితో 4.73 కోట్ల మందికి ఆధార్ ఆధారంగా డబ్బు చెల్లిస్తున్నారు. 2016-17లో జాబ్ కార్డుల పరిశీలనకు ప్రాధాన్యం ఇచ్చారు. 2022 నాటికి అందరికీ గృహవసతి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం అని 2019 నాటికి గ్రామీణ ప్రాంతాలలో కోటి మందికి గృహ వసతి కల్పిస్తామని చెప్పారు. 2014-15, 2015-16లో 34.14 లక్షల ఇళ్లు నిర్మించినట్టు తోమర్ తెలియజేశారు. ఇంతకు ముందు ఇందిరా ఆవాస్ యోజన కింద 45.98 లక్షల ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. 2016-17లో రూ.16,074 కోట్ల ఖర్చుతో 32.14 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. రోజుకు 130 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నట్టు తోమర్ తెలియజేశారు. దీని వల్ల సగటున రోజుకు 32 ఆవాసాలకు రోడ్డు సదుపాయం కల్పించగలుగుతున్నారు. ఏడేళ్ల కాలంలో ఇంతటి అభివృద్ధి ఎన్నడూ జరగలేదు.

వామపక్ష తీవ్రవాద సమస్య ఉన్న 9 రాష్ట్రాలలోని ఈ ప్రభావం చాలా ఎక్కువగా ఉన్న 44 జిల్లాలలో 2016-17లో రూ.11,725 కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణం మొదలైందని తోమర్ చెప్పారు. ఈ కార్యక్రమం 2020 మార్చి నాటికి పూర్తి అవుతుందని అన్నారు. ఐక్య రాజ్య సమితి నిలకడైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ మంచి నీళ్ల సరఫరా లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని, దీనికోసం రూ.23,000 కోట్లు కేటాయించామని తోమర్ తెలియజేశారు. 2030 నాటికి ఈ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. 2021 నాటికి భూగర్భ జలాల్లో పాషాణం, ఫ్లోరైడ్ వంటి విషపదార్థాలు ఉన్న 28,000 జనావాసాలకు మంచి నీరు అందించడానికి రూ.25,000 కోట్లు కేటాయించినట్టు తోమర్ చెప్పారు. 2014లో 42 శాతం ప్రాంతానికి మురికినీటి పారుదల సదుపాయం ఉంటే ఈ సంవత్సరం అది 64 శాతానికి పెరిగిందని తోమర్ అన్నారు. నాలుగు కోట్ల మరుగుదొడ్లు నిర్మించినట్టు ఆయన తెలియజేశారు. ఈ విషయంలో రాష్ట్రాల పట్ల ఎలాంటి వివక్షా ఉండదని చెప్పారు. గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు అయిదేళ్ల కాలంలో గ్రామపంచాయితీలకు రూ.2 లక్షల కోట్లు విడుదల చేస్తున్నామని అన్నారు. 13వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు దీని కోసం రూ.30,000 కోట్లు ఖర్చు చేశారని తోమర్ చెప్పారు. ఇంతవరకు పంచాయతీలకు రూ.51,234 కోట్లు కేటాయించామని, 44 లక్షల మంది పంచాయతీ కార్యకర్తలకు శిక్షణ ఇప్పించామని తోమర్ తెలియజేశారు.

–జనసందేశ్ ప్రతినిధి

తరువాత 2017 మే23న కేంద్ర ప్రభుత్వం నూతన నిబంధనలను ప్రకటించింది.

భారత ప్రభుత్వ పర్యావరణం, అడవుల మంత్రిత్వశాఖ 2017 మే23న అన్ని రాష్ట్రాలలోను జంతువుల మార్కెట్లను క్రమబద్ధీకరించడానికి కొత్త నిబంధనలను ప్రకటించింది. క్రూరత్వ నివారణ చట్టం కింద ప్రకటించిన ఈ నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు...

1. జిల్లా జంతువుల మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేయాలి.

2. పశు వైద్యసేవలు, ఆశ్రయం, నీరు, పశుగ్రాసం వంటి అన్ని రకాల సౌకర్యాలను నిర్వహించాలి.

ఈ నిబంధనలు ఆవులు, దూడలు, గేదెలు, ఒంటెలు, కోళ్ళు వంటి వాటికి వర్తిస్తాయి. కాని గొర్రెలకు, మేకలకు కాదు.

జంతువుల మార్కెట్‌లు రైతుల కొరకు ఉద్దేశించినవి కనుక, అక్కడ వ్యవసాయేతర అవసరాలకు జంతువులను కొనాలనే వారుగాని, అమ్మాలనుకొనే వారుగాని, వధశాలల ప్రతినిధులు గాని, వ్యవహారాలు జరుపకూడదు. వధించడం కోసం జరిగే జంతువుల క్రయ, విక్రయాలు ఈ మార్కెట్‌ల వెలుపలే జరగాలి.

సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేసే క్రమంలోనే మోదీ ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. ధర్మాన్ని అనుసరించేవారికి శాపాలు కూడా వరాలుగా ఉపకరిస్తాయని, వారి పట్ల ఇతరులు తలపెట్టిన కీడు కూడా మేలుగా పరిణమిస్తుందన్న సూక్తి సత్యమని మరోమారు నిరూపితమవుతోంది. కుంటి వ్యతిరేకులు, గుడ్డి మేధావులు మోదీ ప్రభుత్వ నిర్ణయంపై నానా యాగీ చేయకపోయినా, కోర్టుల దాకా ఈడ్చకపోయినా మోదీ ప్రభుత్వం తలపెట్టిన సత్కార్యం గురించి, వ్యతిరేకుల డొల్లతనం గురించి మరొక్కసారి దేశ ప్రజలకు తెలిసేది కాదు. ధర్మో రక్షతి రక్షితః■

వర్తమానం

# కశ్మీర్ లోయలో వేర్పాటువాదంపై ఉక్కు పిడికిలి

● సుధా కస్తూరి

గత మార్చి నెలలో జాతీయ దర్యాప్తు సంస్థ చక్కన్ దా బాగ్ వద్ద సరిహద్దు నియంత్రణ రేఖ సమీపంలో దాడులు నిర్వహించింది. చక్కన్ దా బాగ్ నుంచి మన దేశానికి, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్‌కి మధ్య సరకు రవాణా నడుస్తూ ఉంటుంది. ఈ దాడుల గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. పెద్దగా వార్తల్లోనూ రాలేదు. కానీ కొద్ది రోజులకే జమ్మూ, శ్రీనగర్, హర్యాణా, ఢిల్లీ తదితర ప్రదేశాల్లో ఎన్ఐఏ దాడులు జరిపింది. ఒక వారం పది రోజుల కింద మరింత పెద్ద ఎత్తున దాడులు జరిగాయి. ఈ సారి మీడియా కూడా ఒక్కసారిగా నిటారున కూర్చుంది. భారీ మొత్తంలో డబ్బులు, ఆయుధాలు, దొరికాయి.

నియంత్రణ రేఖకు అటూ ఇటూ జరుగుతున్న సరకు రవాణాను ఉపయోగించుకుని ఉగ్రవాదులకు నిధులు, ఆయుధాలు పంపుతున్న పాక్, వేర్పాటువాద కుట్ర భళ్లుమంటూ బయటపడింది. ఈ నిధులన్నీ వేర్పాటువాద నేతాగణానికి అందుతున్నాయి. ఒకవైపు భారత ప్రభుత్వంతో చర్చలు జరుపుతామంటూ, మరొక వైపు పాకిస్థాన్‌తో దోస్తీ చేస్తూ, రాళ్లు విసిరే మూకల నుంచి ఏకే 47 బ్యాచిల వరకూ మెయింటెయిన్ చేస్తున్న ఈ వేర్పాటువాద పెద్దలకు హవాలా రూట్లో లూటీ ధనం వస్తోంది. ఆ ధనంతోనే రాళ్లు విసిరేవాళ్లకు దినసరి భత్యాలు అందుతున్నాయి.

నిజానికి మార్చి నెలలో ఉగ్రవాద సంస్థ హిజ్బుల్ ముజాహిదీన్‌కి క్రాస్ బార్డర్ వాణిజ్య పెద్దలకు లింకులున్నాయన్నది వెలుగులోకి వచ్చింది. ఈ నిధులు హిజ్బుల్ మద్దతుదారుల ఖాతాల్లోకి వెళ్తున్నాయన్నది బయటపడింది. ఈ డబ్బుతోటే బుర్హన్ వానీ ఎన్‌కౌంటర్ తరువాత అల్లర్లను జరిపించారు. కాలిఫోర్నియా బాదామ్ అమ్మకాలు, కొనుగోళ్ల ద్వారా ఇదంతా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్ఐఏ ఈ వ్యాపారపు రికార్డులన్నిటినీ స్వాధీనం చేసుకుని అధ్యయనం చేసింది. మార్చి నెలలోనే ఇర్షాద్ అహ్మద్ మట్టూ అనే ట్రక్కు డ్రైవర్‌ను అరెస్టు చేశారు. అతనిని ప్రశ్నించినప్పుడు ఈ ఉగ్రవాద వ్యాపార లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. దీనిలో ఢిల్లీ, జమ్మూ, శ్రీనగర్‌లలోని పలువురు వ్యాపారులు తల దాకా మునిగి ఉన్నారన్నది బయటకి వచ్చింది. ఎన్ఐఏ ఆ ఖాతాలన్నిటినీ ఫ్రీజ్ చేసింది. జమ్మూలో ఉన్న ఒక డ్రైఫ్రూట్స్ వ్యాపారి, శ్రీనగర్‌లోని ఒక హోమియో వైద్యుడు ఈ మొత్తం లావాదేవీలకు కీలకమని వెల్లడైంది. ఈ హోమియో డాక్టర్ లింక్ జూన్ 4న బయటపడింది. తమాషా ఏమిటంటే ఈ ఇద్దరూ ఏనాడూ ఉగ్రవాద శక్తులు, వేర్పాటువాద హురియత్ నేతలతో కలిసి పనిచేయలేదు. వీరు న్యూట్రల్‌గానే కనిపించారు. వ్యాపారం తప్ప మరేమీ చేసినట్టు ఎలాంటి రుజువులూ లేవు.

> **మార్చి నెలలో ఉగ్రవాద సంస్థ హిజ్బుల్ ముజాహిదీన్‌కి క్రాస్ బార్డర్ వాణిజ్య పెద్దలకు లింకులున్నాయన్నది వెలుగులోకి వచ్చింది. ఈ నిధులు హిజ్బుల్ మద్దతుదారుల ఖాతాల్లోకి వెళ్తున్నాయన్నది బయటపడింది. ఈ డబ్బుతోటే బుర్హన్ వానీ ఎన్‌కౌంటర్ తరువాత అల్లర్లను జరిపించారు. కాలిఫోర్నియా బాదామ్ అమ్మకాలు, కొనుగోళ్ల ద్వారా ఇదంతా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్ఐఏ ఈ వ్యాపారపు రికార్డులన్నిటినీ స్వాధీనం చేసుకుని అధ్యయనం చేసింది.**

కానీ లోలోపల వారు పాక్ అనుకూల శక్తులకు కొరియర్లుగా పనిచేస్తున్నారు.


ఇప్పుడు వీరందరికీ హురియత్ (జీ) వర్గం చైర్మన్ సయ్యద్ అలీషా జిలానీ, జమ్మూ కశ్మీర్ నేషనల్ ఫ్రంట్ చైర్మన్ నయీమ్ ఖాన్, జెకెఎల్ఎఫ్ నేత ఫరూఖ్ అహ్మద్ దార్ అలియాస్ బిట్టా కరాటే, తహరీకె హురియత్ నేత గాజీ జావేద్ బాబా, లష్కరె తోయబా నేత హాఫిజ్ సయీద్‌లతో సన్నిహిత సంబంధాలున్నాయి. భారత పాకిస్థాన్ల మధ్య విశ్వాస నిర్మాణ చర్యల్లో భాగంగా ఇరు దేశాల మధ్య ఆరు కేంద్రాల ద్వారా వ్యాపార, వాణిజ్యాలు, సరకు లావాదేవీలు జరుగుతాయి. వీటిలో సలామాబాద్, ఉడి, చక్కన్ దా బాగ్‌లలో ట్రేడ్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. ఈ కేంద్రాలను ఉపయోగించుకుని ఉగ్రవాద, వేర్పాటువాద శక్తులు తమ పనిని ఇన్నాళ్లూ నిరాఘాటంగా కొనసాగించాయి. అయితే ఎన్ఐఏ జూన్ 3న నయీమ్ అహ్మద్ ఖాన్, బిట్టా కరాటే, జావేద్ అహ్మద్ బాబా అలియాస్ ఘాజీ, ప్రముఖ వ్యాపారులు జహూర్ అహ్మద్ వాతా, నాజిర్ మీర్, ఫారూఖ్ అహ్మద్ వానీ, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు షంషాబాద్ బేమినా, రాజా జహూర్, మహ్మద్ సుల్తాన్ చాదిను, బషీర్ అహ్మద్ బట్, అజాజ్ అహ్మద్ భట్, వేర్పాటువాద నేత ఫారూఖ్ అహ్మద్ సోదరుడు మొదలైన వారిపై దాడులు చేయడంతో కుట్ర బయటపడింది.

ఇన్నాళ్లూ వీరు చాలా సింపుల్ పద్ధతిలో లావాదేవీలు చేశారు. క్రాస్ బార్డర్ వాణిజ్యం వస్తు వినిమయ పద్ధతిలోనే నడుస్తుంది. అంటే మనవారు వస్తువులను అక్కడకి పంపుతారు. అటు నుంచి వస్తువులు వీరికి వస్తాయి. వీటిని అమ్ముకుని ఇక్కడ వీరు సొమ్ము చేసుకుంటారు. కానీ అక్కడకు పంపే వస్తువుల ధరలు మామూలు కన్నా చాలా ఎక్కువగా కోట్ చేస్తారు. పాక్ నుంచి వచ్చే వస్తువులు చాలా తక్కువ ధరలకు వస్తాయి. ఇక్కడ వాటి ధర చాలా ఎక్కువ. ఈ విధంగా అమ్ముకుని వచ్చిన లాభాన్ని ఉగ్రవాద ముఠాలకు బదలాయిస్తున్నారు.

ఒక్కసారిగా కేంద్ర ప్రభుత్వం ఈ దాడులను నిర్వహించి, కుట్రను రట్టు చేయడంతో ఇప్పుడు జిలానీ ప్రభృతులు కంగారు పడుతున్నారు. జూన్ 4న జిలానీ, మీర్ వాయిజ్ ఫారూఖ్ తదితరులు ఈ దాడులకు వ్యతిరేకంగా పరుగుపరుగున ప్రకటనలు ఇచ్చారు. వీటిని ఆపాలని విజ్ఞప్తులు చేశారు. తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ఉగ్రవాద, వేర్పాటువాద ఉద్యమాలకు ఊతమిచ్చే నిధుల రాకపైనే కేంద్రం దాడి చేయడంతో వీరికి ఉక్కిరిబిక్కిరి అవుతోంది. వీరి వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోంది. కేంద్రం తీసుకుంటున్న ఈ చర్యలు వారికి ఊపిరాడకుండా చేస్తున్నాయి. ■



ఈ భూమ్మీద జన్మచేత ఎవరూ అధికులు కారు. బహిరింద్రియ నిగ్రహం కలవారే ఇతరులకన్నా అధికులు, ఉత్తములు. – శ్రీ జ్యోతిరావు ఫూలే




# ఆధిపత్య పోరులో కులభూషణ్ బలి

• బల్బీర్ కె.పుంజ్

పాకిస్థాన్‌లో ప్రధానమంత్రికి, సైన్యానికి, ముల్లాలకు మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరులో కులభూషణ్ జాదవ్ బలియ్యారు. ఈ మూడు అధికార కేంద్రాలు తమ ఆధిపత్యాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేకపోవడం కులభూషణ్ ప్రాణానికి ముప్పుగా పరిణమించింది. సౌదీ అరేబియాలో ఇటీవల జరిగిన ఇస్లామిక్ రాజ్యాల శిఖరాగ్ర సమావేశంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి పాల్గొన్నారు. పాకిస్థాన్‌లో తీవ్రవాదులకు ప్రభుత్వ అండ ఉంది అన్న విషయం విస్మరించకూడదు. ఈ తీవ్రవాదులు భారత్‌లోనూ, ఇతర చోట్ల విధ్వంసానికి పాల్పడుతుంటారు. ముఖ్యంగా అఫ్ఘానిస్థాన్‌లో ఈ తీవ్రవాదుల కార్యకలాపాలు ఎక్కువ.

తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణపై భారత్‌లో 79 మంది నిర్బంధంలో ఉన్నారని, పాకిస్థాన్‌లో అలాంటి కార్య కలాపాలకు పాల్పడి నిర్బంధంలో ఉన్న వారు ఒక్కరు కూడా లేరని హుసేన్ హక్కానీ ఇటీవల ఒక ఇంగ్లీషు పత్రికలో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. 2015 డిసెంబర్‌లో హిందుస్థాన్ పత్రిక కూడా ఈ విషయమే రాసింది. తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన భారతీయులు, గూఢచార కార్యకలాపాలకు పాల్పడిన భారతీయులు ఒక్కరు కూడా తమ దేశంలో నిర్బంధంలో లేరన్న లోటు తీర్చడానికే పాకిస్థాన్ కులభూషణ్ మీద కత్తిగట్టిందా? కులభూషణ్‌ను అరెస్టు చేసి భారత్ తీవ్రవాదాన్ని, ముఖ్యంగా బలూచిస్థాన్‌లో ప్రోత్సహిస్తోందని నిరూపించడానికే పాకిస్థాన్ ఈ పని చేసిందని హక్కానీ తన వ్యాసంలో పేర్కొన్నారు. కులభూషణ్ ఉదంతం వెలుగులోకి వచ్చిన తర్వాత భారత పాకిస్థాన్ దేశాల మధ్య సంబంధాలు మరింత బెడిసికొట్టాయని హక్కానీ తెలియజేశారు.

హక్కానీ కేవలం పత్రికలలో వ్యాసాలు రాసే రచయితనే కాదు, ఒకప్పుడు అమెరికాలో పాక్ రాయబారిగా పని చేశారు. వాషింగ్టన్‌లోని హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆయన పరిశోధకులు కూడా. అందువల్ల పాకిస్థాన్ రాజకీయ నాయకుల గురించి ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. 2016లో వెలువడ్డ హక్కానీ గ్రంథం "ఇండియా వర్సెస్ పాకిస్థాన్: వై కాంట్ వి జస్ట్ బి ఫ్రెండ్స్?'' లో రెండు దేశాల మధ్య సంబంధాలను లోతుగా చర్చించారు.

అంతకుముందు ఆయన రాసిన "పాకిస్థాన్: బిట్వీన్ మాస్క్ అండ్ మిలిటరీ" గ్రంథంలో పాకిస్థాన్‌లో అధికార కేంద్రాల గుట్టు విప్పారు. హిందువులు అధిక సంఖ్యాకులుగా ఉన్న అత్యంత ప్రాచీనమైన దేశంలో ముస్లింలు సురక్షితంగా ఉండరన్న అభిప్రాయంతో ఏర్పడిన పాకిస్థాన్‌లో ఒక వర్గానికి చెందిన ముస్లింల ప్రార్థనా స్థలాల మీద మరో వర్గం వారు బాంబుదాడులు చేస్తున్నారని అన్నారు. మరి కొన్ని మతవర్గాలను ముస్లింలు కారని ప్రకటించారు. హక్కానీ బయట పెట్టిన అంశాలను బట్టి చూస్తే భారత్ కులభూషణ్ వ్యవహారాన్ని అంతర్జాతీయ న్యాయస్థానానికి తీసుకెళ్లడంతో కథ కొత్త మలుపు తిరిగింది. హేగ్‌లో ఉన్న అంతర్జాతీయ కోర్టులో వాదించడానికి కొత్త వారిని నియమించుకోవాల్సి వచ్చింది. అంతర్జాతీయ కోర్టుకు లాగడం ఒక ఇస్లామిక్ దేశానికి గతంలో లేని అనుభవం.

అంతర్జాతీయ కోర్టుకు వెళ్లిన వ్యవహారాన్ని పాక్ ప్రధాని ఇష్టం లేకపోయినా మోయక తప్పలేదు. ఒకవేళ జాదవ్‌కు మరణ శిక్ష అమలు చేయడం జాప్యం అయితే ప్రభుత్వం అసమర్థంగా వ్యవహరించిందని సైన్యం దుమ్మెత్తిపోయడానికి ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పు ఎలా ఉన్నా మరణశిక్ష గనక అమలు చేస్తే ఆ పరిణామాలను ఎదుర్కోవాల్సింది మళ్లీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫే. అంతర్జాతీయ అభిప్రాయాన్ని ఖాతరు చేయలేదన్న నింద మోయాల్సి వస్తుంది. దీని వల్ల ప్రపంచం దృష్టిలో పాకిస్థాన్ మరింత ఒంటరి అవుతుంది.

గత కొన్ని నెలలుగా పాకిస్థాన్ ప్రపంచ దేశాల సానుభూతి సంపాదించాలని ప్రయత్నిస్తోంది. కాని ఫలితం దక్కడం లేదు. పాకిస్థాన్‌ను తీవ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంగానే పరిగణిస్తున్నారు. భారత్ తీవ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తోందనడానికి జాదవ్ ఉదంతమే నిదర్శనమని పాకిస్థాన్ న్యాయవాదులు అంతర్జాతీయ న్యాయస్థానంలో అరిచి గీ పెట్టినా పాకిస్థాన్ అండ ఉన్న లష్కర్–ఎ–తయ్యబా, జైష్–ఎ–మహమ్మద్ వ్యవహారాలు తెలిసిన వారెవరూ భారత్ తీవ్రవాదాన్ని పొరత్సహిస్తోందన్న ప్రచారాన్ని నమ్మరు. అందువల్ల ''గూఢచర్యం'' వ్యవహారం అంతర్జాతీయ కోర్టు పరిధిలోకి రాదని వాదించడానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఒక వేళ జాధవ్‌ను ఏమైనా చేసుకోని అని అంతర్జాతీయ న్యాయస్థానం వదిలేసినా ప్రపంచం దానికి అంగీకరించే పరిస్థితి లేదు.

జాదవ్‌కు మరణ శిక్ష అమలు చేస్తామని పాకిస్థాన్ చెప్తే యుద్ధ వాతావరణం ఏర్పడక తప్పదు. పాకిస్థాన్ ప్రభుత్వం అన్ని వైపుల నుంచి ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతర్జాతీయ సమాజం భారత్ పాకిస్థాన్ మధ్య అణుయుద్ధాన్ని ప్రేరేపించినట్టు అవుతుంది. గల్ఫ్‌లోని ఇస్లామిక్ దేశాల ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. అమెరికా గల్ఫ్ చమురు అవసరం లేని స్థితిలో ఉంది. అప్పుడు పాకిస్థాన్ మరింత ఇరకాటంలో పడక తప్పదు. భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టాలన్న చూస్తున్న పశ్చిమ దేశాలు కూడా ఈ పరిస్థితిని అంగీకరించవు.

ఇలాంటి స్థితిలో పాకిస్థాన్ ప్రభుత్వం అన్ని వైపుల నుంచి ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తే తొమ్మిదో సారి సైన్యం అధికారం చేపట్టే ముప్పు పొంచి ఉంటుంది. హక్కానీ వ్యాసంలో ఈ సూచనే చేశారు. "భారత్ శాశ్వతంగా పాకిస్థాన్‌కు శత్రు దేశంగానే ఉంటుందన్న అభిప్రాయాన్ని పాకిస్థాన్ కలగచేస్తోంది. అప్పుడు ప్రధాని నవాజ్ షరీఫ్ కొత్త ఎత్తులు ఎత్తడానికి కూడా అవకాశం ఉండదు" అని హక్కానీ రాశారు. ప్రసిద్ధులైన దౌత్యవేత్తలు కూడా హక్కానీ అంచనాతో ఏకీభవిస్తారు. పాకిస్థాన్ ఇప్పటి వరకు భారత్ మీద ద్వేష భావంతోనే వ్యవహరిస్తోంది.

గతంలో కూడా షరీఫ్ సైన్యం పన్నిన ఉచ్చులో చిక్కుకున్నారు. దాని ఫలితమే కార్గిల్ దుస్సాహసం. సుదీర్ఘకాలంగా పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తున్న అమెరికా, చైనా మొదలైన దేశాల మద్దతు సంపాదించడానికి షరీఫ్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. యాదృచ్ఛికంగా అప్పుడు కూడా భారత్‌లో బిజెపి ప్రభుత్వమే ఉంది. అప్పటి అమెరికా అధ్యక్షుడు తమను కాపాడతారన్న షరీఫ్ ఆశ కూడా ఫలించలేదు. అమెరికా అధ్యక్షుడు విజ్ఞప్తి చేసినా అప్పటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజపేయి లొంగ లేదు. షరీఫ్ తలుపు తట్టినా చైనా కూడా చలించలేదు. ఈ సారి షరీఫ్ మరింత గడ్డు స్థితిలో ఉన్నారు. భారత్‌లో గట్టి ప్రభుత్వం ఉంది. అంతకన్నా బలమైన సంకల్పం ఉన్న వ్యక్తి ప్రధానిగా ఉన్నారు. కులభూషణ్ జాదవ్ వ్యవహారం పాకిస్థాన్‌లో పౌర ప్రభుత్వం మనుగడకే ముప్పు తెచ్చేలా ఉంది. ■

ఒక రాజ్యంలో నివసించే ప్రజల భాషను తెలుసుకోకుండా, ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడం సాధ్యం కాదు. – బార్కం




# వ్యవసాయాభివృద్ధిపై స్పష్టత లోపించిన కేసీఆర్

• కృష్ణ చైతన్య

గత మూడేళ్ళుగా తెలంగాణలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వంక ప్రకృతి వైపరీత్యాలు వారిని ఇబ్బంది పెడుతూ ఉంటే, మరో వంక ఆపదలో అందుబాటులోకి రాలేని ప్రభుత్వ యంత్రాంగం వారి జీవితాలను వ్యధాభరితం చేస్తున్నది. ఏ సమస్య ముందుకొచ్చినా వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అంటూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అందమైన కలలు ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆపదలో ఉన్న రైతులను పట్టించుకోవడం లేదు. కేవలం గిట్టుబాటు ధర అడిగిన రైతులను ఖమ్మంలో జైలుపాలు చేసి, బేడీలు వేయించిన ఈ ప్రభుత్వ ఘనకార్యం చూసాము. కనీసం ఆ రైతులకు క్షమాపణ చెప్పడం గాని, వారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవడం గాని చేయడం లేదు.

టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక నిరాటంకంగా రైతు ఆత్మహత్యలు కొనసాగుతున్నా కనీసం వారి కుటుంబాలకు సానుభూతి చూపే ప్రయత్నం కూడా ఈ ప్రభుత్వం చేయలేకపోతున్నది. మార్కెట్‌యార్డ్‌లకు తమ ఉత్పత్తులు తీసుకువచ్చి, రోజుల తరబడి వాటిని అమ్మడానికి వేచి ఉంటూ సొమ్మసిల్లి చనిపోయినవారిని కూడా పరామర్శించే తీరిక వీరికి లేకుండా పోయింది.

రైతులకు పండించిన పంటకు మంచి ధర రావడానికి వినూత్న పద్ధతులు అవలంబించాలని పిలుపు నిచ్చిన ముఖ్యమంత్రికి ఆయన మాటలు నమ్మి మిరపపంటను ఎక్కువగా పండించి, ధరలు పడిపోతే దిగాలు పడి వీధికెక్కిన రైతులను ఆదుకోవడానికి ఈ ప్రభుత్వం చేతలలో ఎటువంటి సహాయం చేయలేక పోవడం గుర్తుకు రాదా? పొరుగు రాష్ట్రాలు కేంద్రం ఇవ్వజూపిన మొత్తానికి మరికొంత జతచేసి మిరపను కొనుగోలు చేసే ప్రయత్నం చేయగా, తెలంగాణ ప్రభుత్వం మాత్రం మాటలతో కాలం వెలిబుచ్చింది.

వ్యవసాయ ప్రణాళికను వర్షాలు వచ్చే ముందే విడుదల చేసి, రైతులకు సహాయంగా ఉండేవిధంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సమాయత్తం చేసే ప్రయత్నం కూడా ఈ ప్రభుత్వం చేయలేక పోయింది. వ్యవసాయ రుణ ప్రణాళికను ఖరారు చేయడం కోసమైనా సకాలంలో బ్యాంకర్లతో సమావేశం జరపలేక పోయారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కల్తీని అరికట్టడం తదితర అంశాలపై మాటలకు పరిమితం కావడం మినహా ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకొనే ప్రయత్నం చేయడం లేదు.

ప్రతి గ్రామంలో రైతులు తమ భూములను క్రాప్ కాలనీలుగా మార్చుకోవాలని, ఊర్లల్లో వేసుకున్న కూరగాయాలనే గ్రామస్థులు తినాలంటూ వినూత్న ఆలోచనలు చెప్పడమే గాని అందుకు నిర్దిష్టమైన ప్రణాళికలను ప్రజల ముందు ఉంచడం లేదు. కనీసం మంత్రివర్గ సహచరులతో, ప్రజాప్రతినిధులతో అయినా రైతుల పరిస్థితులపై సమాలోచనలు జరిపినట్లు లేదు. కనీసం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి తన ఆలోచనలను వారి ముందుంచే ప్రయత్నం చేయడం లేదు.

**ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా భూములు, రైతుల సర్వే జరుగుతున్నదని అంటున్నారు. ఇప్పటి వరకు అటువంటి వివరాలు ప్రభుత్వం వద్ద లేవా? గతంలో జరిపిన సమగ్ర సర్వే వివరాలు ఏమయ్యాయి? రైతులకు జారీ చేసిన పట్టాదార్ పాస్ పుస్తకాల వివరాలు లేవా? వ్యవసాయ శాఖ వద్ద గ్రామాల వారీ పంటల వివరాలు లేవా? లేని పక్షంలో వ్యవసాయ ప్రణాళికలను ఏ ప్రాదిపదికన రూపొందిస్తున్నారు?**

రైతు సమాఖ్యలను ఏర్పాటు చేసి, అవే పంటలకు ధరలు నిర్ణయించే పరిస్థితి వస్తుందని చెబుతున్నారు. ఈ విషయంలోనూ నిర్దిష్టమైన ప్రణాళిక ప్రజల ముందు ఉంచడం లేదు. రైతులు తమకు తామే సమాఖ్యలను ఏర్పాటు చేసుకొనే సౌలభ్యం కల్పించకుండా ప్రభుత్వమే



నియమించే ఏర్పాటు చేస్తుందన్నారు. అంటే అధికార పార్టీ కార్యకర్తలతో అటువంటి సమాఖ్యలను ఏర్పాటు చేసి, వాటిని రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చే ప్రయత్నం చేయడం కనిపిస్తుంది.

పంట అమ్ముడుపోకపోతే రైతు సంఘాలే కొనుగోలు చేసేలా సమాఖ్య వద్ద రూ.500 కోట్ల నిధి పెడుతామని అంటున్నారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి అవసరమైనప్పుడు రైతులను ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం రైతులు ఆపదలో ఉన్నప్పుడు ఏమీ చేయకుండా తప్పించుకుపోవడం చూసాము.

జిల్లాకొకరు చొప్పున హైదరాబాద్ నుంచి ప్రత్యేక అధికారులు రాష్ట్రంలోని 31 జిల్లాలకు వెళ్లి ఒక్కో గ్రామంలో రైతులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిస్థితిని అధ్యయనం చేస్తారని, క్రాప్ కాలనీలపై, రూ.8 వేల పెట్టుబడి సాయంపై రైతులకు అవగాహన కల్పిస్తామని అంటున్నారు. ఇప్పటికే కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి జిల్లా స్థాయిలో అవసరమైన అధికారులను సైతం పూర్తి స్థాయిలో నియమించలేకపోతున్నారు. అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించలేక పోతున్నారు. ఇంకా కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేస్తారంటే అభూత కల్పనలు మాత్రమే కాగలవు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా భూములు, రైతుల సర్వే జరుగుతున్నదని అంటున్నారు. ఇప్పటి వరకు అటువంటి వివరాలు ప్రభుత్వం వద్ద లేవా? గతంలో జరిపిన సమగ్ర సర్వే వివరాలు ఏమయ్యాయి? రైతులకు జారీ చేసిన పట్టాదార్ పాస్ పుస్తకాల వివరాలు లేవా? వ్యవసాయ శాఖ వద్ద గ్రామాల వారీ పంటల వివరాలు లేవా? లేని పక్షంలో వ్యవసాయ ప్రణాళికలను ఏ ప్రాదిపదికన రూపొందిస్తున్నారు?■

# ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థిగా రామ్‌నాథ్ కోవింద్



ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థిగా రామ్‌నాథ్ కోవింద్ పేరును బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రకటించారు. రామ్‌నాథ్ ప్రస్తుతం బిహార్ గవర్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గతంలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. బిజెపిలో దళిత నేతగా ఎదిగిన రామ్‌నాథ్ ఉత్తర్‌ప్రదేశ్ నుంచి రెండుస్లారు రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు.

సుదీర్ఘ చర్చల అనంతరం రాష్ట్రపతి అభ్యర్థిగా రామ్‌నాథ్ పేరు నిర్ణయించినట్లు అమిత్ షా తెలిపారు. బిజెపిలో అత్యంత ఉన్నతస్థాయికి ఎదిగిన దళిత నేత రామ్‌నాథ్ అని కొనియాడారు. ఎన్డీఏ అభ్యర్థి ఎవరన్న విషయాన్ని విపక్షాలకు ఫోన్ ద్వారా తెలియజేశామని.. వారంతా పార్టీలో చర్చించుకుని తమతో కలిసి వస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# షిమ్లాలో కమలం వికాసం



షిమ్లా మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి చరిత్ర సృష్టించింది. దాదాపు మూడు దశాబ్దాల కాంగ్రెస్ ఆధిపత్యానికి తెరదించుతూ బిజెపి ఈ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. మొత్తం 34 సీట్లకు బిజెపి 17 సీట్లు కైవసం చేసుకుంది. గత 26 సంవత్సరాలుగా అధికారంలో కొనసాగిన కాంగ్రెస్‌కు 12, సీపీఐ-ఎంకు ఒక సీట్ రాగా ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. మ్యాజిక్ ఫిగర్ 18కు ఒకటి తక్కువున్న స్వతంత్ర అభ్యర్థులు బిజెపికి మద్దతు తెలపనుండడంతో షిమ్లా మునిసిపల్ కార్పొరేషన్‌లోనూ బిజెపి అధికారంలోకి రావడం ఖాయంగా కనిపిస్తుంది.

# స్వచ్ఛత కోసం 'దర్వాజ బంద్'

స్వచ్ఛ భారత్ సాకారం దిశగా మోదీ ప్రభుత్వం మరో ప్రచారోద్యమానికి శ్రీకారం చుట్టింది. మురుగుదొడ్లు ఉపయోగించుకునేలా, బహిరంగ మల విసర్జన నివారించేలా 'దర్వాజ బంద్' పేరుతో భారత గ్రామాల్లో పెద్దఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తోంది. మే 30న మహారాష్ట్ర రాజధాని ముంబైలో బాలీవుడ్ లెజెండరీ యాక్టర్ అమితాబ్ బచ్చన్, కేంద్రమంత్రి నరేంద్ర సింగ్ తోమర్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సమక్షంలో ఈ 'దర్వాజ బంద్' లాంఛనంగా ప్రారంభమైంది. మరుగుదొడ్లు ఉన్నా ఉపయోగించుకోని వారు వాటిని ఉపయోగించుకునేలా చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ కార్యక్రమానికి వరల్డ్ బ్యాంక్ మద్దతునిస్తుంది. ఈ ప్రచారంలో నటి అనుష్క శర్మ పాల్గొని, 'దర్వాజ బంద్'కు మహిళల మద్దతు కూడగట్టనుంది. ఈ సందర్భంగా మరుగుదొడ్లలో వస్తోన్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేస్తూ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు.

-జనసందేశ్ ప్రతినిధి




మేడ్చల్ సబ్కా సాథ్ సబ్కా వికాస్ సమ్మేళనంలో ఎంపీ భగవత్ ఖూబా, డా॥ కె.లక్ష్మణ్



దోమలగూడలో మోదీ ఫెస్ట్ ప్రారంభించిన డా॥ కె.లక్ష్మణ్



సబ్కా సాథ్ సబ్కా వికాస్ సమ్మేళనంలో ఎంపీ కిరీట్ సోమయ్య



సిరిసిల్ల సబ్కా సాథ్ సబ్కా వికాస్ సమ్మేళనంలో పి.మురళీధర్ రావు



# DELHI PUBLIC SCHOOL
NADERGUL CAMPUS

# ART INFUSED SCHOOL




As an answer to the long awaited doorway of excellency in academics coupled with training in sports, Delhi Public school opened its third branch at Nadergul, for the residents around and in Nadergul along with the Seven Research Labs at DRDO, the TCS and the GMR groups. DPS – Nadergul comes with the strong vision and stands as a premier educational institute in the twin cities of Hyderabad and Secunderabad. The school follows the vision of its "Almamater" at Nacharam and promises to fulfil the academic, sporting and holistic needs of its students. As the vision of a true Global World School, Delhi Public School – Nadergul has already been associated with ITC, Green Sole and is currently on another project with UNICEF.

Survey No 469/1, Nadergul Village,Behind Noble Women's College,
Saroornagar Mandal, RR District,Hyderabad, Telangana – 501510

(+91) 7337329964

www.dpsnadergul.in




కిరీటాన్ని ధరించే శిరస్సు సుఖానికి దూరమవుతుంది. – షేక్స్పియర్